దిక్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక

సోమవారం, మార్చి 23, 2026 | సంపుటి - 20 | సంచిక 191 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## నేను ఇక కాంగ్రెస్‌లో ఉండలేను

### జీవన్‌రెడ్డి సంచలన ప్రకటన



జగిత్యాల : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి అత్యంత సీనియర్, గౌరవప్రదమైన నాయకుడు. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కి వెన్నుముకగా ఉన్న ఆయన, ఇప్పుడు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారనే వార్త రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.

తరువాయి 2లో

## ప్రభుత్వ లక్ష్యం

# రైతును రాజు చేయడమే

### తొలివిడత 70 లక్షల మంది ఖాతాలకు రైతుభరోసా నిధులు

### రైతు భరోసా నిధులను విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- ఎకరం వరకు ఉన్న రైతులకు రూ.3,600 కోట్లు విడుదల
- పంట సాగులో తెలంగాణ అగ్రస్థానంలో
- ప్రభుత్వ బడుల్లో అన్నిరకాల వసతులు

**రైతు భరోసా నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. తొలివిడత 70 లక్షల మంది ఖాతాలకు రైతుభరోసా నిధులు రిలీజ్ చేశారు. ఎకరం వరకు ఉన్న రైతులకు రూ.3,600 కోట్లు విడుదల చేశారు. ఆదివారం కావడంతో రైతుల ఖాతాల్లోకి సోమవారం నిధులు జమకానున్నాయి. మరో 20 రోజుల చొప్పున మిగతా రూ.5,400 కోట్లు జమకానున్నాయి. మరో 2 విడతల్లో రూ.2,700 కోట్లు చొప్పున రైతు భరోసా నిధులు జమకానున్నాయి.**



సిద్దిపేట : ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన రైతు ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. గతం కంటే రైతు భరోసా నిధులు పెంచామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతం కంటే రైతు భరోసా నిధులు పెంచామని తెలిపారు. పంటలకు మద్దతు ధరతో సహా రూ.500 బోనస్ ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతినెలా రైతుల సంక్షేమం కోసం రూ.5,500 కోట్ల వ్యయం అవుతుందని చెప్పుకొచ్చారు. 20 నెలల్లో రైతుల కోసమే రూ.లక్షా 40 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

తరువాయి 2లో



### నిరుపేదను ఆదుకోవాలన్న

## సంకల్పంతోటే జీవిత భీమా

### మీడియా ప్రతినిధుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

హైదరాబాద్, మార్చి 22: రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేదను ఆదుకోవాలన్న సంకల్పంతో జీవిత భీమా తీసుకువచ్చామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. తన పాదయాత్ర సమయంలో కుటుంబ పెద్దను కోల్పోయిన వారిని చూశానని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రాష్ట్రంలో పర్యటించే సమయంలో దయనీయమైన, నిస్సహాయమైన కుటుంబాలను చూశారని పేర్కొన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడ లేని విధంగా మొట్టమొదటి సారి కుటుంబ జీవిత భీమా ప్రవేశపెట్టాము. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేకంగా నిధులు కేటాయించాము. ఈ ఏడాది కూడా ప్రతి నియోజక వర్గానికి వెయ్యి ఇళ్లు కేటాయిస్తున్నాము. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉంటే..

తరువాయి 2లో



## హామీల అమలుకే నిధులు లేవు

### మూసీ ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడివి?

### టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

హైదరాబాద్ : మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు స్పష్టం చేశారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూల్చి వేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజి గూడలోని ఓ హోటల్‌లో మూసీ పునరుజ్జీవం - వాస్తవాలు అంశంపై టీబీజేపీ చీఫ్

తరువాయి 2లో



### గ్యాస్, చమురు సంక్షోభం వేళ

## ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం


హైదరాబాద్ : పశ్చిమాసియా యుద్ధం తీవ్రతతో దేశంలో నెలకొన్న గ్యాస్ సంక్షోభం, ముడి చమురు కొరత వంటి అంశాలపై ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. యుద్ధం కారణంగా భారత్‌లో గ్యాస్ నిల్వలు, విద్యుత్, ఎరువులు సరిపోను ఉన్నాయా? లేదా? అనే అంశంపై కేంద్ర మంత్రులతో ఆదివారం ప్రధాని ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరాలైన గ్యాస్, విద్యుత్, ఎరువుల పంపిణీలో అంతరాయం లేకుండా చూడాలని మోడీ సూచించారు. మూడు వారాలకు పైగా జరుగుతున్న పశ్చిమాసియా యుద్ధం ప్రభావంతో భారత్ ఇంధన కొరత, గ్యాస్ సరఫరాపై అనిశ్చితి నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. దేశ ప్రజల్లోని భయాలను తొలగించాలనే ఉద్దేశంతో ప్రధానంగా ఇంధన భద్రత, సరిపోను నిల్వలు ఉండేలా చూసుకోవడం, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించడం వంటి వాటిపై దృష్టి సారించారు.

తరువాయి 2లో

### రైతాంగం పచ్చగా ఉంటే

## రాజ్యం బాగుంటుంది

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




సిద్ధిపేట జిల్లా : ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట జిల్లాలో పర్యటించారు. నంగునూరు మండలం నర్మేట గ్రామంలో 300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించారు. అలానే అక్కడే 40 కోట్లతో చేపట్టనున్న ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2లో

### హైదరాబాద్‌కు అనేక

## విద్యాసంస్థలు తీసుకువచ్చా

### ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అప్పట్లో ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో హైదరాబాద్ పేరు ఉండేదని వివరించారు. హైదరాబాద్‌కు బిల్ క్లింటన్‌ను తీసుకొచ్చానని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు తెచ్చేందుకు అనేకమందితో చర్చించానని అన్నారు. భారత్‌లో కంపెనీలు పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరానని తెలిపారు. హైదరాబాద్‌లో ఐటీ ఆఫీస్ పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరానని పేర్కొన్నారు**

.హైదరాబాద్ : ఆదివారం హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఐఎస్‌బీలో సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్ నిర్వహించారు. ఏఐ వినియోగం, విస్తరణ లక్ష్యంగా ఈ సదస్సులో చర్చించారు. ఈ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. గతంలో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేదని పేర్కొన్నారు. కేవలం 9 నెలల్లోనే కృష్ణా నది నుంచి తాగునీరు తీసుకొచ్చామని తెలిపారు. 1990 తర్వాత మన దగ్గర ఇంటర్నెట్ ప్రారంభమైందని ప్రస్తావించారు. దేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయని చెప్పుకొచ్చారు. అప్పటికీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా ఏపీ ఉందని గుర్తుచేశారు.

2లో



### అమెరికా నుంచి భారత్‌కు

## భారీ ఎల్‌పిజి నౌక

మంగళూరు పోర్టుకు చేరుకున్న 'పైక్సిస్ పయనీర్' మంగళూరు : భారత్‌కు మరింత ఊరటనిచ్చే విషయం. అమెరికా నుంచి భారీ పరిమాణంలో ఎల్‌పిజితో కూడిన కార్గో నౌక ఆదివారంనాడు ఉదయం కర్ణాటకలోని న్యూ మంగళూరు పోర్ట్‌కు చేరుకుంది. పైక్సిస్ పయనీర్ అనే నౌక సుమారు 45,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పిజితో పోర్టుకు చేరుకుంది. దక్షిణ భారతదేశంలోని గృహ, పారిశ్రామిక అవసరాలకు

2లో

### జనసేన ఎమ్మెల్యే బాలరాజుకు

## సైబర్ నేరగాళ్ల టోకరా..



సైబర్ నేరగాళ్లు సామాన్యులతో పాటు వ్యాపారులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారు. తాజాగా ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన నేత చిర్రి బాలరాజుకు టోకరా ఇచ్చారు. ఆయన బ్యాంకు ఖాతా నుంచి భారీ మొత్తంలో నగదును కాజేశారు. ఈ ఘటనపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎమ్మెల్యే బాలరాజు మొబైల్‌కు ఆర్టీఏ చలానా చెల్లించాలంటూ ఓ మేసేజ్ రావడంతో అందులో ఉన్న లింక్‌ను ఆయన నిజమైనదని భావించి క్లిక్ చేశారు. ఆ లింక్ ద్వారా ఆయన ఫోన్‌లో ఓ మాల్వేర్ యాప్ ఇన్‌స్టాల్ అయింది. అది క్లిక్ చేసిన కొద్దిసేపటికే జంగారెడ్డిగూడెంలోని ఇండస్ ఇండ్ బ్యాంకులో ఉన్న ఆయన ఖాతా నుంచి సుమారు రూ.12 లక్షలు విత్‌డ్రా అయ్యాయి.

2లో

# నేను ఇక కాంగ్రెస్‌లో ఉండలేను

ఇటీవల జరిగిన పరిణామాలతో జీవన్ రెడ్డి పార్టీ హైకమాండ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'కాంగ్రెస్‌లో నాకు గౌరవం లేదు.. ఇక ఈ క్షోభను భరించలేను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. జీవన్‌రెడ్డి ఏమన్నారంటే.. ఈ నెల 25వ తేదీన తన రాజకీయ భవిష్యత్తు నిర్ణయం ఉంటుందని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాలుగా తనతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వాలని అన్నారు. జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో 25న తన ముఖ్య నేతలతో సమావేశమై ఓ నిర్ణయం తీసుకుంటానని చెప్పుకొచ్చారు. పార్టీలో కొనసాగలేనని.. ఈ క్షోభ భరించలేనని అన్నారు. పార్టీలో తనకు గౌరవం లేదని తెలిపారు. తనకు అన్యాయం చేసిన వారిలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఒకరని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి వల్ల తన గౌరవానికి భంగం కలిగిందన్నారు. తనకు రేవంత్ అంటే గౌరవం ఉన్నా.. తన సమస్యకు పరిష్కారం ఆయన దగ్గర కూడా లేదని తెలిపారు. పదిమంది ఎమ్మెల్యేలను పార్టీ వ్యవహారాలకు దూరం పెట్టగలరా..? అని ప్రశ్నించారు. మేడిగడ్డను రిపేర్ చేసే బాధ్యత లేదా..? అని నిలదీశారు. రైతాంగం సాగునీటికి ఇబ్బంది పడుతోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జీవన్ రెడ్డి అసంతృప్తికి కారణాలివే.. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడినా, ప్రస్తుతం పార్టీలో తనకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి (ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి) ఎమ్మెల్యే సంజయ్, ఇతర నేతల చేరికలు, వారికి పార్టీలో ప్రాధాన్యం పెరగడం జీవన్ రెడ్డి అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్య నేతల సమావేశం.. తన రాజకీయ భవిష్యత్తును తేల్చుకోవడానికి ఈ నెల 25వ తేదీన జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో తన అనుచరులు, ముఖ్య నేతలతో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు కార్యకర్తల సూచనల మేరకు తన తదుపరి కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు.'నాలుగు దశాబ్దాలుగా నాతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వండి. మీ అభిప్రాయం మేరకే నా భవిష్యత్ నిర్ణయం ఉంటుంది' అని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌పై ప్రభావం..? ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జీవన్ రెడ్డి వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేత పార్టీని వీడితే, అది కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బనేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సీనియర్లను కాపాడుకోలేకపోతున్నారనే విమర్శలు కాంగ్రెస్ హైకమాండ్‌పై వచ్చే అవకాశం ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. ప్రత్యామ్నాయ దారి.. ఆయన స్వతంత్రంగా ఉంటారా లేక మరేదైనా పార్టీలో చేరుతారా అన్నది ఉత్కంఠగా మారింది. ఒకవేళ ఆయన పార్టీ మారితే జగిత్యాల సమీకరణలు పూర్తిగా మారిపోనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్పారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత అలిగితే పార్టీ అధిష్ఠానం (ముఖ్యమంత్రి లేదా టీపీసీసీ అధ్యక్షుడు) వెంటనే రంగంలోకి దిగి ఆయనను బుజ్జగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. 25వ తేదీ లోపు ఆయనను శాంతింపజేస్తారా లేక ఆయన తన దారి తాను చూసుకుంటారా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


## ఒమన్‌లో ఆకస్మిక వరదలు..

### కారు కొట్టుకుపోవడంతో ఇద్దరు భారతీయులు మృతి, ఒకరు గల్లంతు

మస్కట్: ఒమన్‌లో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ నేపథ్యంలో వరద ప్రవాహంలో ఒక కారు కొట్టుకుపోయింది. అందులో ప్రయాణించిన నలుగురు మరణించారు. మృతుల్లో ఇద్దరు భారతీయులు ఉన్నారు. మరో భారతీయ మహిళ గల్లంతైంది. శనివారం ఈద్ సందర్భంగా ఒమన్ రాజధాని మస్కట్‌తో సహా పలు నగరాల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. వరద నీరు పలు ప్రాంతాలను ముంచెత్తింది. కాగా, ఒమన్‌లోని అల్ బతినా గవర్నరేట్‌లో వరద ప్రవాహంలో ఒక కారు కొట్టుకుపోయింది. అందులో ప్రయాణించిన వారిలో నలుగురు మరణించారు. మృతుల్లో ఇద్దరు భారతీయులు ఉన్నారు. కేరళలోని త్రిథాలకు చెందిన యూసుఫ్, షమ్లాగా వారిని గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన మరో మహిళ రమ్లా గల్లంతైంది. ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ఈ సంఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ జోక్యం కోరుతూ లేఖ రాశారు. ఒమన్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో కేరళలోని త్రిథాలకు చెందిన యూసుఫ్, షమ్లా మరణించినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. గల్లంతైన రమ్లా కోసం గాలింపు, సహాయక చర్యల్లో ఒమన్ అధికారులతో సమన్వయానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని సతీశన్ విజ్ఞప్తి చేశారు. అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి...

## రీజినల్ రింగ్ రోడ్డు కాస్త సాధారణ హైవేగా మార్పు!

హైదరాబాద్ చుట్టూ రావాల్సిన రీజినల్ రింగ్ రోడ్డు కాస్త ఇప్పుడు సాధారణ హైవేగా మారిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ట్రిపుల్‌ఆర్ డిజైన్‌లో భారీ మార్పులు చేశారు. భారీ వ్యయం వల్ల ట్రిపుల్‌ఆర్ ప్రత్యేకతలను తొలగించి సాధారణ హైవేగా మార్పు చేశారు. తొలుత దేశంలోనే 8 లైన్లతో కూడిన అతి పొడవైన రింగ్ రోడ్డుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసింది. అయితే దేశంలో మరో 20 ఏళ్ల వరకు రోడ్డు ట్రాఫిక్ కి 8 లైన్లు అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ఆరు లైన్లకు కుదించింది. తొలుత అన్నకున్న దాని ప్రకారం రింగ్ రోడ్డు పొడవునా ఎలక్ట్రిక్ లైట్లు, ఎల్‌ఈడీ స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థను ప్రతిపాదించారు. ఇప్పుడు ఎల్‌ఈడీ స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు భారీ ఖర్చుతో కూడుకున్నది అని చెబుతూ కేవలం గ్రామాలు తగిలే ప్రాంతాల్లో మాత్రమే లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తరహాలో ట్రిపుల్ ఆర్‌కు కూడా సర్వీస్ రోడ్డును ప్రతిపాదించారు. కానీ ఇప్పుడు కనీసం కచ్చా రోడ్డు యాక్సెస్ కూడా లేకుండా కేవలం ఖాళీ స్థలం మాత్రమే ఉండేట్లుగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తొలుత ట్రిపుల్ ఆర్‌పై గరిష్ట వేగం గంటకు 120-130 కిలోమీటర్లు ఉండగా.. ఇప్పుడు గరిష్ట వేగం తగ్గించి గంటకు 100 కిలోమీటర్లు మాత్రమే చేశారు. తొలుత ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలోనే మొత్తం 204 వంతెనలు నిర్మించాలని ప్రతిపాదించగా.. ఇందులో మూసీ నది మీద, మంజీరా నది మీద, హరిద్ర నది మీద, పలు వాగులు వంకల మీద వంతెనలు, కల్వర్టులు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇప్పుడు వంతెనల వ్యయం భారీగా ఉండటంతో సగానికి సగం కుదించారు. రోడ్డు నిలువు వాలు (వర్టికల్ కర్వ్) 1300 మీటర్లు ఉండేలా డిజైన్ అనుకున్నారు. అంటే 600 మీటర్ల దూరంలో పిల్లి సైజు జంతువు రోడ్డు దాటుతున్నా కనిపిస్తుంది. ముందే అప్రమత్తమై వేగాన్ని నియంత్రించే వీలు ఉండేది. కానీ ఇప్పుడు రోడ్డు నిలువు వాలు 650 మీటర్లకు కుదింపు.. అంటే కేవలం 360 మీటర్లు మాత్రమే విజిబిలిటీ ఉంటుంది. వాహనాలు ఒకవేళ పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తే ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.



# ప్రభుత్వ లక్ష్యం రైతును రాజు చేయడమే

వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రతి పంట సాగులో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.750 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించామని ప్రస్తావించారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా కొంటామని తెలిపారు. కొడంగల్‌లోనూ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని వెల్లడించారు. రైతుల ఆదాయం పెరగాలంటే వరి ఒక్కటే మార్గం కాదన్నారు. రైతులు పంటల మార్పిడికి కృషి చేయాలని సూచించారు. పంటల మార్పిడికి రైతులను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. పంటల మార్పిడితో రైతులకు మంచి ధర వచ్చేలా చూస్తామని భరోసా కల్పించారు. మిల్లెట్స్, ఆకు కూరలు, పామాయిల్ సాగుపై అన్నదాతలు దృష్టి పెట్టాలని సూచించారు. పామాయిల్ సాగుతో రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు.ప్రతి పంచాయతీ అంకాపూర్‌లా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రతి రైతు కారు కొనుక్కునేలా ఆదాయం పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు అదానీ, అంబానీ వంటివారు మాత్రమే సౌర విద్యుత్ వ్యాపారం చేసేవారని అన్నారు. తమ ప్రభుత్వం మహిళలతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించిందని ప్రస్తావించారు. మహిళల పేరుతోనే అన్ని సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని చెప్పుకొచ్చారు. పిల్లలను ప్రైవేట్ బడుల్లో చదివించాలనే ఆలోచన చేయొద్దని అన్నారు. ప్రభుత్వ బడుల్లో అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని ఉద్ఘాటించారు. విద్యార్థులకు పాలు, రాగి, జావ, పౌష్టికాహారం అందిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రైతాంగం పచ్చగా ఉంటే రాజ్యం బాగుంటుంది

ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ..' గత ప్రభుత్వ నిర్వాకల వల్ల ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నా రైతులకు భరోసా ఇస్తూ రూ. 2 లక్షల ఏకబిగిన రుణమాఫీ చేశాం. రైతాంగం పచ్చగా ఉంటే రాజ్యం బాగుంటుంది. మొదటి రెండేళ్లలో లక్షా 4 వేల కోట్లు రైతులకు ఇచ్చాం. రైతు కళ్లలో ఆనందం చూసే దాకా ఎవరేమన్నా వెనకడుగు వేయం. రాబోయే రోజుల్లో దిగుమతి చేసుకుంటున్న పంటలకు కూడా బోనస్ ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఈ రోజు ఆయిల్ పామ్ పంట 30 జిల్లాల్లో వస్తున్నది. అందుకే ఆగమేఘాల మీద ఇక్కడ ఆయిల్ ఫ్యాక్టరీ పూర్తి చేసి ప్రారంభించుకుంటున్నాం' అని తెలిపారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ..'కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఈ రెండేళ్లలో అమలు చేస్తూ వస్తున్నాం. ఎవరెన్ని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డికి ఒక విజన్, దూరదృష్టి ఉంది. కాంగ్రెస్, సోనియా ఒక మాట ఇస్తే అది నెరవేరుతుంది. కాంగ్రెస్ మైనార్టీల, పేదల, బీసీ, ఎస్సీల పక్షపాత ప్రభుత్వం' అని అన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ..' తెలంగాణ వస్తే ప్రజల ఆశలు నెరవేరుతాయన్న ఆశలు ప్రజల్లో ఉన్నట్టుగానే పక్కనే ఉన్న తపసుపల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు అందేలా చూడాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నాను. మల్లన్నసాగర్ కు భూములిచ్చిన రైతులకు ఇంకా చాలా మందికి పరిహారం అందలేదు. ప్రాజెక్టుకు భూములు త్యాగం చేసిన దుబ్బాక కు సాగు నీరు అందించాలని సీఎం కు విజ్ఞప్తి. గతంలో నేను ఎమ్మెల్యేగా పని చేసిన దుబ్బాక అభివృద్ధికి కృషి చేయాలి' అని ఆయన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్.. ' రైతుకు కావాల్సింది గిట్టుబాటు ధర. వ్యవసాయానికి వాతావరణం అనుకూలంగా ఉండాలి. ఎలాంటి వాతావరణం లో అయినా సాగు చేసే పంట ఆయిల్ పామ్. ఈ చుట్టుపక్కల రైతులంతా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలి. ఈ ఫ్యాక్టరీ నీ ఉపయోగించుకోవాలి. మాది రైతు రాజ్యం' అని ఆయన అన్నారు. 'ఈ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుంది. రైతును రాజు చేయడంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నది. కొంతమంది గుంటనక్కలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజల పక్షాన పనిచేస్తాం. సాధబైనామ సమస్యలను కూడా కొద్ది రోజుల్లో పరిష్కరిస్తాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం.సిద్దిపేటలో పింక్ కలర్ చొక్కాలు వేసుకున్న పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. మా టైం లో కట్టిణం అంటున్నారు.. మీరు తెల్ల కాగితాన్ని నల్లకాగితంగా చేస్తే, మా ప్రభుత్వం వచ్చాక నిర్మించాం. ఒంటి నిండా విషం నింపుకున్న వారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# హామీల అమలుకే నిధులు లేవు

రాంచందర్ రావు అధ్యక్షతన చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంచందర్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో



ఇచ్చిన హామీల అమలుకే నిధులు లేవంటున్నారని.. మరి మూసీ ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. మూసీ నది ప్రక్షాళన అంశంపై ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతల వైఖరి తెలియజేశారన్నారు. గతంలో తాము గండిపేట నీళ్లు తాగుతున్నామని గొప్పగా చెప్పుకునే వాళ్లమని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ జనాభా పెరుగుతోందని తెలిపారు. రాను రాను మంచినీరు కలుషితమవుతున్నాయని చెప్పారు. అన్ని నాలాలు పొంగుతుంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మూసీ నది నీరు చూస్తే.. ఇవేనా మనం తాగిందని అనుకుంటామన్నారు. వికారాబాద్‌లో మొదలైన మూసీ నది.. గండిపేట, నల్గొండ ద్వారా కృష్ణా నదిలో కలుస్తుందని చెప్పారు. ఈ నది వల్ల నల్గొండ, హైద్రాబాద్‌లలో ప్రవహించే ప్రాంతాల్లో పంటలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే డెవలప్‌మెంట్ లేదని గుర్తు చేశారు. 60 ఏళ్ల పాటు పాలించినప్పుడు మూసి నదిని ఎందుకు ప్రక్షాళన చేయలేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు నిప్పులు చెరిగారు.

## మూసీ సుందరీకరణ విధానానికి బీజేపీ వ్యతిరేకం: వెదిరె శ్రీరాం

మూసీ నది మన అందరిదని.. దాని వెంట జీవించే ప్రజల జీవనాధారంతోపాటు వారి భవిష్యత్తుతో ముడిపడి ఉందని మహారాష్ట్ర ప్రభుత్వ నీటి సలహాదారు వెదిరె శ్రీరాం వివరించారు. మూసీ సుందరీకరణకు బీజేపీ సపోర్ట్ చేస్తుందని తెలిపారు. కానీ మూసీ సుందరీకరణ చేసే విధానాన్ని మాత్రం బీజేపీ వ్యతిరేకిస్తుందన్నారు. మూసీ ప్లానింగ్ సరిగా లేదని.. ప్లానింగ్ సరిగా లేకపోతే బాధాకరంగా మిగిలి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం చాలా గొప్పదని.. చాలా జీవనదులున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మూసీలో చేపలు జీవించినపుడు.. మనుషులు ఈత కొట్టినపుడు.. మూసీ నదిని సుందరీకరణ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అన్ని డిపార్ట్‌మెంట్స్ వారితో కలిసి పని చేస్తేనే మూసీ ప్రక్షాళన విజయవంతం అవుతుందని వెదిరె శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. అన్ని రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళన జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రూ.160 కోట్ల డీపీఆర్‌తో ఏం చేస్తున్నారో తెలియడం లేదని సందేహం వ్యక్తం చేశారు. తాము తయారు చేసిన మూసీ మొదటి డీపీఆర్ ఇవ్వమంటే తమ అధ్యక్షుడు అనుమతితో ఉచితంగానే ఇచ్చేస్తామని పేర్కొన్నారు. మూసీ మిడిల్ పాయింట్ నుండి రెండు వైపులా 100 మీటర్ల మేర బఫర్ జోన్ అంటున్నారని తెలిపారు. మూసీకి రెండు వైపులా గోడ నిర్మించడం సరికాదన్నారు. ప్రొటెక్టెడ్ జోన్‌లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని వెదిరె శ్రీరామ పేర్కొన్నారు. వార్నింగ్, రెగ్యులేటరీ జోన్ నిర్మాణాలు ఉండవచ్చని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాలను మూసీ డీపీఆర్‌కు ఎట్లా అమలు చేస్తారన్నది మాత్రం డీపీఆర్‌లో లేదన్నారు. మూసీ వద్ద 55 కిలోమీటర్ల పార్క్ అవసరమా? అని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులు.. ప్రొటెక్టెడ్ జోన్‌లో లేరన్నారు. వార్నింగ్ జోన్లో వారిని ఖాళీ చేయించాల్సిన అవసరం లేదని చెప్పారు. మూసీ డీపీఆర్‌లో స్పష్టత లేదన్నారు. స్టేక్ హోల్డర్స్ పార్టిసిపేషన్ లేనిదే ఇలాంటి ప్రాజెక్ట్స్ ముందుకు వెళ్లవన్నారని వెదిరె శ్రీరామ్ తెలిపారు. వాటర్ క్వాలిటీతోనే ఏదైనా సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. డీపీఆర్‌లో కీ పెర్ఫార్మెన్స్ ఏమిటనేది లేదని చెప్పారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో 5 కిలోమీటర్లకు 4,200 మీటింగ్స్ పెట్టారని.. మరి మూసీ ప్రక్షాళనకు ఎన్ని మీటింగ్స్ పెట్టారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. సబర్మతికి రూ.1,100 కోట్లు ఖర్చు అయితే రూ.1,500 కోట్లు రెవిన్యూ వస్తుందంటూ వెదిరె శ్రీరాము గుర్తు చేశారు.

# నర్మెటలో అయిల్ పామ్ పరిశ్రమ కేసీఆర్ ప్రభుత్వం కృషి ఫలితమే..!

సిద్దిపేట జిల్లా నంగునూరు మండంలోని నర్మెటలో అయిల్ పామ్ పరిశ్రమ కేసీఆర్(ఖజ=) ప్రభుత్వం కృషి ఫలితమేనని సింగిరెడ్డి



నిరంజన్ రెడ్డి (ాఱఅస్త్రఱతీవసఎఎ చీఱతీుఱఅయిఱఅ =వసఎఎ) అన్నారు. ఒకప్పుడు ఆయిల్ పామ్ సాగును వ్యతిరేకించిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆయిల్ పామ్ పాట పాడుతున్నారని ఆయన విమర్శించారు. నర్మెటలో ఆయిల్ పామ్ పరిశ్రమ ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నర్మెటలో 16 నెలల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయిల్ పామ్ పరిశ్రమను పూర్తి చేసిందని గొప్పలు చెబుతున్నారి, మరి వనపర్తి జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఎందుకు పూర్తి చేయలేదు ? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ విస్తరణకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారం, వ్యవసాయ మంత్రిగా నా కృషి ఎంతో ముఖ్యమైనదని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏమాత్రం లేదని, అసలు ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల బాధ్యత లేదని ఆయన మండిపడ్డారు. రైతు భరోసా కుదింపు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులకు కాంగ్రెస్ సర్కారు రిబ్బన్ కటింగులు చేస్తోందని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. 'ఇక్రిశాట్' సంస్థను ఎవరు స్థాపించారు? ఎప్పుడు స్థాపించారు? ఎక్కడ ఉంది? వంటి విషయాలేవీ తెలియని ముఖ్యమంత్రి అది అమెరికా సంస్థ అంటున్నారని ఆయన రేవంత్‌పై విరుచుకపడ్డారు. రైతు భరోసా ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని రూ.12 వేలకు కుదించారని మాజీ మంత్రి విమర్శించారు. కుదించిన రైతుభరోసా కూడా రెండు సార్లు ఎగ్గొట్టారని, ఇప్పుడు 73 లక్షల మందికి ఒక ఎకరాకు ఇస్తాం.. మిగిలినవి తరువాత చూద్దాం అంటున్నారని ఆయన కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టారు. ఇది గ్యారంటీ లేని ప్రభుత్వమని, ఇచ్చిన హామీలు మరిచి రైతులను వేధిస్తోందని నిరంజన్ రెడ్డి తెలిపారు. నాడు ధాన్యం కొనుగోలుకు, మోదీకి ఏం సంబంధం అన్నారని, నేడు కేంద్ర మంత్రి చెప్పారు .. ధాన్యం కొనడం కుదరదని నిస్సిగ్గుగా చెబుతున్నారనే విషయాన్ని ఆయ న గుర్తు చేశారు.

## నిరుపేదను ఆదుకోవాలన్న సంకల్పంతోటే జీవిత భీమా

కోటి 6 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చి ఆహార భద్రత కల్పించాము. క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఉద్యోగులకు ఇస్తున్నాము. రాష్ట్రంలో 14 వేల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణం పూర్తి చేశాము'.. 'ప్రతి పేదవాడికి మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రాన్ని జోన్‌లుగా విభజించి ప్రణాళిక బద్దంగా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నాము. రాష్ట్ర వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాము. వరికి భోనస్ ఇస్తున్నాము. ప్రతిష్టాత్మక యూనివర్శిటీలు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ఉస్మానియా యూనివర్శిటీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించాము. గోదావరి పుష్కరాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నాము. బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబోతున్నాము. తెలంగాణలో జీవించటం అదృష్టం అనుకునే స్థాయిలో పాలన కొనసాగిస్తున్నాము' అని అన్నారు.

## గ్యాస్, చమురు సంక్షోభం వేళ ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం

గ్యాస్, ముడి చమురు, విద్యుత్, ఎరువులు వంటి వాటిని నిరంతర సరఫరా చేయడం, వీటి పంపిణీలో అలసత్వం ప్రదర్శించకూడదనే అంశాలపై కేంద్ర మంత్రులతో మోడీ చర్చించారు. ప్రధాని నివాసంలో జరిగిన ఈ అత్యవసర భేటీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశీ వ్యవహారాల శాఖామాత్యులు ఎస్.జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పాల్గొన్నారు.కీలక నిర్ణయాలివే.. అత్యవసర సమావేశంలో మంత్రి వర్గంతో చర్చించిన మోడీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతానికి మధ్యంతర చర్యల్లో భాగంగా కేంద్రం అన్ని రాష్ట్రాలకు కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరాను పెంచింది. విద్యా కేంద్రాలు, ఆస్పత్రులకు గ్యాస్ పంపిణీకి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపింది. గృహోపయోగానికి, కమర్షియల్ వినియోగదారులకు కొత్తగా పీఎన్‌జీ(పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్లు ఇవ్వాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.

## హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు తీసుకువచ్చా

1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీగా ఏపీ ఉందని వెల్లడించారు. మ్యాథ్స్, ఇంగ్లిష్‌లో భారతీయులకు మంచి పట్టు ఉందని చెప్పానని అన్నారు. హైదరాబాద్‌కు ఐఎస్‌బీ తీసుకురావడానికి ఎంతో కృషి చేశానని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం 5 వేల ఎకరాలు సేకరించామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అమెరికా నుంచి భారత్‌కు భారీ ఎల్‌పిజి నౌక

ఇది మరింత సాయపడనుంది. భారత్‌కు సాధారణంగా గల్ఫ్ దేశాల నుంచి గ్యాస్ దిగుమతులు అత్యధికం. తాజాగా పశ్చిమాసియా పరిణమాల నేపథ్యంలో అమెరికా నుంచి నేరుగా భారీ నౌక రావడం ఇంధన వనరుల వైవిధ్యీకరణలో భాగంగా భావిస్తున్నారు. మంగళూరు పోర్ట్ ద్వారా అన్‌లోడ్ చేసే ఈ గ్యాస్‌ను పైప్‌లైన్లు, ట్యాంకర్ల ద్వారా కర్ణాటకతో పాటు కేరళ, తమిళనాడులోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేయనున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు, గ్యాస్ ధరలు అస్థిరంగా ఉన్న వేళ, ఇలాంటి భారీ దిగుమతులు స్థానిక మార్కెట్లో ఎల్‌పిసి ధరలు అదుపులో ఉండటానికి దోహదపడతాయి.

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుకు సైబర్ నేరగాళ్ల టోకరా..



ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో షాక్‌కు గురైన ఎమ్మెల్యే బాలరాజు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయన జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సైబర్ నేరగాళ్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఐపీ అడ్రస్ ట్రాకింగ్ వంటి సాంకేతిక పద్ధతుల ద్వారా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## తెలంగాణ బిల్డింగ్ రూల్స్‌లో కీలక సవరణలు చేసిన కాంగ్రెస్ సర్కార్

తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012కి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక సవరణలు చేసింది. టీడీఆర్ వినియోగంపై కొత్త మార్గదర్శకాలను ఇస్తూ జీవో జారీ చేసింది. దీని ప్రకారం 21 మీటర్లకు పైగా ఎత్తు ఉన్న భవనాలను హై రైజ్‌గా గుర్తించనున్నారు. 750-2000 చదరపు మీటర్ల ప్లాట్లలో 18-21 మీటర్ల భవనాలకు టీడీఆర్ తప్పనిసరి చేసింది. అలాగే నాన్ హై రైజ్ బిల్డింగ్స్‌కు సెట్‌బ్యాక్‌ను రాష్ట్ర ప్రభుత్వం సడలించింది. హై రైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతినిచ్చింది. 2000చ.మీ.కు పైగా ప్లాట్లలో అదనపు అంతస్తులకు అవకాశమిచ్చింది. 40 ఫీట్ల రోడ్డు దగ్గర 3 అదనపు అంతస్తులకు అనుమతినిచ్చింది. 60 ఫీట్ల రోడ్డు దగ్గర 4 అదనపు అంతస్తులకు అనుమతిని ఇచ్చింది. 80 ఫీట్ల రోడ్డు దగ్గర ఐదు అదనపు అంతస్తులకు అనుమతి కల్పించింది. 10 అంతస్తులకు పైగా భవనాల్లో టీడీఆర్ వినియోగం తప్పనిసరి చేసింది.

# లొంగుబాట్లు సరే.. పునరావాసం?

'నెత్తురు పారనిదెన్నడో నా తెలంగాణ పల్లెలో... నేలకు రాలనిదెన్నడో నా తెలంగాణ పల్లెలో..' అని ఐదు దశాబ్దాలపాటు వేదనతో పోరాట పాటలు పాడుకున్న రోజులను చూసిన మనమే...'అమ్మ పిలుస్తుందయ్యా అన్నలారా.. మీ అయ్య పిలుస్తుండయ్యా గొంతు పోయేలా..' అని ఇవాళ లొంగుబాట్లను ప్రోత్సహిస్తూ పాటలు పాడిస్తున్న రోజులనూ చూస్తున్నం. కారణాలేవైనా లొంగుబాట్లు పెరిగాయి సరే, మరి లొంగిపోయిన నక్సలైట్లకు ఇచ్చే ప్రోత్సాహకాలు, పునరావాసాల విషయం ఎంతవరకు వచ్చిందనే ప్రశ్నలు ప్రభుత్వం ముందు నిలిచాయి. దశాబ్దాల పాటు అడవిని నమ్ముకొని, సిద్ధాంతాల కోసం పోరాడిన మావోయిస్టులు నేడు జనజీవన స్రవంతిలోకి వస్తున్నారు. అయితే, ఆయుధాలు వీడటంతోనే వారి సమస్యలు ముగిసిపోలేదు, సామాజిక, ఆర్థిక పునరావాసంతోనే వారికి నిజమైన సవాల్ మొదలవుతుంది. రాష్ట్రంలో 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 721 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. 2025 సంవత్సరంలో 509 మంది లొంగిపోగా, అందులో ఇద్దరు సెంట్రల్ కమిటీ సభ్యు లు, 11 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు. లొంగుబాట్ల తర్వాత 60 శాతానికి పైగా కేసుల్లో ప్రాథమిక సహాయం అందినప్పటికీ, పూర్తిస్థాయి పునరావాసం మాత్రం 40 శాతం లోపు మాత్రమే సాధ్యమైందని అంచనా. లొంగుబాట్లు సరే కానీ, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించడం కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాదు, అది అన్నివర్గాల అవసరంగా పరిగణించాల్సిన అవసరం ఉన్నది. లొంగుబాట్ల సందర్భంగా ప్రభుత్వం, పోలీసులు ప్రకటించిన రివార్డులు సకాలంలో అందకపోవడం వల్ల లొంగిపోయిన నక్సలైట్లు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా, వారి గత జీవనం కారణంగా ప్రజలు వారిని అనుమానంతో చూసే పరిస్థితులు కూడా ఉంటాయి. పోలీసులు మళ్లీ ఎలాంటి ఇబ్బందులు పెడుతారో అనే భయం సాధారణ పౌరులను వెంటాడుతూ, వారితో కలవనివ్వడం లే దు. దీంతో జనజీవన స్రవంతి అనే పదం లేకుండా పోయి, అతికష్టంగా జీవన స్రవంతి మాత్రమే సాగుతున్నది. నక్సలైట్లు దశాబ్దాల పాటు అడవుల్లో ఉండి ఉద్యమించిన స్థితికి, లొంగుబాటు తర్వాత సమాజంలో వివిధ కారణాలతో బతుకలేని పరిస్థితులకు, ఆర్థిక ఇబ్బందులకు లోనై, తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. చివరికి, కుటుంబ పోషణ భారమైన దుస్థితిలో కూడా కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడిన ఘటనలు జరగడానికి బాధ్యత కూడా ఈ సమాజంలో ఉన్న మనందరిదీ అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశాలపై దృష్టి సారించి, లొంగిపోయిన సమయంలో వారికి ప్రకటించిన నగదు, ఇతర ప్రోత్సాహకాలను ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే అందజేయాలి. అదేవిధంగా వారికిచ్చే ప్యాకేజీలు తక్షణ జీవనోపాధికి భరోసానిస్తాయి. వీరిలో చాలామంది చదువుకు దూరమైనవారు ఉంటారు కాబట్టి నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి బాధ్యతను ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా అమలు చేయాలి. ఉద్యానవన, పాడి పరిశ్రమ, టైలరింగ్, డ్రైవింగ్ వంటి రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం కల్పించి, చిన్నతరహా పరిశ్రమలు పెట్టుకొనేలా ప్రోత్సహించాలి. వీరిలో చాలామంది దశాబ్దాల తరబడి అడవుల్లో ఉన్నారు కాబట్టి, సొంత ఇల్లు ఉండదు. అందుకే ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. చట్టపరమైన రక్షణ కల్పిస్తూ, పాత కేసుల విషయంలో వేగవంతమైన పరిష్కారం చూపేలా ప్రత్యేక విభాగం పనిచేయాలి. కేసుల నుంచి వీరికి విముక్తి కలిగించి, భరోసా కల్పించాలి. దీంతోపాటుగా పోలీసు శాఖ ముందుకు వచ్చి, ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టడానికి ఆయా ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించాలి. లొంగిపోయిన నక్సలైట్లు కూడా ఇప్పుడు సాధారణ పౌరులేనని, వారితో కలిసిపోవడం వల్ల పోలీసుల నుంచి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అవగాహన కల్పించాలి. తుపాకీ పట్టిన చేతులు నాగలి పట్టినా, పనిముట్లు పట్టినా, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడినా అది ప్రజాస్వామ్య విజయమే అవుతుంది. లొంగిపోయిన నక్సలైట్లు గౌరవప్రదంగా బతికేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. అలాగే సమాజం కర్తవ్యం కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాల్సి సమాజంలో శాంతి పరిరక్షణకు ఈ అవకాశాన్ని ప్రభుత్వం వినియోగించుకోవాలి. లొంగిపోయిన నక్సలైట్లకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకొని, అన్నలు మళ్లీ అడవిబాట పట్టకుండా, సమాజంలో మళ్లీ ఆనాటి అశాంతి ప్రబలకుండా చూడాల్సిన తప్పనిసరి అవసరం కూడా ప్రభుత్వంపైనే ఉన్నది. ఈ దిశగా పాలలు ఆలోచించాలి. తగిన సంక్షేమ చర్యలు తీసుకోవాలి.

## కొడుకు హత్యకు కిరాయి హంతకుడ్ని నియమించిన మహిళ..

### ఆమెను హత్య చేసి డబ్బుతో పరార్

రాయ్‌పూర్: ఆస్తి వివాదం నేపథ్యంలో పెద్ద కుమారుడ్ని చంపాలని అతడి తల్లి ప్లాన్ చేసింది. కిరాయి హంతకుడ్ని నియమించింది. అయితే అతడు ఆ మహిళనే హత్య చేశాడు. పది లక్షల డబ్బు, నగలు దోచుకుని పారిపోయాడు. ఐదేళ్ల తర్వాత ఆ నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. (సఖ్ఖీఅ ఎబతీసవతీం షశీఖీఅ) 2021లో ఛత్తీసగఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో నివసించే ఒక కుటుంబంలో ఆస్తి వివాదం మొదలైంది. దీంతో శకుంతల యాదవ్, తన చిన్న కొడుకు అమిత్ యాదవ్‌తో కలిసి తన పెద్ద కొడుకును చంపడానికి ప్లాన్ వేసింది. వారికి తెలిసిన ఆసుపత్రి సెక్యూరిటీ గార్డు మిశ్రాను నియమించుకున్నారు. పెద్ద కుమారుడి హత్య కోసం రూ. 4 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అతడికి అడ్వాన్స్‌గా లక్ష చెల్లించారు. కాగా, ఆ డబ్బు తీసుకున్న మిశ్రా తన గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శకుంతల, ఆమె చిన్న కొడుకు అమిత్ చివరకు అతడ్ని గుర్తించారు. పెద్ద కుమారుడ్ని హత్య చేయకపోవడంతో అడ్వాన్స్‌గా ఇచ్చిన లక్ష తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి ఇంటికి వచ్చి ఆ డబ్బు ఇస్తానని అతడు హామీ ఇచ్చాడు. మరోవైపు కొన్ని రోజుల తర్వాత రాయ్‌పూర్‌కు మిశ్రా చేరుకున్నాడు. సహచరుడు కేతన్ తివారీతో కలిసి శకుంతల ఇంటికి వెళ్లాడు. ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించారు. దీంతో ఇద్దరూ కలిసి తాడుతో శకుంతల గొంతునొక్కి హత్య చేశారు.

# యుద్ధనౌకల్లో సైనిక తిరుగుబాట్లు!




ఇజ్రాయెల్ ఒత్తిడితో ఇరాన్‌పై కయ్యానికి కాలు దువ్విన అమెరికా పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. సుదీర్ఘ కాలం యుద్ధాన్ని కొనసాగించలేక, నిలిపివేయలేక అగ్రరాజ్యం సతమతమవుతున్నది. మిత్రదేశాల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంకటాన్ని ఎదుర్కొంటున్నది. బయట నుంచి వ్యతిరేకత సంగతి అటుంచితే, ఇప్పుడు సొంత సైన్యంలోనే తిరుగుబాటు మొదలైంది. అమెరికాకు చెందిన అతిపెద్ద యుద్ధనౌకను సొంత సైనికులే తగలబెట్టే స్థాయి ఉపద్రవం అమెరికాను ఆలోచనలో పడేసింది. అగ్రరాజ్యం, ప్రపంచ దేశాల పెద్దన్నగా పేరొంది, ఆధిపత్యంతో, సామ్రాజ్యవాద కాంక్షతో రగిలిపోయే అమెరికా పరువుపోయే పరిస్థితి వచ్చింది. అంతా నా ఇష్టం.. నేను చెప్పిందే శాసనం.. నా మనఃసాక్షికి మాత్రమే నేను జవాబుదారీ అంటూ విర్రవీగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. ఇరాన్ యుద్ధంలో పాల్గొంటున్న నౌకాదళ సైనికులు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఇరాన్‌పై యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్న అమెరికాకు చెందిన అతిపెద్ద యుద్ధనౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో మంటలు చెలరేగాయి. ఇది అగ్ని ప్రమాదం అని అమెరికా బయటకు చెప్తున్నది. కానీ ఈ మంటలు మామూలు మంటలు కాదని, సైనిక తిరుగుబాటు ఆగ్రహ జ్వాలలు అని విశ్వసనీయవర్గాల సమాచారం ఆధారంగా ప్రఖ్యాత మీడియా సంస్థలు కథనాలు వెలువరిస్తున్నాయి. అమెరికా నావికాదళ దర్యాప్తు సంస్థ కూడా నౌకలో జరిగిన ఘటనపై తిరుగుబాటు కోణంలో విచారణ చేపట్టింది. యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కొరత ఏర్పడింది. ధరలు భారీగా పెరిగిపోయి ఆర్థిక వ్యవస్థలు దుర్భరంగా మారాయి. దీనంతటికీ కారణమైన అమెరికా పట్ల చిరకాల మిత్రదేశాలు, గల్ఫ్ దేశాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అంతేకాకుండా అగ్రరాజ్యానికి దూరం జరుగుతున్నాయి. ఇదంతా ప్రపంచ వ్యాప్తంగా అమెరికా ఎదుర్కొంటున్న పరిస్థితి. అంతేకాకుండా ఇప్పుడు సొంత సైన్యంలోనే తిరుగుబాటు మంటలు రగులుతున్నాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నెలల తరబడి విధుల్లో ఉన్న సైనికులు విసిగివేసారిపోయారు. ఇదే సమయంలో యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ యుద్ధనౌకలో అగ్నికీలలు ఎగిసిపడ్డ ఘటనలో కుట్ర కోణం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. సైనికులు ఇంటికి తిరిగి రావాలనే ఆలోచనలో ఇలాంటి చర్యకు పాల్పడి ఉండారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో అగ్నికీలలు ఎగిసిపడటం సైనిక తిరుగుబాటు అనేది కేవలం పుకారు లేదా ప్రచారం ఎంతమాత్రం కాదు. ఈ వ్యవహారంపై విశ్వసనీయ సమాచారం ఉన్నట్టుగా ది న్యూయార్క్ టైమ్స్, ఫస్ట్‌పోస్ట్, గ్రీక్‌సిటీ టైమ్స్ కథనాలు ప్రచురించాయి. ఇదే విషయంపై అమెరికా నావికాదళం స్పందిస్తూ మార్చి 12న యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగినట్టుగా నిర్ధారించింది. మంటలు ముందుగా నౌక పక్క భాగంలోని లాండ్రీలో మొదలయ్యాయని పేర్కొన్నది. మంటలు 30 గంటల పాటు కొనసాగాయని, మొత్తం 600 మంది సైనికులు నివసించే గదులు దగ్ధమయ్యాయని స్పష్టంచేసింది. అదేవిధంగా దట్టమైన పొగ వల్ల ఇద్దరు సైనికులు గాయపడ్డారని వెల్లడించింది. అమెరికాకు చెందిన యుద్ధనౌకలలో యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ కొత్తది, ఖరీదైనది. దీని విలువ సుమారు 13 బిలియన్ డాలర్లు (రూ.1.1లక్షల కోట్లు). అయితే మంటలు వ్యాపించడానికి ముందుగా గుర్తుతెలియని వ్యక్తులు వాక్యూమ్ టాయిలెట్స్‌ను టీషర్ట్స్, తాళ్లతో మూసివేసినట్టు తెలుస్తున్నది. దీంతో ప్రమాద తీవ్రత పెరిగిందని మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించాల్సి వచ్చిందని వివరించింది. అమెరికా నావికాదళ నేర దర్యాప్తు సంస్థ (ఎన్‌సీఐఎస్) కుట్ర కోణంలో విచారణ చేపట్టింది. నౌకను మరమ్మతుల కోసం గ్రీక్‌కు తీసుకెళ్లాల్సి ఉన్నట్టు అమెరికా నౌకాదళ అధికారులు చెప్తున్నారు. అమెరికా సైనికులు ఇరాన్‌పై ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ సన్నాహాలు జరుగుతున్నప్పటి నుంచి పది నెలలుగా నౌకలోనే ఉన్నారు. నిరంతర ఆజ్ఞలు, హోర్ముజ్ జలసంధి వద్ద క్షిపణి ముప్పు, విధులు పొడగించడం, సెలవులు లేకపోవడంతో సైనికులు తీవ్ర అసహనంతో ఉన్నారు.

ఈ తతంగమంతా వదిలేసి ఇంటికి వెళ్లిపోదామనే ఉద్దేశంతో ఉన్నట్టు వాదన వినిపిస్తున్నది. ఇదే విషయంపై ఇరాన్ ప్రసార మాధ్యమాల్లో భయపడ్డ అమెరికన్లు సొంత యుద్ధనౌకను తగలబెట్టుకున్నారు అని కథనాలు ప్రసారమవుతున్నాయి. సైనికుల తీవ్ర అలసటే ప్రధాన కారణమని అమెరికా మీడియావర్గాల్లో వాదన వినిపిస్తున్నది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం గురించి భారతీయ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. ఇదంతా ఎక్కడో జరుగుతున్న పరిణామాలుగా చూడనక్కరలేదు. ఏ యుద్ధం వల్లనైతే అమెరికా సైనికులు అలసిపోయారో, అదే యుద్ధం మన దేశంలో చమురు, ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై ప్రభావం చూపుతుంది. భారత్ దిగుమతి చేసుకుంటున్న ఎల్పీజీలో 80-85% ఎల్పీజీ, చాలా వరకు ముడి చమురు, ఎల్ఎన్‌జీ గల్ఫ్ నుంచి హోర్ముజ్ జలసంధి మీదుగా దిగుమతి అవుతుంది. దిగుమతికి ఆటంకం ఏర్పడితే యుద్ధం ప్రభావం మన వంట గదులు, ప్రయాణాల మీద కూడా పడుతుంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభించింది. ఇరాన్ అణు ఇంధన కేంద్రాలను ధ్వంసం చేసి, ఆ దేశ నాయకత్వాన్ని తొలగించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగింది. గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్‌లో వేలాది మంది అమెరికా సైనికులు ఉన్నారు. కానీ యుద్ధం గురించి అమెరికా తమకు సమాచారం ఇవ్వలేదని ఆయా గల్ఫ్ దేశాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. ఇదే నేపథ్యంలో ఇరాన్ జరిపిన క్షిపణి ప్రతిదాడులు గల్ఫ్ దేశాల భూభాగాలను తాకాయి. ఈ దాడుల నుంచి రక్షించుకునేందుకు గల్ఫ్ దేశాలు తమ సొంత రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాల్సి వచ్చింది. అమెరికా మాత్రం కేవలం ఇజ్రాయెల్‌ను

రక్షించడంపైనే దృష్టి సారించింది. ఇప్పుడు చాలావరకు గల్ఫ్ దేశాలు ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాయి. అమెరికా వైఖరి పట్ల ఫిర్యాదు చేస్తున్నాయి. అమెరికా తమను ఒంటరిని చేసి వదిలేసినట్టు చెప్పుకొంటున్నాయి. మరోవైపు యూరోపియన్ యూనియన్ మిత్ర దేశాలు కూడా దాడులు ఆపాలని, చర్చలు జరపాలని కోరుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా మిత్రబలం క్రమంగా తగ్గుతున్నది. విమాన వాహక నౌకలు అమెరికా సైనిక శక్తికి ప్రతీకలు. వీటిలో గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ ఒక కీర్తి కిరీటం వంటిది. అణు ఇంధనంతో నడిచే ఈ యుద్ధనౌక 75 ఫైటర్ జెట్స్‌ను మోసుకెళ్తుంది. ఇందులో 5000 మంది నావికులు ఉంటారు. అమెరికా నిమిట్జ్ క్లాస్ యుద్ధనౌకలైన అబ్రహాం లింకన్, రొనాల్డ్ రీగన్ నౌకలను ఇరాన్ సమీపంలో దశాబ్దాలపాటు మోహరించింది. ఇటీవల మూడు యుద్ధనౌకలను పంపింది. తమను ఎవరూ ఏమీ చేయలేరని, ఓడించడం అసాధ్యమని బలం చాటుకోవడమే అమెరికా ఉద్దేశం. కానీ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ కథనం మరో పాఠం చెప్తున్నది. యంత్రాలు ఎంత శక్తిమంతమైనవైనా, వాటిని నడిపే మనుషులు విసిగిపోతే వ్యవస్థ కుప్పకూలుతుంది. అలాగే అమెరికా సైనికులు బహిరంగంగా తిరుగుబాటు చేయకపోయినా నిశ్శబ్దంగా విధ్వంసానికి పాల్పడినట్టు తెలుస్తున్నది. దీంతో అమెరికా రక్షణ గోడకు ఒక చిల్లు పడిందని నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికా సైన్యంలో ఇలాంటి నిశ్శబ్ద తిరుగుబాట్లు ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా సుదీర్ఘ యుద్ధాలు జరుగుతున్నప్పుడు అగ్రరాజ్య సైన్యంలో తిరుగుబాట్లు జరిగాయి. 1960-70లలో వియత్నాం యుద్ధం సమయంలో అమెరికా సైనికులు అలసిపోయి, సొంత సైనిక అధికారులపైనే గ్రనేడ్స్ విసిరారు. 1969-72 మధ్య కాలంలో ఇలాంటి 904 ఘటనలు జరగగా 86 మంది అధికారులు మరణించారు. వియత్నాం యుద్ధం తర్వాత సుదీర్ఘమైన యుద్ధాలు ఉండబోవని, సైనికుల రొటేషన్ పద్ధతి అమలు చేస్తామని అమెరికా ప్రభుత్వం తమ సైన్యానికి చెప్పింది. కానీ మళ్లీ ఇరాక్, అఫ్గనిస్థాన్‌తో సుదీర్ఘ యుద్ధాలు జరిపింది. అమెరికా సైనికులు కొందరు ఆత్మహత్యలు చేసుకోగా, మరికొందరు పారిపోయారు. మళ్లీ ఇప్పుడు గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో చెలరేగిన మంటలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. యుద్ధంలో జరిగే ప్రాణనష్టాన్ని దేశాల నాయకత్వాలు మర్చిపోతే బలమైన సైన్యాలు, యుద్ధనౌకలు కూడా నిశ్శబ్దంగా తిరుగుబాటు చేస్తాయి.

# ఆర్భాటపు బడ్జెట్‌లో మిగిలేది ఆయాసమే!

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్భాటాలు, అంకెల గారడీతో సాగింది. కేటాయింపులు పెంచి చూపుతూ మాటలకు పరిమితమైంది. రెండున్నరేండ్ల పాలనలో వివిధ రంగాలు కుదేలయ్యాయి. రాష్ట్ర సొంత ఆదాయం పడిపోయింది. సంపద పెంచడం, పంచడం రెండూ లేవు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయ వృద్ధి వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల చేతుల్లో డబ్బులు కనిపించేవి. కానీ నేడు ప్రతీ వర్గం ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక సతమతమవుతున్నారు. మరి ప్రభుత్వం చెప్తున్న తలసరి ఆదాయం పెరిగిందన్న లెక్కలు విడ్డూరంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం చూపుతున్న అంకెల్లో సంపద ఎవరి జేబుల్లోకి వెళ్లిందో కూడా ప్రభుత్వమే చెప్పాలి మరి! రాష్ట్ర ప్రభుత్వం 2026-27 సంవత్సరానికి రూ.3,24,234 కోట్లతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టింది. 2025-26లో ప్రభుత్వం రూ.3,04,965 కోట్లతో బడ్జెట్ పెట్టగా, కేటాయింపులు పెంచింది. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు గొప్పగా చెప్తున్నప్పటికీ వాటిని ఖర్చు పెట్టడంలేదు. 2024-25 బడ్జెట్‌ను రూ.2.91 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన ప్రభుత్వం, అందులో రూ.70వేల కోట్లను ఖర్చు చేయలేదు. ఈ విషయాన్ని 2025-26 బడ్జెట్ సమయంలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క ప్రకటించారు. బడ్జెట్‌లో రూ.70 వేల కోట్లు ఖర్చుపెట్టలేదంటే అది చాలా పెద్ద వైఫల్యమే. ఏదో ఒకటి ముందు చెప్పేద్దాం, ఖర్చు సంగతి తర్వాత చూద్దాంలే అన్నట్టుగా కాంగ్రెస్ పాలకులు వ్యవహరిస్తున్నారు. అంకెలు ఆడంబరంగా, చేతలు దిగదుడుపుగా ఉంటున్నాయి. తలసరి ఆదాయం విషయానికి వస్తే ప్రభుత్వం రూ.4,18,931 అని చెప్పింది. నిరుడు కంటే పెరిగినట్టు పేర్కొన్నది. కానీ మరోవైపు ద్రవ్యోల్బణం చాలా తక్కువగా ఉన్నది. నిజంగానే ప్రజల తలసరి ఆదాయం పెరిగినట్టయితే కొనుగోలు శక్తి పెరగాలి. కానీ పరిస్థితి అలా ఎందుకు లేదు? పోయిన సంవత్సరం కొన్ని నెలలపాటు ద్రవ్యోల్బణం మైనస్‌లోకి కూడా వెళ్లింది. కేసీఆర్ హయాంలో గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా ఉన్నాయి. వ్యవసాయం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందింది. సంపద సృష్టి, పంపి ణీ జరిగాయి. మెరుగైన సంక్షేమ పథకాలు అమలయ్యాయి. ప్రజల వద్ద డబ్బులు ఉండేవి. గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి మెరుగ్గా ఉన్నది. అంటే ద్రవ్యోల్బణం పెరిగింది. రాష్ట్ర అభివృద్ధిలో ఇదొక పాజిటివ్ పాయింట్ సూచిక. 5-6 శాతం ద్రవ్యోల్బణం పెరిగితే చాలా సానుకూల అంశమే. కేసీఆర్ హయాంలో సంపద సృష్టించి, పేదలకు పంచారు. అందుకే గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. కానీ కాంగ్రెస్ పాలనలో సంక్షేమం కుంటుపడింది. పెరిగిన సంపద సామాన్య ప్రజల చేతిలోకి కాకుండా కొద్దిమంది చేతిలోకి వెళ్లిందని, మెజారిటీ జనాలకు పంపిణీ జరగలేదని స్పష్టమవుతున్నది. ఇదే కదా బడేభాయ్ మోదీ, చోటేభాయ్ రేవంత్‌రెడ్డి తరహా పాలన. సంక్షేమం అంటే గిట్టదు. అదానీ లాంటి బడా వ్యాపారవేత్తలకు దోచిపెట్టడం అంటేనే నచ్చే వాళ్లకు పేదలకు సంక్షేమ ఫలాలు పంచడం నచ్చదు. కేసీఆర్ పాలనలో సంపదను పేదలకు పంపిణీ చేశారు. అందుకే మోదీకి, రేవంత్‌కు కేసీఆర్‌పై కోపం. వాళ్ల లెక్కలో సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలి గానీ పేదలకు పంచకూడదు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు భారీగా తెచ్చుకుంటున్నామని భట్టివిక్రమార్క చెప్పారు. సఖ్యతగా ఉండటం వల్లనే ఇది సాధ్యమైందని అన్నారు. కానీ అది సఖ్యత కాదు, లాలూచీ. మోదీ మాట ప్రకారం అదానీ కోసం రేవంత్‌రెడ్డి సేవ చేస్తున్నారు. అదానీ వ్యాపారాలకు రేవంత్ గేట్లు తెరుస్తుంటే మోదీ సఖ్యతగా ఉంటున్నారు. రాష్ట్రంలో అదానీ దోపిడీ వ్యాపారానికి కేసీఆర్ గేట్లు తెరవలేదు. అందుకే ఆయన పట్ల మోదీకి కోపం. దేశ సంపదను ప్రధాని మోదీ కార్పొరేట్లకు, ముఖ్యంగా అదానీకి దోచిపెడుతున్నారని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ విమర్శిస్తారు. కానీ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరుగుతున్న దోపిడీని గుర్తించడంలేదు. కేంద్ర ప్రభుత్వంతో తమతో సఖ్యత ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెప్పుకొంటున్నారు. ప్రభుత్వం మరో విచిత్రమైన వాదన వినిపించింది. వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను రీజినల్ రింగ్‌రోడ్డు బయటకు తీసుకెళ్తామని భట్టి తన ప్రసంగంలో పేర్కొన్నారు. సాధారణంగా వ్యవసాయ, ఆహార ఉత్పత్తులు జిల్లాల్లో ఉంటాయి. వీటి కోసం పరిశ్రమలు జిల్లాల్లో స్థానికంగానే ఉండాలి. తెలంగాణ మొత్తం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల వికేంద్రీకరణ జరగాలి. కానీ ఆర్ఆర్ఆర్ అవతల ఒకేచోట పరిశ్రమలు పెడుతామని చెప్పడం విడ్డూరం. నగరంలో ఎక్కడపడితే అక్కడ ఫార్మా పరిశ్రమలు ఉంటే కాలుష్యం పెరిగిపోతుంది. కాలుష్య నియంత్రణ కష్టం. కాబట్టి ఫార్మా పరిశ్రమలు ఒకే చోట ఉండాలని, కాలుష్య నియంత్రణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఫార్మాసిటీ కోసం భూములు సేకరించింది. రేవంత్‌రెడ్డి మాత్రం వికేంద్రీకరణ జరగాల్సిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఒకేచోట, ఒకేచోట ఉండాల్సిన ఫార్మా పరిశ్రమలను ఏడెనిమిది చోట్ల ఏర్పాటు చేస్తామని వింత విధానాలను తెరపైకి తీసుకొస్తున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కోసం రూ.18వేల కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పింది. కానీ ఇప్పటికే రెండుసార్లు ఎగ్గొట్టింది. ఎలాగూ ఇచ్చేది లేదని ప్రభుత్వానికి తెలుసు కాబట్టి, బడ్జెట్‌లో ఊరికే చెప్పినట్టు కనిపిస్తున్నది. రుణమాఫీ విషయంలోనూ రైతులను కాంగ్రెస్ మోసం చేసింది. ఇక ఆరు గ్యారెంటీల కోసం రూ.50,713 కోట్లు వెచ్చిస్తామని ప్రభుత్వం తెలిపింది.

# బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం

### బీఆర్ఎస్ బీసీ నాయకుల ఆగ్రహం



వేల్పూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ( దీజం ) లకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్‌కు చెందిన బీసీ ఆనాయకులు మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నాయకులు రాజపూర్ణనందం, మొండి అశోక్,శివసారి నర్సయ్య తదితరులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి కాంగ్రెస్ పార్టీ మరోసారి బీసీలను మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి రావడానికి బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ అంశాన్ని తేల్చకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు, కాంట్రాక్టుల్లో రిజర్వేషన్ల విషయాన్ని గవర్నర్ ప్రసంగంలో గానీ, బడ్జెట్‌లో గానీ ప్రస్తావించకపోవడం బీసీల పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. ముదిరాజ్, గంగపుత్ర, గొల్ల కురుమ, గౌడ, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక వంటి కులాలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని అన్నారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధ హోదా ఇవ్వాలని ప్రకటించిన ప్రభుత్వం ఆ అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని విమర్శించారు. ప్రతి జిల్లాలో బీసీ ఐక్యత భవనాలు, కొత్త డిగ్రీ కాలేజీలు, గురుకులాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీలు కూడా గాలిలో కలిశాయని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు పాతర వేసిన కాంగ్రెస్ పార్టీకి బీసీ సమాజం తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బట్టపూర్ ప్రవీణ్ యాదవ్, రేగుంట దేవేందర్,చౌట్పల్లి రవి,ఆర్మూర్ మహేష్, రాజా పూర్ణనందం,రేగుల్ల రాములు, దొంకంటి నర్సయ్య, కొత్తపల్లి అశోక్, ప్రవీణ్ యాదవ్ ,రామ్ రాజ్ గౌడ్, పాపాయి పవన్, మొండి అశోక్,కొల్లే నర్సయ్య,బింగి బాల చందర్ శ్రీనివాస్ పాలెం,పాలేపు అశోక్,రాజేశ్వర్ ,పర్స దేవన్న దొన్పాల్, మాణిక్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్సు పొందాలంటే ఇక అంత సులభం కాదు

ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్నెస్ మాడ్యూల్స్ పరీక్ష ఉత్తీర్ణత తప్పనిసరి ఎల్ఎల్ఆర్‌కు ముందు దరఖాస్తు చేసుకుని ఆన్‌లైన్‌లో రాయాలి ఏప్రిల్ ఒకటి నుంచి అమలుకు రాష్ట్ర రవాణా శాఖ ఏర్పాట్లు ఆరు మాడ్యూల్స్‌తో మూడు గంటల పాటు పరీక్ష నిర్వహణ రోడ్డు ప్రమాదాల నివారణకు తెలంగాణ సర్కార్ నిర్ణయం మన తెలంగాణ/హైదరాబాద్: రోడ్డు భద్రతపై రాష్ట్ర రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా ప్రమాదాలకు కారణమవుతున్న వారిని తగ్గించేందుకు ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త విధానాన్ని అమల్లోకి తెస్తోంది. ఇందుకు రవాణా శాఖ పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసింది. ఇక మీదట డ్రైవింగ్ లైసెన్సు పొందడం అనుకున్నంత సులభం కాదని రవాణా శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్ష ఏదో రకంగా చేసి లైసెన్సుతో బయటపడుతూ వచ్చారు. ఇక మీదట అటువంటి వాటికి చెక్‌పెడుతూ రవాణా శాఖ లైసెన్సుల జారీలో కఠినంగా వ్యవహరించేందుకు నిర్ణయించింది. ఏప్రిల్ ఒకటి నుంచి డ్రైవింగ్ లైసెన్సు పొందాలంటే ఎల్ఎల్ఆర్ దరఖాస్తు చేసే ముందే ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్నెస్ మాడ్యూల్స్ పరీక్షలో విజయం సాధించాల్సి ఉంటుంది. వాహన ప్రమాదాల నివారణ, డ్రైవింగ్ నిబంధనల పట్ల చైతన్యం తీసుకురావడం వంటి ప్రమాణాలను పాటించేందుకు వీలుగా ఈ కొత్త ఎంట్రీ లెవెల్ పరీక్షను నిర్వహించేందుకు రవాణా శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తోంది.

# సంపాదకీయం

## అంకెల గారడీలో సామాజిక న్యాయం ఎక్కడ?

ప్రజాస్వామ్యంలో బడ్జెట్ అంటే కేవలం ఆదాయ-వ్యయాల పట్టిక మాత్రమే కాదు. అది ఒక రాష్ట్రం ఎటు దిశగా పయనిస్తుందో, ఎవరి అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుంటుందో చెప్పే సామాజిక-ఆర్థిక దిశానిర్దేశం. ఒక రకంగా చెప్పాలంటే, బడ్జెట్ అనేది ప్రజల ఆశయాలకు అద్దం పట్టే రాజకీయ పత్రం. కానీ, మార్చి 20న శాసనసభలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్ అట్టడుగు వర్గాల్లో ఆశలు రేకెత్తించాల్సింది పోయి, తీవ్ర నిరాశను మిగిల్చింది. ముఖ్యంగా తెలంగాణ జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీల విషయంలో ఈ బడ్జెట్ 'అంకెల గారడీ'గానే మిగిలిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదం బహుజనులలో గొప్ప ఆశలు రేపిం ది. వనరుల సమాన పంపిణీ జరుగుతుందని అందరూ భావించారు. కానీ కాంగ్రెస్ పాలనలో 'నిధులు' అనే అంశం బీసీలకు అందని ద్రాక్షగానే మిగిలింది. 2014-15లో లక్ష కోట్ల రూపాయలతో ఉన్న రాష్ట్ర బడ్జెట్, నేడు మూడు లక్షల కోట్లు దాటింది. బడ్జెట్ పరిమాణం పెరిగిన నిష్పత్తిలో బీసీల అభివృద్ధిపై ఖర్చు పెరగకపోవడం గమనార్హం. ఇది కేవలం సాంకేతిక లోపం కాదు, ఒక నిర్మాణాత్మకమైన అన్యాయం. ప్రభుత్వ కుల సర్వే ప్రకారం రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీలకు ఈ బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ.12,511 కోట్లు మాత్రమే. అంటే మొత్తం బడ్జెట్లో బీసీల వాటా కేవలం 3.85 శాతం! జనాభాకు, కేటాయింపులకు పొంతన లేకపోవడం సామాజిక న్యాయం అనే మాటకు అర్థాన్నే మార్చేస్తున్నది. నిరుడు కేటాయింపులతో పోలిస్తే స్వల్పంగా పెరిగినట్టు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ నిధులు ఖర్చు కావడం లేదనేది చేదు నిజం. గడిచిన రెండేండ్ల గణాంకాలను పరిశీలిస్తే ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టమవుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.9,200 కోట్లు కేటాయించి కేవలం రూ.2,080 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే కేటాయించిన దాంట్లో 22 శాతం కూడా వెచ్చించలేదు. ఇక 2025-26లో రూ.11,400 కోట్లు కేటాయించి, సుమారు రూ.3,000 కోట్లే ఖర్చు పెట్టారు. అధికారంలోకి రాకముందు 'కామారెడ్డి డిక్లరేషన్' పేరుతో ఏటా రూ.20,000 కోట్లు, ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు బీసీల కోసం ఖర్చు చేస్తామని ఇచ్చిన హామీ నేడు ఎన్నికల మోసంగా మారిందా అనే అనుమానం కలుగుతున్నది. రెండేండ్లలో కనీసం రూ.5,000 కోట్లు కూడా ఖర్చు చేయకపోవడం బీసీల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపునకు నిదర్శనం. బీసీల స్వయం ఉపాధికి వెన్నెముకగా ఉండాల్సిన కార్పొరేషన్లు నేడు నిధులు లేక వెలవెలబోతున్నాయి. 2014-23 మధ్య కాలంలో బీసీ కార్పొరేషన్లకు రూ.2,642 కోట్లు కేటాయించి కనీసం 26 శాతం ఖర్చు చేశారు. కానీ, గత రెండేండ్ల కాలంలో రూ.1,363 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఎంబీసీ (ఎంబీసీ) కార్పొరేషన్, వివిధ కుల ఫెడరేషన్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కేటాయింపులు కాగితాలకే పరిమితమై, విడుదలైన నిధులు మాత్రం సున్నాగా మారడంతో లక్షలాది మంది చేతివృత్తుల వారు, నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోతున్నారు. ప్రభుత్వం వద్ద ఆర్భాటపు ప్రాజెక్టులకు, ఆడంబరపు ప్రచారాలకు భారీగా ఖర్చు పెడుతామని చెప్తున్నది. కానీ, బీసీల స్వయం ఉపాధి విషయం వచ్చేసరికి 'రెవెన్యూ లోటు'ను సాకుగా చూపిస్తున్నది. రాష్ట్రంలోని రైతు పథకాల్లోనూ బీసీలకు అన్యాయమే జరుగుతున్నది. తెలంగాణలో సుమారు 50 లక్షల భూమిలేని బీసీ కుటుంబాలు ఉన్నాయి. రైతు భరోసా వంటి పథకాలు భూమి ఉన్న వారికే లబ్ధి చేకూరుస్తుండటంతో, భూమి లేని నిరుపేద బీసీలకు ఈ పథకాల ద్వారా ఒక్క పైసా కూడా అందడం లేదు. ఫలితంగా సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నది. భూమి లేని కౌలు రైతులకు, రైతు కూలీలకు చేయూత అందిస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైంది? ఎంతకాలం బీసీలు కేవలం సబ్సిడీల మీదే బతకాలి? వారిని సాధికారులుగా, స్వావలంబన పొందేలా చేసే విజన్ ఈ బడ్జెట్లో ఎక్కడా కనిపించడం లేదు? ప్రభు త్వం చెప్తున్న 'ఫ్యూచర్ సిటీ', '3 ట్రిలియన్ ఎకానమీ' లక్ష్యాల్లో బీసీలు భాగస్వా ములు కాదా? వారికి వాటా లేకపోతే మాటల్లో చెప్తు న్న అభివృద్ధి ఎవరి కోసం? విద్యారంగంలో బీసీ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. సుమారు రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే దుస్థితి నెలకొన్నది. ఇతర రాష్ట్రాల్లో చదివే బీసీ విద్యార్థులకు ట్యూషన్ ఫీ చెల్లింపులు లేవు, ఉద్యోగ నియామకాల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేదు. విద్య, ఆర్థిక సహాయం లేకుండా బీసీలు ఎలా ఎదుగుతారు? మాటల్లో అంబేద్కర్ పేరు జపిస్తూ, బీసీలను విస్మరించడం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, ప్రజలను మోసం చేయడమే. బడ్జెట్లో వాటా కోరడం సాయం కాదు అది బీసీల హక్కు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆడంబరాల కోసం ఖర్చులు తగ్గించి, జ్యోతిబా పూలే బీసీ సబ్‌ప్లాన్ వెంటనే అమలు చేయాలి. బీసీ కార్పొరేషన్లకు కనీసం రూ.50,000 కోట్లు కేటాయించి, కులవారీ లబ్ధిదారుల డాటాను వెల్లడించాలి. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రోజులు పోవాలి. సామాజిక న్యాయం జరగకపోతే, రాబోయే రోజుల్లో బీసీ సమాజం ఐక్యంగా గళం ఎత్తడం ఖాయం.

# బిజెపికి సవాల్‌గా బెంగాల్ ఎన్నికలు




పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో బిజెపి తక్షణ ప్రాధాన్యతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అసోంను నిలుపుకోవడం, బెంగాల్‌ను గెలవడం లేదా కనీసం రాష్ట్రంలో తన స్థానాన్ని మెరుగుపరచుకోవడం, కేరళ, తమిళనాడులలో తన పరిధిని విస్తరింప చేసుకోవడం. ఐదు రాష్ట్రాలలో అసోం మాత్రమే బిజెపి ప్రస్తుత ఎన్నికల కంఫర్ట్ జోన్‌లో దృఢంగా కనిపిస్తున్నది. ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా కేరళ, తమిళనాడులలో పార్టీ చరిత్రాత్మకంగా ఉనికి కాపాడుకునేందుకు అలుపెరుగని పోరాటం చేయాల్సి వస్తున్నది. 2016 నుండి అధికారంలో ఉన్న అసోంను వరుసగా మూడోసారి గెలుపొందగలమని ధీమాతో బిజెపి ఉంది. తమిళనాడులో ఎఐఎడి ఎంకె నేతృత్వంలో చీలిక గ్రూపులను ఎన్‌డిఎలోకి తీసుకొచ్చి డిఎంకెను ఓడించాలనే ఎత్తుగడ బెడిసికొట్టిందని గ్రహించే అక్కడి గవర్నర్ ఆర్‌ఎన్ రవిని బెంగాల్‌కు పంపి ఆ రాష్ట్రంపై కసరత్తు చేస్తున్నది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శి, డిజిపి, సిటీ పోలీస్ కమిషనర్ వంటి కీలక అధికారులను మార్చడం ద్వారా ఏదో విధంగా అక్కడ మమతా బెనర్జీని గద్దె దింపాలని అడుగులు వేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. దేశవ్యాప్తంగా తన ప్రభావాన్ని చాటుతున్న బిజెపి, ఈసారి బెంగాల్ గడ్డపై ఎలాగైనా కాషాయ జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (దీదీ) తన 15 ఏళ్ళ అధికారాన్ని కాపాడుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. బెంగాల్ సంస్కృతి, అస్తిత్వాన్ని ప్రధాన అజెండాగా మార్చి బెంగాల్ కూతురుగా ప్రచారం సాగిస్తున్నారు. బిజెపిని బయటి పార్టీగా అభివర్ణిస్తూ, స్థానిక ఓటర్లలో సెంటిమెంట్ రగిలిస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా తృణమూల్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి కొద్దిసేపు ముందు ప్రధాని నరేంద్ర మోడీ ఓ ఎక్స్‌పోస్ట్‌లో నిన్న కోల్‌కతాలో జరిగిన ఆనందోత్సాహాల ర్యాలీ నుండి ముఖ్యాంశాలు! పశ్చిమ బెంగాల్ బిజెపికి మద్దతు ఇస్తోందని స్పష్టంగా తెలుస్తుంది.. అంటూ పేర్కొనడం గమనార్హం. అయినప్పటికీ బెంగాల్ ఎన్నికలు అత్యంత జటిలమైన ఎన్నికల పోరాటం కాగలదని బిజెపి నాయకులు ప్రైవేట్‌గా అంగీకరిస్తున్నారు. మమతా ప్రజాకర్షణ, పథకాల అమలులో ఆమె పాలనా నైపుణ్యం ముందు తట్టుకోవడం సాధ్యం కావడం లేదని చేతులెత్తేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో, గత దశాబ్దంలో సాధించిన పురోగతి ఆధారంగా విజయం వైపుకు దూసుకుపోయే ప్రయత్నం బిజెపి చేస్తున్నది. అయితే, పార్టీ తన పెరుగుదలను అసెంబ్లీ విజయంగా మార్చుకోలేకపోయింది. 2019 లోక్‌సభ ఎన్నికలలో దాని అద్భుతమైన ప్రదర్శన నుండి క్రమంగా ఆ పార్టీ ప్రాబల్యం తగ్గుతూ వస్తుంది. వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), కోల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రి అత్యాచార కేసు, షేక్ షాజహాన్ ఉదంతం వంటి వివాదాలను ఎదుర్కొంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అనుకూలంగా గ్రామీణ మహిళలకు నగదు బదిలీని అందించే లక్ష్మీర్ భండార్ వంటి సంక్షేమ పథకాల ప్రజాదరణ నెలకొంది. పశ్చిమబెంగాల్ జనాభాలో ముస్లింలు 27% మంది ఉండటంతో జనాభా కూడా బిజెపికి సవాలుగా ఉంది. టిఎంసి ప్రభుత్వంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ అవినీతి, అధికార వ్యతిరేకత, బెంగాల్ అంతటా హిందూ ఏకీకరణ అవకాశం వంటి అంశాల చుట్టూ ఎన్నికలను రూపొందించాలని బిజెపి ప్రయత్నిస్తోంది. అసోం లో పార్టీ దీర్ఘకాల రాజకీయ ప్రణాళిక - బంగ్లాదేశ్ నుండి అక్రమ వలసలకు వ్యతిరేకత, వలసలతో ముడిపడి ఉన్న ఆర్థిక, సాంస్కృతిక ఒత్తిళ్ల గురించి ఆందోళన చెందుతున్న అస్సామీ హిందువులలోని వర్గాలతో ప్రతిధ్వనించింది. బెంగాలీ మాట్లాడే ముస్లింల ఓటింగ్ సరళి మరో కీలక అంశం కాగలదు. వారి ఓట్లు కాంగ్రెస్, బద్రుద్దీన్ అజ్మల్ పార్టీ ఎఐయుడిఎఫ్‌ల మధ్య చీలిపోతే, అది బిజెపి వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా బిజెపికి ప్రయోజనం చేకూరుస్తుంది.

## పెళ్లి వేడుకకు వెళ్లివస్తుండగా దాడి

**చెక్ చేస్తున్న సమయంలో చేయిచేసుకున్న సైనికులు**

**ఇగ్నో ప్రొఫెసర్ ఆరోపణలపై సైన్యం విచారణ**

శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లో వాహనాల తనిఖీ సమయంలో కొందరు సైనికులు తనపై దాడి చేశారని యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు ఆరోపించారు. దీనిపై భారత సైన్యాధికారులు విచారణ చేపట్టారు. రాజౌరీ జిల్లాలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ఇగ్నోలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లియాఖత్ అలీ మరికొందరితో కలిసి ఒక వివాహ వేడుకకు హజరై కలకోట్‌కు తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్మీ సిబ్బంది తనపై దాడి చేశారని అలీ ఆరోపించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. 'నా కుటుంబంలోను ఎంతోమంది సైన్యంలో ఉన్నారు. అందుకు నేను ఎంతో గర్వపడతాను. కానీ, ఈ రోజు జరిగిన ఘటన ఆ గౌరవాన్ని తగ్గించింది. వారు నా గుర్తింపుకార్డును చూపించమన్నారు. అది చూపించేందుకు కారు దిగుతున్న నాపై అనూహ్యంగా దాడి చేశారు. వారి ఆయుధాలతో నా తలపై కొట్టి గాయపరిచారు. దీనికి వాళ్లు నాకు క్షమాపణ కూడా చెప్పలేదు. సైన్యం మన దేశానికి గర్వకారణం. నాకు న్యాయం జరగాలి' అని ప్రొఫెసర్ పేర్కొన్నారు. తన తలకు ఆరుకుట్లు పడినట్లు ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెల్లడించారు. దీనిపై ఆర్మీ అధికారులు స్పందించారు. ఉగ్రవాద కదలికలపై సమాచారం అందడంతో సైనిక సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలోనే ఈ ఘటన చోటు చేసుకుందని వెల్లడించారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు- పేర్కొన్నారు. అయితే, తనిఖీ సమయంలో ఆ వ్యక్తి విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి ఆయుధాలు లాక్కునేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన సిబ్బందితో గొడవ పడినట్లు వెల్లడించారు. దీనిపై పూర్తి విచారణ జరిపి, సిబ్బంది ఎవరైనా దురుసుగా ప్రవర్తించినట్లు- తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనను పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఖండించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మీని కోరారు. జమ్మూకశ్మీర్ భాజపా మాజీ అధ్యక్షుడు రవీందర్ రైనా కూడా దీనిపై స్పందించారు. మన దేశంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. దాడి ఎవరు చేసినా వారు తగిన పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని ప్రొఫెసర్‌కు హామీ ఇచ్చారు.

## తమిళంలో వైద్య విద్యాకోర్సులు

**ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం వెల్లడి**

చెన్నై : త్వరలోనే తమిళ మాధ్యమంలో వైద్యవిద్యా కోర్సులుండే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. తమిళంలో వైద్యకోర్సులు బిజెపి లక్ష్యం అని ప్రధాని మోడీ కూడా ఇలీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సైదాపేట సదయప్పన్‌వీధిలో కొత్తగా నిర్మించిన ఓ ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభించిన సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ..తమిళ మీడియం కామెంట్స్ చేశారు. ఎగ్మోర్‌లోని ప్రభుత్వ ప్రసూతి కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రానికి ప్రజాదరణ పెరుగుతోందని, మదురై, సేలం, కోవై ప్రాంతాల్లో కూడా వీటిని ఏర్పాటు- చేయనున్నట్లు- ఆయన తెలిపారు. తమిళ మీడియంలో ఎంబీబీఎస్ పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నదే సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మూడేళ్ళ క్రితమే వైద్యవిద్యకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను తమిళంలో తర్జుమా చేసే ప్రక్రియను తమిళనాడు -టె-స్ట్‌బుక్స్ సొసైటీ- పూర్తిచేసిందని తెలిపారు. ఈ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లో 7.5శాతం రిజర్వేషన్ కోటాలో చదువుకుని ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్‌లో చేరిన విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులు ఐదేళ్ళ పాటు- తమిళ మాధ్యమంలో చదవడంలో పలు సమస్యలున్నాయని, వాటిని సడలించడంపై ఆలోచించి నిర్ణయం తీసుకోనున్నట్లు- మంత్రి వివరించారు. ముదల్వర్ మెడికల్ షాపుల్లో మందులకు కొరత ఏర్పడినట్లు- మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవమ న్నారు. రాష్ట్రంలో మరో ఆరు వైద్యవిద్యా కళాశాలలను కొత్తగా ఏర్పాటు- చేసేందుకు అనుమతి కోరుతూ కేంద్రప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్రంలోవున్న అన్ని వైద్యవిద్యా కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు పనిచేస్తున్నారని, రాయపురం స్టాన్లీ వైద్య కళాశాలలో మాత్రమే ప్రిన్సిపాల్ పోస్టు భర్తీ చేయలేదన్నారు. అయినప్పటికీ మెడికోల సంక్షేమార్థం తాత్కాలిక ప్రిన్సిపాల్‌ను నియమించినట్లు తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్వహణలో వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీ అయిన వైద్యులు, నర్సుల పోస్టుల భర్తీకి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖామంత్రి కేఎన్ నెహ్రూ చర్యలు చేపట్టారన్నారు.


## భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ తారాగిరి.. ఏప్రిల్ 3న నేవీ అమ్ములపొదలోకి

ఇండియన్ నేవీలో అత్యాధునిక 'మిస్టైల్ పవర్ హౌస్ చేరబోతోంది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన స్టెల్త్ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ తారాగిరి ఏప్రిల్ 3న అధికారికంగా నౌకాదళంలో ప్రవేశించనుంది. ఈ విషయాన్ని రక్షణరంగ అధికారులు తెలిపారు. అత్యాధునిక ఆయుధాలు, రాడార్ల వ్యవస్థతో నిర్మించిన ఈ యుద్ధ నౌక విశాఖపట్నంలో జరిగే కమిషన్ కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతులు మీదుగా నేవీ అమ్ములపొదిలో చేరుతుంది. మన దేశం యుద్ధ నౌకల నిర్మాణం, రూపకల్పనలో స్వయంసమృద్ధి శక్తిగా ఎదుగుతోందని చెప్పడానికి తారాగిరి నిదర్శనం. ఈ నౌక 6,670 టన్నుల బరువు ఉంటుంది. ప్రాజెక్టు 17ఎ క్లాస్‌లో ఇది నాలుగో నౌక. మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డింగ్ లిమిటెడ్ నిర్మించిన మూడో నౌక. కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్లాంట్‌తో నడిచే తారాగిరి, అధిక వేగం, అత్యధికకాలం ప్రయాణించే శక్తితో బహుముఖ నౌకా కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ప్రపంచస్థాయి ఆయుధాగారం ఈ నౌక సొంతం. ఇందులో సూపర్‌సోనిక్ వేగం కలిగిన బ్రహ్మోస్ వంటి ఉపరితలం నుంచి ఉపరితలపైకి ప్రయోగించే క్షిపణులు, మధ్యస్థ స్థాయి ఉపరితలం నుంచి గగనతలంపైకి ప్రయోగించే క్షిపణులు, ఒకేసారి పలు లక్ష్యాలను గుర్తించి ట్రాక్ చేయగల మల్టీ ఫంక్షన్ రాడార్, ప్రత్యేకతలతో కూడి శత్రు జలాంతర్గాములపైకి దాడి చేయగల యుద్ధసామగ్రి ఉంటాయి. శత్రు దాడులను సిబ్బంది క్షణాల్లో తిప్పికొట్టేలా కాంబాట్ మేనేజ్‌మెంట్ సిస్టంతో వీటిని అనుసంధానించారు. మునుపటి డిజైన్ల కన్నా ఎంతో ఆధునికంగా రూపొందించిన ఈ యుద్ధనౌక.. శత్రు రాడార్లకు చిక్కకుండా ప్రత్యర్థులపై విరుచుకుపడుతుంది. ఈ నౌకలో 75 శాతంపైగా స్వదేశీ పరికరాల వినియోగంలో 200కుపైగా ఎంఎస్‌ఎంఈ సంస్థలు పాలుపంచుకున్నాయని, వేలాది మందికి ఉపాధి లభించిందని అధికారులు చెప్పారు. ప్రభుత్వ ఆత్మనిర్భరత కార్యక్రమానికి, స్వదేశీ నౌకాశ్రయాల అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ఇది ప్రతిరూపమని కేంద్ర రక్షణ శాఖ తెలిపింది. సముద్ర జలాల్లో అగ్రశ్రేణి వేటగాడిగానే కాకుండా, ఆధునిక దౌత్యంలోని సంక్లిష్టతలను, మానవీయ సంక్షోభాలను ఎదుర్కోవడానికి తారాగిరిని నిర్మించినట్లు అధికారులు చెప్పారు.



## కోపాన్ని అదుపులో పెట్టుకోవాలి !

తిరుమల : కోపాన్ని మనసు నుంచి తొలగించుకొనేందుకు మనిషికి నిరంతర సాధన చేయాలి. అలా చేస్తే శరీరం అదుపులోకి వస్తుంది. కోపం జయిస్తే ఇంద్రియాలను జయించవచ్చు. వసిష్ఠుడి మీద కోపంతో విశ్వామిత్రుడు ఘోర తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షం కాగా ధనుర్వేద రహస్యాలను బోధించమని కోరతాడు. శివుడు అంగీకరించి అన్ని అస్త్ర విద్యలను సిద్ధింప జేస్తాడు. ఆ అస్త్రాలను వసిష్ఠుడిపై ప్రయోగించగా ఆయన తన తపశ్శక్తితో వాటిని నిలువరిస్తాడు. క్షత్రియుడిగా ఉండి బ్రహ్మర్షిని జయించడం కష్టమని విశ్వామిత్రుడు తెలుసుకుంటాడు. బ్రహ్మర్షిగా మారడానికి దీర్ఘకాలం తపోదీక్ష వహిస్తాడు. బ్రహ్మ ప్రత్యక్షమై బ్రహ్మర్షిత్వాన్ని పొందావని చెప్పినా అతడిలో పూర్తిగా సంతోషం కలగదు. వసిష్ఠుడితో 'బ్రహ్మర్షీ!' అని పిలిపించుకోవాలని ఉందన్న కోరికను తెలియజేస్తాడు. వసిష్ఠుడు అలాగేనని పలుకుతాడు. అయితే ఆయన పూర్తిగా క్రోధాన్ని విడిచిపెట్టాడో లేదో తెలుసుకోవాలనే ఉద్దేశంతో విశ్వామిత్రుడు తనవద్దకు వస్తేనే బ్రహ్మర్షి అని పిలుస్తానని చెబుతాడు. విశ్వామిత్రుడు వసిష్ఠుడి వద్దకు వెళ్లగా ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించి దూరంగా పొమ్మంటాడు. ఆయన వెళ్లబోతుండగా మరలా రమ్మంటాడు. ఇలా పదేపదే చేసినా విశ్వామిత్రుడి ముఖంలో ప్రశాంతత చెదరకపోయేసరికి నిజంగానే బ్రహ్మర్షివయ్యావంటూ అభినందిస్తాడు. పతన హేతువైన క్రోధాన్ని గెలిచి చూడు, నువ్వే విశ్వామిత్రుడివవుతావు. అందుకే మనలో ఉన్న క్రోధాన్ని జయిస్తే..ప్రపంచాన్ని జయించడమే కాదు..భగవంతుడినీ జయించవచ్చు.



ఆధ్యాత్మికం

# అధికారంలో 840 రోజులు గడిచిన ఆరు గ్యారెంటీలు

# 420 హామీల అమలులో శూన్యం

### ● మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి



**ధర్మపురి, మార్చి 22, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే 840 రోజులు గడిచిన ఆరు గ్యారెంటీలు 420 హామీల అమలులో ప్రజలకు శూన్యమే కనిపిస్తుందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ధర్మపురి పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఖండిస్తూ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చి 840 రోజులు గడిచిన ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేయలేదని అన్నారు. వాస్తవానికి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని గద్దెనెక్కి తెలంగాణ ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని ఆయన పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన కూడా ఆరు గ్యారెంటీలకు సరైన బడ్జెట్ ప్రవేశ పెట్ట లేకపోయిందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ఎదురుచూస్తున్న 70 లక్షల మంది రైతులు, 22లక్షల మంది కౌలు రైతులు, కోటి మంది అక్కచెల్లెల్లు, లక్షలాది మంది విద్యార్థులు, అవ్వా తాతలు, దివ్యాంగులు, దళితులు, బీసీలు ఇలా అన్ని వర్గాల చెందిన ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్ లు మాట్లాడారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసి తమ చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, ధర్మపురి



మండల బిఆరెస్ కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్ నాయకులు ఓడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యాంసుందర్, మైనారిటీ నాయకులు ఆసీఫ్, రవూఫ్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నేని నర్సయ్య మరియు ధర్మపురి నియోజకవర్గ అన్ని మండలాల అధ్యక్షులు లోక మల్లారెడ్డి, గొస్కుల జలేంధర్, రాంచందర్ గౌడ్, సింహాచలం జగన్, మహేష్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 41వ డివిజన్ ప్రధాన నాలా పునర్ నిర్మించండి

### ● మా డివిజన్ అభివృద్ధికి సహకరించండి ● మేయర్‌ను కలిసిన సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 41 డివిజన్ అభివృద్ధికి సహకరించాలని రాబోయే బడ్జెట్ సమావేశంలో డివిజన్ లోని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామికి విజ్ఞప్తి చేసిన సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య. రామగుండం కార్పొరేషన్ పరిధి 41 డివిజన్ లో ప్రధాన నాల దాదాపుగా ఒకటిన్నర కిలోమీటర్ల పొడవు ఉంటుందని ఇండ్ల మధ్యలో ఈ నాలా ప్రవహించడం వల్ల ఇది జామైనప్పుడల్లా ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సూర్య అన్నారు. మొన్నటి ప్రజా పాలనలో 41 డివిజన్ కి నాలా శుద్ధి చేసే అవకాశం రాకపోవడం వల్ల మేయర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి 41వ డివిజన్లోని నాలాను శుభ్రం చేయడానికి శానిటేషన్ విభాగానికి ఆదేశాలు జారీ చేయాలని సూర్య అన్నారు. అంతే కాకుండా 30 సంవత్సరాల క్రితం నిర్మించిన నాలా అనేక మూలమలుపులో డ్యామేజ్ అక్కడి ఇళ్లకు అక్కడి పునాదులకు తీవ్ర ఇబ్బందులు జరుగుతున్న క్రమంలో 41వ డివిజన్లోని ప్రధాన నాలను పునర్ నిర్మించాలని సూర్య డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రధాన నాలాకు ఉన్నటువంటి కనెక్టింగ్ నాలా చిన్న కాలువలు కొన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని వాటిపై కూడా దృష్టి పెట్టాలని మేయర్ ని కోరడం జరిగింది. 41వ డివిజన్లో కొంత ఖాళీ స్థలం ఉన్నందున అక్కడున్నటువంటి 150-200 కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మహంకాళి స్వామి ఈ డివిజన్ పర్యటనకు వస్తానని మీరు అడిగిన వర్క్స్ చేపించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.



# రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించిన ఆర్ జి 3 ఓపెన్ కాస్ట్

### ● కార్మికులను అభినందించిన జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య

**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సి సిఎల్) పరిధిలోని రామగుండం ఓపెన్ కాస్ట్-3 గనిలో శుక్రవారం రోజున అత్యధిక ఓబి (2.35ఎల్‌బిసిఎం) మరియు 39,807 టన్నుల బొగ్గు ఉత్పత్తి మరియు రవాణా సాధించి ఈ ఆర్థిక సంవత్సరం కొత్త రికార్డును నెలకొల్పారు. ఈ అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు ప్రాజెక్టు అధికారులను, గని సిబ్బందిని మరియు కార్మికులను ఏరియా జనరల్ మేనేజర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ... నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో కార్మికులు ప్రదర్శించిన అంకితభావం మరియు సమష్టి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. భారీ యంత్రాల వినియోగం మరియు మెరుగైన ప్రణాళికతోనే ఈ స్థాయిలో ఉత్పత్తి సాధ్యమైందని ఆయన తెలిపారు. ముఖ్యంగా శుక్రవారం ఒకే రోజున అత్యధిక స్థాయిలో బొగ్గు తీయడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో ఆర్థిక సంవత్సరం చివరి వరకు మరిన్ని విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తితో పాటు రక్షణ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేయాలని సూచించారు. ఇందుకు కృషి చేసిన ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ ఉదయ్ హరిజన్,



మేనేజర్ శ్రీ భారత్ కుమార్ ని గని కార్మికులను, సూపెర్వైసర్లను, అధికారులను మరియు సహకరించిన యూనియన్ ప్రతినిధులను, జిఎం బండి వెంకటయ్య ప్రత్యేకంగా అభినందించారు. గని అధికారులు, సూపర్వైజర్లు మరియు కార్మికులు సమన్వయంతో పనిచేసి గని పేరును నిలబెట్టినందుకు వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులందరికి మిఠాయి పంపిణీ చేశారు.

# డంపింగ్ యార్డ్ తరలించాలి: ప్రజల ఆరోగ్యమైన లక్ష్యం..

### ● పదవులు అనుభవించిన నాయకులు ముఖం చాటేసారు ● డంపింగ్ యార్డ్ తరలించకుంటే రానున్న రోజులలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.. ● సబ్బని వెంకట్ సామాజిక కార్యకర్త

**హుజురాబాద్ మార్చి 22 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని సిర్సపల్లిలో ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్ పై సామాజిక వ్యక్త జెన్పాక్ట్ కంపెనీ వైస్ చైర్మన్ సబ్బని వెంకట్ తీవ్రంగా ధ్వజమెత్తారు. డంపింగ్ యార్డ్ తరలించాలి, రాజకీయ నాయకులు ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి తప్ప, పదవులే లక్ష్యంగా పని చేయకూడదని హితవు పలికారు. ఈ ప్రాంతంలో పదవులు అనిపించిన నాయకులు అందరికీ, అనుభవిస్తున్న నాయకులందరికీ ప్రజలకు పర్యావరణంలో ఉప్పు చేపడుతుందని తెలుసు అయినప్పటికీ కూడా నిర్లక్ష్య వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. అనంతరం పలువురు వక్తలు



మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ తరలింపుపై మొట్టమొదటిగా దిక్కర స్వరం వినిపించి, మా ప్రాంతానికి ముప్పు చేకూర్చకుండానే ప్రతి ఒక్క నాయకునికి తెలిపిన మా ప్రాంత బిడ్డ సబ్బని వెంకట్ కు మేమంతా అండగా ఉంటామని మా ప్రాంతం నుంచి



డంపింగ్ యార్డ్ తరలించే వరకు మా పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమం లో సిర్సపల్లి సర్పంచ్ పోల్సాని రామ రావు, మాజీ సర్పంచ్ ఎడ్ల విజయ్ కుమార్,రాజపలీ సర్పంచ్ మల్లన, కందుగుల మాజీ ఉప సర్పంచ్ బెల్లి రాజయ్య, మాందాడి పల్లి సర్పంచ్ ఎల్లయ్య, రిటైర్డ్ టీచర్ పలకాల ఈశ్వర్ రెడ్డి తదితరులతోపాటు నియోజవర్గం నుండి వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్మెట్ట తరలి వెళ్లిన రైతులు

### - జెండా ఊపి బస్సులను ప్రారంభించిన మంత్రి అడ్లూరి



**ధర్మపురి, మార్చి 22, (ది క్రైమ్ న్యూస్):** నర్మెట్ట తరలి వెళ్లిన ధర్మపురి రైతులకు జెండా ఊపి బస్సును ప్రారంభించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆయిల్ ఫామ్ కర్మాగారం ప్రారంభోత్సవానికి ధర్మపురి నియోజకవర్గం నుండి పలువురు రైతులు తరలి వెళ్లారు. వీరికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మీతో కలిసి ధర్మపురిలో జెండా ఊపి బస్సులను నర్మెట్ట కు సాగనంపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరణి నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు



**ధర్మపురి, మార్చి 22, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో భరణి నక్షత్రం సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుభంద దేవాలయం అయిన శ్రీ యమధర్మరాజు వారి ఆలయంలో శ్రీ యమధర్మరాజు వారికి పురుషసూక్తం, శ్రీ లక్ష్మీ సూక్తం, మన్య సూక్తంతో అభిషేకం ఆయుష్యహోమం తో ప్రత్యేక పూజలు హారతి మంత్రపుష్పం కార్యక్రమములు నిర్వహించడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు ఈ కార్యక్రమములో దేవస్థానం అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్ కుమార్ సిబ్బంది అర్చకులు మరియు అధిక సంఖ్యలో భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.



# సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ మానవత్వాన్ని చాటుకున్నారు




**సుల్తానాబాద్, మార్చి 22(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మానవత్వాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో కరీంనగర్‌లోని వజ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లారీ ఓనర్ మోత్కు అంజయ్య తల్లిని ఆయన స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చైర్మన్, ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఇలా ఆపదలో ఉన్నవారిని పలకరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# సహజంగా శరీరంలో కొలెస్ట్రాల్ కరిగించే ఆహారాలు ఇవే.. తప్పక తీసుకోండి

నేటి కాలంలో అనేక మంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ ప్రాథమికంగా ఒక రకమైన లిపిడ్. శరీరానికి అవసరమైన విధులు నిర్వర్తించడానికి ఇది చాలా అవసరం. ఈ కొలెస్ట్రాల్ ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లను తయారు చేయడానికి సహాయపడుతుంది. ఈ కారణాల వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం చాలా ముఖ్యం. అయితే దీని పరిమాణం పెరిగితే మాత్రం ప్రమాదమే. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ అనే రెండు రకాల కొలెస్ట్రాల్ ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం పెరిగినప్పుడు అనేక సమస్యలు వస్తాయి. ఈ కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని ఆహారాలు తీసుకోవాలి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది ఓట్ మీల్ తింటున్నారు. ఇందులో కొలెస్ట్రాల్‌ను కరిగించి నియంత్రించడంలో సహాయపడే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇందులో మోనోశాచురేటెడ్ కొవ్వు కూడా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పండ్లు కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. యాపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇదిచెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి రోజూ యాపిల్స్ తప్పక తినాలి. రెడ్ మీట్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి ఆహారాలను పూర్తిగా మానుకోవాలి. అవి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. అలాగే, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కేకులు, కుకీలు, పేస్ట్రీలు, జున్ను, నెయ్యి, వెన్న, చీజ్, జామ్ వంటి వాటికి కూడా దూరంగా ఉండాలి. మీగడ పాలు, దానితో చేసిన ఆహారం, నెయ్యి-వెన్న వీలైనంత తక్కువగా తీసుకోవాలి.అలాగే తగినంత నీళ్లు త్రాగాలి.దానితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరి. సరైన ఆహారాల అలవాట్లు సగం జబ్బులను నయం చేస్తుంది.

# గోదావరిని ఎండపెడుతున్న రేవంత్ రెడ్డికి పిండ ప్రదానం చేసిన కోరుకంటి చందర్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గోదావరిలో నీటి సమస్యను పరిష్కరించాలని వెంటనే నీటిని విడుదల చేయాలనీ పెద్దపల్లి జిల్లా నుండి గోదావరి కన్నీటి గోస పేరుతో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ 180 రోజులు పాదయాత్ర చేశారు. ఇది నేటికీ సంవత్సరం పూర్తి చేసుకున్న ఇప్పటి వరకు గోదావరిలో నీటిని విడుదల చేయకపోవడం, ప్రాజెక్టు మరమ్మత్తుల పేరిట ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గోదావరి నదిలో సంప్రదాయ పద్ధతిలో పిండ ప్రదానం చేసారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణ శివారులో ఎండిపోయిన గోదావరి నది ఇసుక తిన్నెలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలో రైతులు సాగు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ గులాబీ పార్టీ శ్రేణులు ఈ నిరసన ద్వారా ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిన గోదావరి నది తీరాన్ని నిరసన వేదికగా మార్చిన బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లతో కలిసి గ్రామీణ ఆటపాటల రూపంలో ప్రభుత్వంపై వ్యంగ్య నిరసన తెలిపారు. నది ఇసుకలో ఆటపాటలు నిర్వహిస్తూ సాగునీటి సమస్యపై ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ గ్రామీణ శైలిలో పాటలు పాడుతూ రైతుల కష్టాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తూ ఆందోళన చెందుతున్నారని, కానీ ప్రభుత్వం మాత్రం ఆ సమస్యను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ నిరసనకారులు సీఎం చిత్రపటానికి పిండప్రదానం చేశారు. ఈ చర్య ద్వారా రైతుల బాధలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలనే సంకేతాన్ని ఇవ్వాలనుకున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కూలిన కాళేశ్వరం ప్రాజెక్టు భాగాలకు కనీస మరమ్మత్తులు కూడా చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే రైతులకు ఈరోజు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న ఫిల్లర్లు, ఇతర భాగాలకు వెంటనే మరమ్మత్తులు చేపడితే గోదావరి నదిలో నీటి నిల్వలు పెరిగి రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని కోరుకంటి చందర్ తెలిపారు. రైతుల జీవనాధారం వ్యవసాయం కాగా, దానికి మూలమైన నీటి వనరుల పునరుద్ధరణలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల వేదనను అర్థం చేసుకుని సాగునీటి సమస్య పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజల సమస్యలను కూడా ఈ సందర్భంగా కోరుకంటి చందర్ ప్రస్తావించారు. పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన రామగుండంలో నివసించే ప్రజలు ఇప్పటికీ మురికి నీరే తాగాల్సిన దుస్థితిలో ఉన్నారని ఆయన ఆరోపించారు. తాగునీటి వంటి ప్రాథమిక అవసరాల విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన కొనసాగిస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రచార రాజకీయాలకే పరిమితమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతు, కార్మిక, సామాన్య ప్రజల సమస్యలను ఎత్తిచూపేందుకే ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిరసన కార్యక్రమం అంతటా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ప్రదేశాన్ని మార్మోగించారు. సాగునీరు అందించాలి, కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించాలి, రైతులను కాపాడాలనే డిమాండ్లతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గోదావరి ఎండిపోవడం కేవలం ప్రకృతి సమస్య మాత్రమే కాకుండా పాలనా వైఫల్యానికి కూడా సంకేతమని వారు పేర్కొన్నారు. ఈ వినూత్న నిరసన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎండిపోయిన నది మధ్యలో గ్రామీణ ఆటపాటలతో నిరసన తెలపడం ద్వారా బీఆర్ఎస్ నాయకులు ప్రజల దృష్టిని ఆకర్షించారు. రైతుల ఆవేదన, నీటి కొరత, ప్రాజెక్టుల నిర్లక్ష్యం వంటి అంశాలను ఒకే వేదికపై ఉంచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి. ఈ నిరసనలో పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపు ఐలయ్యా యాదవ్.మురళీధర్ రావు.తాళ్ల రాజయ్య.తోకల రమేష్.కర్క సుజాత.కృష్ణవేణి.పద్మ.అచ్చ వేణు.బొడ్డుపెల్లి శ్రీనివాస్.మెడి.సదానందం.కిరణ్ జీ..రామరాజు.బాలరాజు పాల్గొన్నారు.

# స్కీములకూ గండి - స్కాంలకు ప్రోత్సాహం....

**◆ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బడ్జెట్ ◆ తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ ◆ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కష్టాలు, కన్నీళ్లు, కూల్చివేతలు, పేల్చివేతలు.... ◆ రాష్ట్ర బడ్జెట్ పై మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధుకర్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బడ్జెట్ అని ,తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కీములకూ గండికొట్టి, స్కాం లను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు.రాష్ట్ర బడ్జెట్ పై ఆదివారం మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధుకర్ లతో కలిసి బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం క్రమంగా అటకెక్కిస్తున్నదని కేసీఆర్ పేరును కనుమరుగు చేస్తోందని ఆరోపించారు.రెండున్నరేండ్లలో 3.47 లక్షల కోట్ల అప్పు చేశామని గర్వంగా చెప్పుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఇదీ మేం పూర్తిచేసింది!' అని చెప్పేందుకు ఒక్క ఉదాహరణ లేదన్నారు.రూ.3,24,234 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఏమీ లేదన్నారు.2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత పన్నుల రాబడి రూ.1,11,798 కోట్లు వచ్చినట్టు నిరుటి బడ్జెట్‌లో పేర్కొన్న ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి రూ.1,09,233 కోట్లు వచ్చినట్టు తాజా బడ్జెట్‌లో ప్రకటించిందని, అంటే ఏడాదిలో రాష్ట్ర ఆదాయం పడిపోయిందని చెబుతున్నదన్నారు పదేండ్లలో 16 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధిరేటుతో దేశంలోనే తెలంగాణను టాప్‌స్టేట్‌గా కేసీఆర్ నిలబట్టారని, అటువంటి రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమనం లోకి నెట్టిందన్నారు.ఆరు గ్యారెంటీలను పూర్తి చేయడానికి కూడా చేతులు రాలేదని, తులం బంగారం, మహాలక్ష్మీ కింద మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇలా ఆరు గ్యారెంటీలకుఈసారి బడ్జెట్‌లో భారీ నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు.2025-26 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారెంటీలకు రూ.56,083 కోట్లు కేటాయించిందని, తాజా బడ్జెట్‌లో మాత్రం రూ 50,713 కోట్లకే పరిమితం చేసిందని అంటే రూ.5,370 కోట్లు కోత పెట్టిందన్నారు.మహాలక్ష్మి పథకం కింద 18 నుంచి 60 ఏండ్ల లోపు అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ.2500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. యువతులకు స్కూటీల పథకంపై ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం రూపాయి కూడా కేటాయించలేదు.రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల కుటుంబాలు లబ్ధిదారులుగా ఉండగా, ప్రభుత్వం 48 లక్షల కుటుంబాలకే గృహజ్యోతి పథకాన్ని వర్తింప చేస్తోంది.కేసీఆర్ ప్రభుత్వం నుంచి చక్కగా సాగుతున్న 1,023 గురుకుల పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రతి స్కూల్‌కూ రూ.200 కోట్లు ఖర్చు చేసి 109 స్కూళ్లు కట్టాలని ప్రభుత్వం భావిస్తున్నదని, గత బడ్జెట్‌లో రూ.2,900 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రూ.200 కోట్లు కూడా ఖర్చు చేయలేదని తాజా బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించిందని ఇలా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెల గారడీ ఉందన్నారు.వ్యవసాయానికి పెద్దపీట వేయాల్సిన ప్రభుత్వం నిధుల్లో కోత పెట్టిందని ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.24,439 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఈ ఏడాది రూ.1,260 కోట్లు కోత పెట్టి రూ.23,179 కోట్లకు కుదించిందన్నారు.రైతుభరోసా దశలవారీగా పెంచుతారని, ఎన్నికల హామీ మేరకు ఎకరాకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తారని రైతులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఈ బడ్జెట్లో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లే కేటాయించింది. గత బడ్జెట్‌లోనూ ఇంతే నిధులు కేటాయించింది, అంటే రైతు భరోసా నిధులు పెంచేది లేదని ప్రభుత్వం తేల్చేసిందని,రైతు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక కేవలం సన్నాలకే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కిందన్నారు. వాటికైనా పూర్తిస్థాయి నిధులు కేటాయించిందా? అంటే అదీ లేదు. రాష్ట్రంలో రెండు సీజన్లలో కలిపి కోటి టన్నుల సన్నాలు ఉత్పత్తి అయినట్టు ప్రభుత్వమే చెప్తున్నదని,రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా కల్పిస్తామని ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో బీమా పథకాన్ని ప్రకటించింది. కానీ ఈ పథకం అమలుపై స్పష్టత లేదన్నారు ఈ బడ్జెట్ రాష్ట్రంలోని దళితులను కూడా మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేయడం కొత్త కాదని, భట్టి విక్రమార్క గారు డా. బి.ఆర్. అంబేద్కర్ అడుగుజాడల్లోనే పాలన సాగిస్తున్నామని చెబుతూనే, ఎన్నికల్లో ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద రూ.12 లక్షల హామీని పూర్తిగా విస్మరించారు. అందుకే ఈ బడ్జెట్‌లో ఆ పథకానికి నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కష్టాలు, కన్నీళ్లు, కూల్చివేతలు, పేల్చివేతలు అని విమర్శించారు.బట్టి విక్రమార్క గారి ప్రసంగం అన్ని పచ్చి అబద్ధాలు... మోసాలతో కూడిన మాటతో నడిచిందని, గత బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలబెడితే కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో తెలంగాణను తిరోగమనంలోకి నెట్టేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పంటినొప్పికి.. ఇంటి చిట్కాలు



పంటినొప్పి.. భరించలేని సమస్య. దాని ప్రభావం ముఖం, తలమీద కూడా ఉంటుంది. కారణం ఏదైనా పంటినొప్పికి మనవాళ్లు ఇంటిచిట్కాలకే ప్రాధాన్యం ఇస్తారు. అలాంటి ప్రభావవంతమైన చిట్కాలు ఓ ఐదు ఉన్నాయి. అయితే, ఇవి వైద్యుడి చికిత్సకు ప్రత్యామ్నాయాలు మాత్రం కాదు. చిట్కాలు ప్రయోగించినా పంటినొప్పి తగ్గలేదంటే వైద్యుణ్ని సంప్రదించడం మానుకోవద్దు. ఉప్పునీళ్లు ఉప్పులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఉప్పునీళ్లను పుక్కిలించినప్పుడు నోట్లో ఉండే బ్యాక్టీరియా నశించిపోతుంది. నొప్పి, మంట కూడా తగ్గిపోతుంది. దీనికోసం ఓ గ్లాసు గోరువెచ్చటి నీళ్లలో టీస్పూన్ ఉప్పు కలుపుకోవాలి. ఈ ద్రావణాన్ని ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా రోజులో కొన్నిసార్లు చేస్తూ ఉండాలి. ముఖ్యంగా తిన్న తర్వాత, పడుకునే ముందు పుక్కిలించడం మర్చిపోవద్దు. లవంగం నూనె పంటినొప్పి ఉపశమనానికి వందల ఏండ్లుగా లవంగం నూనెను ఉపయోగిస్తున్నారు. ఇందులో కూడా ఎనల్జీసిక్, యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువే. లవంగం నూనెలో ఉండే యూజెనాల్ అనే మూలకం పంటినొప్పి నుంచి తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుంది. పత్తి ఉండను తీసుకుని దాన్ని కొన్నిచుక్కల లవంగం నూనెతో తడపాలి. తర్వాత నొప్పిగా ఉన్న దంతాలు, చిగుళ్ల దగ్గర మర్దన చేయాలి. రోజులో పలుమార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మంచుముక్కలు ఓ పల్చటి వస్త్రంలో మంచుముక్కలు తీసుకోవాలి. దీంతో నొప్పి ఉన్న దగ్గర్లో బుగ్గపై రుద్దుకోవాలి. ఇలాఓపది పదిహేను నిమిషాలపాటు చేస్తేనొప్పి ఉన్నచోట మొద్దుబారినట్టుగాఉంటుంది.పంటినొప్పిని తప్పించుకోవడానికి ఈ ప్రక్రియను కొన్నిగంటలకోసారి చేస్తూ ఉండాలి. పెప్పర్‌మింట్ టీ దీనిలో పుదీనా ఉంటుంది. దీనికి నోటిని చల్లగా చేస్తూ తిమ్మిరి కలగజేసే గుణాలు ఉంటాయి. పెప్పర్‌మింట్ టీని నోట్లోకి తీసుకోవడం ద్వారా పంటినొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. చల్లటి పెప్పర్‌మింట్ టీని నోట్లో ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయడం మంచిది. పెప్పర్‌మింట్ టీ బ్యాగ్‌ను నొప్పి ఉన్నచోట ఉంచినా ఇదే ఫలితం ఉంటుంది. ఇలా వీలైనన్ని సార్లు చేయాలి. వెల్లుల్లి వెల్లుల్లిలో యాంటీమైక్రోబియల్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. దీనిలో ఉండే అలిసిన్ చెడు బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఓ వెల్లుల్లి రేకును మెదుపుకోవాలి. దీన్ని నేరుగా చిగుళ్లు, పంటిపై ఉంచాలి. వెల్లుల్లి రేకును, పేస్టును చప్పరించినా మంచి ఫలితాలే ఉంటాయి.

## పంచామృతం అంటే ఏంటి..? ఎలా తయారు చేసుకోవాలి..

## ఆరోగ్యానికిది అమృతంతో సమానం..!



దేవుడికి పంచామృతాలతో అభిషేకం చేస్తారు. భారతీయ సంప్రదాయం ప్రకారం, పంచామృతం అనేది పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార లేదా బెల్లం మిశ్రమం. ఇవి ఐదు పవిత్ర పదార్థాలు హిందూ మతంలో ఆరాధన, భక్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పంచామృతం హోమం హవన్, పూజ సమయంలో అనేక మతపరమైన ఆచారాలలో ఉపయోగిస్తుంటారు. ఈ ఐదు పదార్థాలను ఉపయోగించడం ద్వారా, దేవునికి అంకితమైన పవిత్రమైన, స్వచ్ఛమైన నైవేద్యం సిద్ధమవుతుంది. ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని సమతుల్యం చేయడానికి దోహదం చేస్తుంది. ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పండ్ల నుంచి వచ్చే రసం గానీ, కొబ్బరి నీళ్లు గానీ కలిపితే పంచామృతం అవుతుంది. ఐదు పవిత్ర పదార్థాలతో తయారు చేసే ఈ పదార్థం.. దేవుడికి అభిషేకం చేయడానికి, పూజలో ఉపయోగిస్తారు. పంచామృతాన్ని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? పూజలో పంచామృతాన్ని ఎందుకు ఉపయోగిస్తారు..? ఇక్కడ తెలుసుకుందాం.. పంచామృతం ప్రయోజనాలు: 1. పాలు: పాలు స్వచ్ఛత, పోషణకు చిహ్నంగా పరిగణించబడతాయి. 2. పెరుగు: పెరుగు ఆరోగ్యం, శ్రేయస్సుకు చిహ్నంగా పరిగణించబడుతుంది. 3. నెయ్యి: నెయ్యి జ్ఞానం, కాంతికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 4. తేనె: తేనె మాధుర్యం, జీవితానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 5. గంగాజలం: గంగాజలం స్వచ్ఛతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. పంచామృతం ఆచార ప్రయోజనాలు: పంచామృతం దేవతలను అభిషేకించడానికి ఉపయోగిస్తారు. దేవతలకు పంచామృతాలతో అభిషేకం చేయడం వల్ల దేవతలు త్వరగా ప్రసన్నమవుతారని, భక్తుల కోర్కెలు నెరవేరుతాయని విశ్వాసం. పూజలో కూడా పంచామృతాన్ని ఉపయోగిస్తారు. పంచామృతాలతో దేవుడిని పూజించడం ద్వారా పూజా ఫలాలు రెట్టింపు అవుతాయని విశ్వాసం. ఆధ్యాత్మిక ప్రయోజనాలు: పంచామృతం మనస్సును శాంతపరచడంలో, ఏకాగ్రతను పెంచడంలో సహాయకరంగా పరిగణించబడుతుంది. పంచామృతం ప్రతికూల శక్తిని వదిలించుకోవడానికి, సానుకూల శక్తిని ఆకర్షించడంలో సహాయపడుతుందని విశ్వసిస్తారు.

## పరగడుపున టమాటాలు తింటే ఇలా అవుతుందా..?

## ఖచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయం ఇది..!

ఇంట్లో కూరగాయలు, పప్పు రుచిని పెంచడానికి ఉపయోగించే టమాటాలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. టమాటాలను తరచుగా కూరలు, సలాడ్‌లు, సూప్‌లు, చట్నీలలో ఉపయోగిస్తారు. టమాటాలు చర్మ ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా పనిచేస్తాయి. టమాటాలను అందం కోసం కూడా చాలా హోం రెమెడీస్ లో ఉపయోగిస్తుంటారు. అంతే కాదు, టమాటాలను అనేక సౌందర్య ఉత్పత్తులలో కూడా ఉపయోగిస్తారు. టమాటాలో విటమిన్ సి, లైకోపీన్, విటమిన్ కె, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. దీన్ని తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. టమాటా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది . టమోటాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం. టమాటా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. 1- బాగా పండిన టమాటాలను ఉదయం పూట నీళ్లు తాగకుండా ఖాళీ కడుపుతో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. 2- రికెట్స్‌తో బాధపడుతున్న పిల్లలకు రోజూ ఒక గ్లాసు టమాటా రసం ఇవ్వాలి. దీంతో వారికి ఎంతో మేలు జరుగుతుంది. 3- టమాటా తినడం వల్ల పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుంది. 4- బరువు తగ్గడానికి, మీరు టమాటాలు తినండి. మీరు టమాటాను సలాడ్‌లో కూడా చేర్చుకుని తినవచ్చు. లేదా 1-2 గ్లాసుల టమాటా రసం చేసుకుని కూడా తాగొచ్చు. 5- ఆర్థరైటిస్‌తో బాధపడేవారు టమాటా తినాలి. టమాటా జ్యూస్‌లో సెలెరీని కలిపి తాగడం సహాయపడుతుంది. 6- గర్భిణీలకు కూడా టమాటా మేలు చేస్తుంది. దీని కారణంగా శరీరానికి విటమిన్ సి లభిస్తుంది. గర్భధారణ సమయంలో శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 7- కడుపులో నులిపురుగుల సమస్య ఉంటే ఖాళీ కడుపుతో టమాటా ఎండుమిర్చి కలిపి తింటే మంచిది. 8- రోజూ పచ్చి టమాటాలు తింటే ముఖం మెరుస్తుంది. 9- టమాటా తినడమే కాకుండా ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది. ఇందుకోసం టమాటా గుజ్జును ముఖానికి రాసుకుంటే మెరుపు వస్తుంది. 10- టమాటా తినడం మధుమేహంలో ప్రయోజనకరంగా ఉంటుంది. కంటి చూపును మెరుగుపరుస్తుంది.

# అమ్మకానికి జాతీయ రహదారులు..

# మహారాష్ట్ర, ఏపీలోని ఆస్తుల నగదీకరణ

● ఎన్‌హెచ్‌ఐటీ రూ.6,221 కోట్ల ఆఫర్‌కు ఎన్‌హెచ్‌ఏఐ సై



**న్యూఢిల్లీ:** జాతీయ రహదారి ఆస్తుల నగదీకరణకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) మరోసారి సిద్ధమైంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ (ఏపీ)లలో 310.35 కిలోమీటర్ల పొడవున ఉన్న రెండు హైవే సెక్షన్ల కోసం నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ (ఎన్‌హెచ్‌ఐటీ) రూ.6,220.90 కోట్లను ఆఫర్ చేసింది. దీనికి ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించినట్టు కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన ఓ అధికారిక ప్రకటనలో తెలియజేసింది. ఇప్పటికే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జాతీయ రహదారుల ఆస్తుల నగదీకరణ ద్వారా దాదాపు రూ.28,077 కోట్లను ఎన్‌హెచ్‌ఏఐ సమీకరించిన విషయం తెలిసిందే. కాగా, తాజా డీల్‌లో మహారాష్ట్రలోని జాతీయ రహదారి 53పై 255.97 కిలోమీటర్ల పొడవున ఉన్న అమరావతి-చిఖిలీ-టార్సోడ్ సెక్షన్, ఏపీలోని జాతీయ రహదారి 16పై 54.38 కిలోమీటర్ల పొడవున ఉన్న గుండుగొలను-చిన్న అవుతపల్లి సెక్షన్‌లు సేల్ అవుతున్నాయి. ఇదిలావుంటే ఎన్‌హెచ్‌ఐటీ అనేది ఓ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్). దీన్ని ఎన్‌హెచ్‌ఏఐ స్పాన్సర్ చేస్తున్నది. ఎన్‌హెచ్‌ఐటీ ద్వారా జరిగిన మొత్తం ఆస్తుల నగదీకరణ విలువ రూ.49,858 కోట్లుగా ఉన్నది. ఎన్‌హెచ్‌ఐటీ యూనిట్లు దేశీయ ప్రధాన స్టాక్ మార్కెట్లైన బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో నమోదైయ్యాయి. ఇదిలావుంటే పర్యావరణ ఒత్తిడిని తగ్గించేందుకు దేశంలోని జాతీయ రహదారుల పొడవున బీ కారిడార్లను ఎన్‌హెచ్‌ఏఐ అభివృద్ధి చేయనున్నది. తేనెటీగలు, ఇతర పరాగ సంపర్కాల సాయంతో ఏడాదంతా జాతీయ రహదారుల వెంబడి పచ్చదనం, పూలమొక్కలతో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టనున్నామని మంగళవారం ఓ అధికారిక ప్రకటనలో కేంద్రం వెల్లడించింది.

## మెరిసిన బ్యాంకింగ్ షేర్లు.. సెన్సెక్స్ 650, నిఫ్టీ 212 పాయింట్లు వృద్ధి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ రెండూ 0.8 శాతం మేర పుంజుకున్నాయి. విద్యుత్తు, బ్యాంకింగ్, ఇతర ఆర్థిక రంగ షేర్లకు మదుపరుల కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 650.39 పాయింట్లు లేదా 0.79 శాతం ఎగిసి 83,277.15 వద్ద స్థిరపడింది. ఫలితంగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.3,11,982.13 కోట్లు పెరిగి రూ.4,68,58,625.33 కోట్లకు చేరింది. ఇక నిఫ్టీ 211.65 పాయింట్లు లేదా 0.83 శాతం ఎగబాకి 25,682.75 వద్ద నిలిచింది. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు మదుపరుల సెంటిమెంట్‌ను బలపర్చాయని ట్రేడర్లు చెప్తున్నారు. ముడి చమురు ధరల్లో స్థిరత్వం కూడా మార్కెట్ల లాభాలకు దోహదం చేసిందంటున్నారు. కాగా, సెన్సెక్స్ షేర్లలో పవర్‌గ్రిడ్ విలువ గరిష్ఠంగా 4.45 శాతం పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్బీఐ షేర్లూ లాభపడ్డాయి. రంగాలవారీగా పవర్, యుటిలిటీస్, బ్యాంకింగ్, రియల్టీ షేర్లు ఇన్వెస్టర్లను ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.95 శాతం పెరుగగా, స్మాల్‌క్యాప్ 0.16 శాతం పడిపోయింది.

## ఐపీవోకి గౌడియం ఐవీఎఫ్




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లోకి మరో సంస్థ అడుగుపెట్టబోతున్నది. ఫెర్టిలిటీ సేవల సంస్థ గౌడియం ఐవీఎఫ్ అండ్ మహిళా హెల్త్ లిమిటెడ్..ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. షేరు ధరల శ్రేణిని రూ.75-79 గా నిర్ణయించింది. ఈ నెల 20న ప్రారంభంకానున్న వాటాల విక్రయం ఈ నెల 24న ముగియనున్నది. రెండు శాతానికి సమానమైన షేర్లను బహిరంగా మార్కెట్లో విక్రయించడం ద్వారా సంస్థకు రూ.165 కోట్ల నిధులు సమకూరనున్నాయి. ఫెర్టిలిటీ విభాగం నుంచి వస్తున్న తొలి ఐపీవో సంస్థ ఇదే కావడం విశేషం.

## భెల్‌కు 1,500 కోట్ల ఆర్డర్

**న్యూఢిల్లీ:** విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకున్నది. స్టీల్ అథార్టీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్) నుంచి రూ.1,200-1,500 కోట్ల విలువైన విద్యుత్ ప్లాంట్ ప్రాజెక్టు లభించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య నేడు అధికారిక ఒప్పందం జరిగింది. బర్నపూర్‌లో సెయిల్ సంయుక్తంగా 4.08 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్‌లోనే ఈ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నది. ఈ ప్రాజెక్టు వచ్చే 39 నెలల్లో అందుబాటులోకి రానున్నది.

## 3 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు.. జనవరిలో 34.68 బిలియన్ డాలర్లుగా నమోదు



**న్యూఢిల్లీ:** దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం అంతకంతకూ పెరిగిపోతున్నది. జనవరిలో 3 నెలల గరిష్ఠాన్ని తాకుతూ వాణిజ్య లోటు 34.68 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈసారి ఎగుమతులు స్వల్పంగా 0.61 శాతం పెరిగి 36.56 బిలియన్ డాలర్లుగా ఉంటే.. దిగుమతులు మాత్రం 19.2 శాతం ఎగిసి 71.24 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది వాణిజ్య లోటును ఎగదోసింది. ఇక అధిక ధరల నేపథ్యంలో దిగుమతుల్లో బంగారం, వెండి వాటా గణనీయంగా పెరిగి వరుసగా 12 బిలియన్ డాలర్లు, 2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ముడి చమురు దిగుమతులు 0.24 శాతం తగ్గి 13.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అమెరికాకు తగ్గుముఖం అమెరికాకు భారతీయ ఎగుమతులు గత నెలలో 21.77 శాతం క్షీణించాయి. 6.6 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అగ్రరాజ్యం విధించిన అధిక సుంకాల ప్రభావం కనిపించింది. సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్ నెలల్లోనూ పతనం చూసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే అమెరికా నుంచి భారత్‌కు జరిగిన దిగుమతులు 23.71 శాతం పెరిగి 4.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## మార్కెట్లోకి మారుతి ఈ-విటారా.. ప్రారంభ ధర రూ 10.99 లక్షలు




**న్యూఢిల్లీ:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..ఎలక్ట్రిక్ వాహన సెగ్మెంట్‌లోకి ఎట్టకేలకు ప్రవేశించింది. కిందటేడాది చివర్లో ప్రదర్శించిన తన తొలి ఎలక్ట్రిక్ మాడల్ ఈ-విటారాను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.10.99 లక్షలుగా నిర్ణయించింది. బాస్(బ్యాటరీ-యాస్-సర్వీసెస్) ఆప్షన్‌తో కొనుగోలు చేయవచ్చును. ఇందుకోసం కొనుగోలుదారుడు అదనంగా కిలోమీటర్‌కు రూ.3.99 చొప్పున చెల్లించాల్సివుంటుంది. 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, 49 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన మాడల్ 440 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఆన్‌లైన్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద రూ.21 వేలు చెల్లించి ముందస్తుగా ఈ కారును బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపింది. ఇందుకోసం సంస్థ 1,100 నగరాల్లో 2 వేల చార్జింగ్ పాయింట్లను ఇప్పటికే ఏర్పాటు చేసింది. 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మారుతి చరిత్రలో ఇదొక కీలక మైలురాయి వంటిదని, ఎలక్ట్రిక్ రంగంలో తొలి అడుగుపడిందని, భవిష్యత్తులో ఈ సెగ్మెంట్ మరింత బలోపేతం అయ్యే అవకాశాలున్నాయని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ తెలిపారు. గడిచిన రెండేండ్లలో ఈవీ మార్కెట్ 4-5 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటుందన్నారు. ఈ కారును ఇప్పటికే విదేశాల్లో సుజుకీ మోటర్ కార్పొరేషన్‌తో కలిసి విక్రయిస్తున్నది.


## ఆర్‌సీబీ మహిళా టీమ్‌కు చేతక్ స్కూటర్లు

**పుణె:** ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో లిమిటెడ్... మహిళా టీ-20 లీగ్‌లో గెలుపొందిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మహిళా టీం ప్రతి ఒక్క సభ్యురాలుకు నూతన చేతక్ సీ25ని బహుమతిగా అందచేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. ఇప్పటికే ఆర్‌సీబీ మహిళా టీమ్‌కు భాగస్వామిగా వ్యవహరిస్తున్న చేతక్..తాజాగా ఐపీఎల్ మహిళా టీమ్ విజేతలకు ఉచితంగా స్కూటర్‌ను ఇస్తున్నట్టు కంపెనీ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ తెలిపారు.



## దిగొస్తున్న పుత్తడి.. 2 శాతం వరకు తగ్గిన తులం ధర

### రూ.5 వేలు దిగొచ్చిన కిలో వెండి



**న్యూఢిల్లీ:** బంగారం, వెండి ధరలు కొండదిగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేమి కారణంగా దేశీయంగా ధరలు 2 శాతం వరకు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి రూ.2.45 లక్షలకు దిగిరాగా, బంగారం రూ.1.57 లక్షలకు దిగొచ్చింది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించిన సమాచారం ఆధారంగా వెండి రూ.5 వేలు లేదా 2 శాతం తగ్గి రూ.2.45 లక్షలకు పడిపోయినట్టు తెలిపింది. సోమవారం ఈ ధర రూ.2.50 లక్షలుగా ఉన్నది. వెండితోపాటు 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.2,200 లేదా 1.4 శాతం తగ్గి రూ.1,57,000కి తగ్గింది. ఆసియా మార్కెట్లకు సెలవు కావడం, మరోవైపు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టడంతో భవిష్యత్తులో యూఎస్ ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలని చాయిస్ బ్రోకింగ్ కమోడిటీ అనలిస్ట్ కావేరి మోర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి 1.65 డాలర్లు లేదా 5.15 శాతం తగ్గి 73.58 డాలర్లకు పడిపోయింది. అలాగే బంగారం 3.04 శాతం తగ్గి 4,907.70 డాలర్ల వద్ద ఉన్నది. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య చర్చలు ప్రారంభం కావడంతో వరుసగా రెండు రోజులుగా అతి విలువైన లోహాల ధరలు దిద్దుబాటునకు గురవుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ రీసర్చ్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

## రెండోరోజూ లాభాల్లో సూచీలు.. సెన్సెక్స్ 173, నిఫ్టీ 42 పాయింట్ల వృద్ధి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో దూసుకుపోతున్నాయి. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల లభించిన మద్దతుతో వరుసగా రెండోరోజూ మంగళవారం సూచీలు లాభపడ్డాయి. 83,598 నుంచి 82,987 పాయింట్ల మధ్య కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 173.81 పాయింట్లు అందుకొని 83,450.96 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.1,52,688.24 కోట్లు పెరిగి రూ.4,70,11,313.57 కోట్లు(5.18 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 42.65 పాయిం ట్లు ఎగబాకి 25,725.40 వద్ద స్థిరపడింది. ఐటీ రంగ సూచీ కరెక్షన్‌కు గురైనప్పటికీ ఇతర రంగాల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో లాభాలను కొనసాగించాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, లార్సెన్ అండ్ టుబ్రో, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టైటాన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, సన్‌ఫార్మాస్యూటికల్స్, మారుతి సుజుకీ, ఇండిగో, ఎస్బీఐ, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు, ఎటర్నల్, టాటాస్టీల్, ట్రెంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.

## ఆంథ్రోపిక్- ఇన్ఫీ జట్టు




**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధస్సు (ఏఐ)లో సరికొత్త సంచలనం, అమెరికాకు చెందిన కంపెనీ ఆంథ్రోపిక్‌తో.. భారతీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ జట్టు కట్టింది. టెలికమ్యూనికేషన్స్, ఆర్థిక సేవలు, తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి తదితర కంపెనీల కోసం అత్యాధునిక సంస్థాగత ఏఐ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తేవడం, అభివృద్ధిపర్చడానికి ఆంథ్రోపిక్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మంగళవారం ఇన్ఫోసిస్ ప్రకటించింది. ముందుగా టెలికాం రం గంలో ఆంథ్రోపిక్ సహకారాన్ని ఇన్ఫోసిస్ తీసుకోనున్నది. ఈ మేరకు ఓ ప్రకటనలో కంపెనీ పేర్కొన్నది. 'ఓ రెగ్యులేటెడ్ ఇండస్ట్రీలో పనిచేసే ఏఐకి, డెమోలో ఉన్న ఏఐ మాడల్‌కు మధ్య చాలా అంతరం ఉన్నది. ఈ దూరాన్ని తొలగించడానికి ఆయా రంగాల్లో సమర్థవంతమైన నైపుణ్యం అవసరం. ఇన్ఫోసిస్‌కు టెలికాం, ఆర్థిక సేవలు, తయారీ రంగాల్లో అలాంటి నైపుణ్యమే ఉన్నది' అని ఆంథ్రోపిక్ సీఈవో డారియో అమోడీ అన్నారు.

# చెంచా కాదు.. చేతులతో తింటే శరీరానికి ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో తెలుసా..?



కాలంతోపాటు ఆహారపు అలవాట్లలో కూడా అనేక మార్పులు వచ్చాయి. నేటి బిజీ లైఫ్‌లో ప్రతి ఒక్కరూ యాంత్రిక జీవనానికి అలవాటు పడిపోయారు. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర కూడా కరువైంది. ఏది పడితే అది తినేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని దూరంపెట్టి, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌తో కడుపు నింపేసుకుంటున్నారు. అది కూడా నిలబడి, పరిగెడుతూ స్పూన్లు, ఫోక్‌స్పూన్‌ల మీద ఆధారపడుతున్నారు. చేతులు ఎంగిలి కాకుండా, పెదాలకు అంటకుండా స్పూన్‌తో తినడం చాలామందికి అలవాటుగా మారింది. ఇలా తినటం స్టేటస్ సింబల్‌గా భావించేవారు చాలా మంది ఉన్నారు. చేతులతో ఆహారం తినేవారిని చీప్‌గా చూస్తుంటారు. కానీ, ఆ పద్ధతిలో ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదేనా..? దీనిపై నిపుణులు ఏమంటున్నారు..? తదితర వివరాలు మీ కోసం.. స్పూన్లు, ఫోక్ స్పూన్లు కాకుండా.. ఆహారాన్ని చేతులతో తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో చాలా మంది తినడానికి చెంచా ఉపయోగిస్తున్నారు. దీని వల్ల తిన్న ఆహారం జీర్ణం కావడం కష్టమవుతుంది. అయితే చేతులతో తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం. 1. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: చేతులతో తినే సమయంలో ముందుగా ఆహారాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుంటాం. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. పోషకాలను బాగా గ్రహించడంలో సహాయపడుతుంది. 2. రుచిని పెంచుతుంది: చేతులతో ఆహారం తినేవారిలో ఆహారాన్ని చేయి తాకగాన్నే నాడుల ద్వారా మెదడు, పొట్టకు సంకేతాలు చేరుతాయి. దీని వల్ల జీర్ణరసాలు, ఎంజైములు విడుదలై జీర్ణక్రియ సక్రమంగా సాగుతుంది. చేతులతో తినే సమయంలో ఆహారాన్ని నేరుగా చేతిలోకి తీసుకుని నోటిలో పెట్టుకుంటాం. అప్పుడు ముక్కుద్వారా ఆ వాసన ఆహారం రుచిని మరింత పెంచుతుంది. ఇది చెంచాతో తినేటప్పుడు అనుభవించదు. 3. నియంత్రణల పరిమాణం: మన చేతులతో తినేటప్పుడు మనం తినే ఆహారాన్ని సహజంగా కొలుస్తాము. చెంచాతో తింటే అతిగా తినే అవకాశం ఉంది. చెంచాతో అతిగా, వేగంగా తినడం వల్ల శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇది టైప్ -2 డయాబెటిస్‌కు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. 4. స్పర్శ ద్వారా అనుభూతి: మనం మన చేతులతో తినేటపుడు ఆహారం ఆకృతి, ఉష్ణోగ్రతను పసిగట్టవచ్చు. ఇది ఆహారంతో మరింత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరుస్తుంది. అంతేకాదు.. మన చేతులు, కడుపు, పేగులు కొన్ని మంచి బ్యాక్టీరియాలను కలిగి ఉంటాయి. ఇవి మనల్ని వ్యాధుల నుంచి కాపాడతాయి. 5. సాంస్కృతిక ప్రాముఖ్యత: చేతులతో భోజనం చేయడం చాలా మందికి ఆచారం. ఇది కుటుంబం కలిసి తినడం సామాజిక కోణాన్ని మెరుగుపరుస్తుంది. 6. మనసుకు మంచిది: చేతులతో భోజనం చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి ఒత్తిడి తగ్గుతుంది. దీంతో మనసుకు ఆనందం కలుగుతుంది. వీలైనంత వరకు చేతులతో తినండి. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చేతుల్లో హానిచేయని బ్యాక్టీరియా ఉండడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. పర్యావరణంలోని వివిధ హానికారక సూక్ష్మజీవుల నుంచి శరీరాన్ని కాపాడుతుందని కూడా నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఎప్పుడూ చెంచాతో కాకుండా చేతులతో తినండి.



## గుండెకు మేలు చేసే ఉల్లి కాడలు..
### రక్తప్రసరణ సజావుగా సాగాలంటే వీటిని తినాల్సిందే




ఉల్లిపాయలో అనేక సుగుగుణాలు ఉంటాయి. అందుకే ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే నానుడి ప్రజాజీవనంలో స్థిరపడి పోయింది. ఉల్లిపాయలే కాదు ఉల్లి కాడలు కూడా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతి మార్కెట్‌లో ఉల్లి కాడలు తక్కువ ధరకే లభ్యమవుతుంటాయి. ఉల్లి కాడలను ఇతర కూరగాయలతో కూడా జోడించి వంటలు చేయొచ్చు. ఆకర్షణీయంగా కనిపించడమేకాకుండా రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం..ఉల్లి కాడలు హృద్రోగులకు, వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఉల్లి కాడల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. దీన్ని కూరలో వేసుకుని తింటే గుండె జబ్బులు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే ఉల్లి కాడల్లో ఉండే క్వెర్సెటిన్ అనే పదార్థం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఈ యాంటీఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. అలాగే గుండె జబ్బుల వంటి తీవ్రమైన సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. ఇందులో విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, ఫైబర్ ధమనులను ఆరోగ్యంగా ఉంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఉల్లి కాడలను తినడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. అంటే, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే, దానిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో అధికంగా సల్ఫర్ ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీర నొప్పిని తగ్గిస్తాయి. నిత్యం ఉల్లి కాడలను ఆహారంలో భాగంగా తీసుకుంటే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.


## అంత డేంజరా..? ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తింటే.. శరీరంలో ఏమవుతుందంటే..!



సమ్మర్ సీజన్ మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10దాటిందంటే.. సూర్యుడు ప్రతాపం మొదలవుతుంది. ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టామంటే.. చాలు ఉక్కపోత చెమట పట్టడం సహజం. బయటకు వెళ్లాక బట్టలన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. మన శరీరం నుండి పోషకాలు కోల్పోవడమే దీనికి కారణం. అయితే దీన్ని బ్యాలెన్స్ చేసేందుకు చాలామంది వేసవిలో పుచ్చకాయ ఎక్కువగా తింటుంటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కూడా ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి, ఈ పండును తీసుకోవడం వల్ల మన పొట్ట ఎక్కువ సమయం నిండుగా ఉంటుంది. ఈ పండు వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఇందులో 92శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది మన శరీరానికి ఎక్కువ వాటర్ కంటెంట్ అందిస్తుంది. తాజా పుచ్చకాయలో సిట్రులిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రులైన్ నైట్రిక్ ఆక్సైడ్ 6 ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులో ఉంటుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు పుచ్చకాయను రిఫ్రిజిరేటర్ లో ఉంచి తింటారు. కానీ ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయని మీకు తెలుసా..సాధారణంగా కొంతమంది మార్కెట్ నుండి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే పండ్లను కోసి ఫ్రిజ్‌లో ఉంచే అలవాటు ఉంటే మాత్రం వెంటనే దానిని వదిలేయండి. ముఖ్యంగా పుచ్చకాయను ఫ్రిజ్‌లో పొరపాటున కూడా పెట్టకూడదు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కంటే గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. ఎంత ఎండలోనైనా పుచ్చకాయ చాలా చల్లగా ఉంటుంది. తినడానికి రుచికరమైనది. కానీ కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్ లో ఉంచితే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా కోసిన పుచ్చకాయపై బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం.

## గసగసాలు గట్టిగా తినండి.. మధుమేహం నుండి గుండె జబ్బుల వరకు పరార్..!





గసగసాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో గసగసాలు తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే ఇవి చల్లటి గుణాన్ని కలిగి ఉంటాయి. అద్భుత ఔషధ గుణాలు కలిగి ఉన్న గసగసాలు తినటం ద్వారా పీచు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో గసగసాలు ఉపయోగపడతాయి. గసగసాలు తినడం వల్ల పొట్టకు చల్లదనం చేకూరుతుంది. ఇది ఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. గసగసాలు తినడం వల్ల శరీరంలో రక్తం కొరత తీరుతుంది. ఇవి ఎముకలను దృఢంగా చేస్తాయి. వేసవిలో తినడం వల్ల శరీరానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు కలుగుతాయి. గసగసాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. మెదడు సామర్థ్యం: మెదడుకు నరాల, రక్త కణాల ప్రవాహాన్ని నియంత్రించే సామర్థ్యం గసగసాలకు ఉంది. మెదడులోని నాడీ కణాలు ఉత్తేజితం కావడం వల్ల మెదడు సామర్థ్యం పెరుగుతుంది. కాబట్టి పాలలో ఉడకబెట్టిన గసగసాలు తింటే పిల్లల్లో జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. పెద్దలు గసగసాల పాలను తాగడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఎముకల ఆరోగ్యం: గసగసాలలో కాల్షియం, కాపర్ పుష్కలంగా ఉంటాయి. ఈ రెండు పోషకాలు ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. అలాగే ఎముకల మధ్య బంధన కణజాలాన్ని బలపరుస్తుంది. దీంతో కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. రక్త ప్రసరణ: గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది హానికరమైన చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. గసగసాలలో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిద్రలేమి: నిద్రలేమితో బాధపడేవారు రాత్రిపూట గసగసాలు ఎక్కువగా తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. ఒత్తిడిని తగ్గిస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. ఆందోళనను తగ్గిస్తుంది. ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. రోగనిరోధక శక్తి:మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి విటమిన్ సి ఎంత ముఖ్యమైనదో జింక్ కూడా అంతే ముఖ్యం. గసగసాలలో జింక్ పుష్కలంగా ఉంటుంది. దీనిని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య:థైరాయిడ్ గ్రంధికి జింక్ చాలా ముఖ్యమైన పోషకం. ఇది థైరాయిడ్ హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు జింక్ పుష్కలంగా ఉండే గసగసాలను తీసుకోవచ్చు. నోటి పుండు:తరచుగా నోటిపూత వచ్చినప్పుడు గసగసాలు తింటే ఉపశమనం లభిస్తుంది. యాంటీ బాక్టీరియల్ కాకుండా, గసగసాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. రాత్రి పూట గసగసాలు మెత్తగా చేసి పాలలో మరిగించి తాగాలి. ఇది ఆరోగ్యానికి అన్ని విధాలుగా మేలు చేస్తుంది.

## బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే అద్భుత పండు ఇది.. మహిళలు తప్పక తినాల్సిందే




మహిళల్లో అధికంగా వచ్చే అనారోగ్య సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ముఖ్యమైనది. అయితే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు తీసుకునే అనేకానేక చర్యల్లో ఆహారం ఒకటి. సరైన ఆహారం తింటే శరీరంలో క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి కాకుండా నివారించవచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే ఆహారాల్లో పుచ్చకాయ ముఖ్యమైనది. ఇది రుచికి ఎంత కమ్మగా ఉంటుందో, దాని వల్ల చాలా ప్రయోజనాలు కూడా అంతే అధికంగా ఉన్నాయి. పుచ్చకాయలో 90 శాతం నీరు ఉంటుంది. కాబట్టి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో ఈ పండు ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వివిధ వ్యాధులను దూరం చేస్తాయి పుచ్చకాయ క్యాన్సర్‌ను నివారించడంలో కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ (కణాలను నాశనం చేసే క్రియాశీల అణువులు) తొలగించడంలో సహాయపడతాయి. అందుకే పుచ్చకాయ వివిధ క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని నిపుణులు అంటున్నారు. పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఇది ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడం ద్వారా క్యాన్సర్ నివారించడంలో సహాయపడుతుంది. ప్రత్యేకంగా ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పుచ్చకాయలో ఉండే లైసోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఫలితంగా పుచ్చకాయ సన్ టాన్ తొలగించడమే కాకుండా, చర్మ క్యాన్సర్‌ను కూడా నివారిస్తుంది. పుచ్చకాయలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ పుచ్చకాయ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. దృష్టి మెరుగుపడుతుంది. అంతేకాకుండా ఈ సీజనల్ వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కళ్లను రక్షిస్తుంది. నీటి కంటెంట్‌తో పాటు, పుచ్చకాయలో తగినంత మొత్తంలో విటమిన్-బి6 ఉంటుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. రోజూ పుచ్చకాయ తినడం వల్ల వేసవితాపం నుంచి కాపుడుకోవచ్చు. పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కేలరీల కంటెంట్ చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి శరీర బరువును తగ్గించుకోవాలనుకుంటే, ప్రతిరోజూ మీ ఆహారంలో ఈ పండును తీసుకోవచ్చు.

## ఆలివ్ ఆయిల్‌తో అద్భుతాలు..! ఇలా వాడితే మధుమేహం పరార్..



మధుమేహం అనేది ఒక దీర్ఘకాలిక అనారోగ్య సమస్య. ఈ వ్యాధి ఒకసారి వస్తే ఎప్పటికీ నయం కాదు. ఎందుకంటే దీనిని పూర్తిగా నయం చేసే చికిత్స ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. చాపకింద నీరులా సోకే మధుమేహం రాకుండా ఉండాలంటే ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండటం అవసరం. రక్తంలో గ్లూకోజ్ పెరిగినప్పుడు మనిషికి మధుమేహం వస్తుంది. గ్లూకోజ్ మన శరీరానికి శక్తి ప్రధాన వనరుగా పరిగణించబడుతుంది. శరీరం గ్లూకోజ్‌ని తయారు చేయగలదు. ఇన్సులిన్ అనేది ప్యాంక్రియాస్ ఉత్పత్తి చేసే హార్మోన్. ఇది గ్లూకోజ్ కణాలలోకి ప్రవేశించడానికి సహాయపడుతుంది. మధుమేహం బాధితుల్లో శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయదు..లేదంటే ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించదు. అటువంటి పరిస్థితిలో గ్లూకోజ్ రక్తంలో పేరుకుపోతుంది. కణాలకు చేరుకోలేకపోతుంది. మధుమేహం మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మధుమేహాన్ని నియంత్రించడానికి, నిపుణులు ఆరోగ్యకరమైన జీవనశైలిని, మంచి ఆహారాన్ని సిఫార్సు చేస్తారు. మధుమేహాన్ని నియంత్రించడంలో ఆలివ్ ఆయిల్ ఎంత ప్రభావవంతంగా ఉంటుందో తెలుసుకుందాం మధుమేహాన్ని నియంత్రించడానికి ఆలివ్ ఆయిల్ ప్రయోజనాలు: ఆలివ్ ఆయిల్ రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ముఖ్యంగా టైప్ 2డయాబెటిస్ రోగులకు ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఆలివ్ నూనెలో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ఆలివ్ ఆయిల్ యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. అధిక చక్కెర కారణంగా ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో, యాంటీఆక్సిడెంట్లు దాని స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి.ఇదిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు మధుమేహం వల్ల శరీరంలో చాలా సార్లు వాపు వస్తుంది. ఆలివ్ ఆయిల్ గుణాలు శరీరంలో మంటను తగ్గించి, సెల్ డ్యామేజ్‌ను నివారిస్తాయి. 1టేబుల్ స్పూన్ ఆలివ్ నూనెలో 14 గ్రాముల మొత్తం కొవ్వు ఉంటుంది. కానీ ఫైబర్, చక్కెర ఉండదు. ఇది విటమిన్లు మంచి మూలం. ఆలివ్ నూనెలో ఫైటోస్టెరాల్స్ ఉంటాయి.ఇదిగుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. ఇదిమన ఆహారం నుండి కొలెస్ట్రాల్ శోషణను నిరోధిస్తుంది. గుండె జబ్బులతో సంబంధం ఉన్న చెడు కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. మీరు ఒక రోజులో ఎంత తింటారు అనేది ముఖ్యం. మీరు రోజుకు 3 నుండి 4 టీస్పూన్ల ఆలివ్ నూనెను మాత్రమే తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్ ఇతర ప్రయోజనాలు..ఆలివ్ ఆయిల్ మంటను తగ్గిస్తుంది. ఆలివ్ నూనె ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఆలివ్ ఆయిల్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆలివ్ నూనె రక్తపోటును తగ్గిస్తుంది.

## నేలపై పడుకుంటే ఇన్ని లాభాలా..? తెలిస్తే బెడ్‌కు గుడ్ బై చెప్పేస్తారు..!




కాలం మారింది.. దాంతో పాటుగానే ప్రజల జీవన విధానాలు మారిపోతున్నాయి. సౌకర్యాల విషయానికి వస్తే చాలా మంది ప్రజలు లగ్జరీ లైఫ్ కోసం పరుగులు పెడుతున్నారు.కానీ నేటికీ నేలపై పడుకునే పాత సంప్రదాయం ఇప్పటికీ సరైనదని మరోసారి నిరూపించబడింది ఈ ఆధునిక యుగంలో అందరూ మంచాలు, సుతిమెత్తటి బెడ్‌లను వాడుతున్నారు. కానీ, అలాంటి మంచాన్ని వదిలి నేలపై పడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసా..? ఆ లాభాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేలపై పడుకోవడం వల్ల కలిగే అసంఖ్యాక ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేల మీద పడుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం: మనస్తత్వవేత్తలు నేలపై పడుకోవడం వల్ల శరీరం రిలాక్సేషన్, నేలతో అనుబంధం ఏర్పడుతుందని అంటున్నారు. నేలపై పడుకోవడం వల్ల శరీర భంగిమ సరైన రీతిలో ఉంటుంది. అదే బెడ్‌పై పడుకున్నప్పుడు మనం నిద్రించే సమయంలో కుంగి ఉంటాయి. ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది. నేలపై పడుకోవడం వల్ల వెన్నెముక నిటారుగా ఉంటుంది. మనం నేలపై పడుకున్నప్పుడు మన శరీరం పూర్తిగా రిలాక్స్ అవుతుంది. మనం పూర్తి విశ్రాంతి తీసుకుంటాము. ఇది వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వెన్నెముకపై ఒత్తిడి తగ్గించుకునేందుకు పిల్లోను వాడుకోవచ్చు. నడుము భాగంలో పలుచని పిల్లోను పెట్టుకుని నిద్రించాలన్నది వైద్యుల సూచన. నేలపై పడుకోవడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు: నేలపై పడుకోవడం వల్ల మన శరీరానికి కావలసిన సహజమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది మన వీపును నిటారుగా ఉంచుతుంది. కండరాలను రిలాక్స్ చేస్తుంది. మీరు ఫ్లాట్ ఫ్లోర్‌లో పడుకున్నప్పుడు, మీ మనస్సులోని ఆందోళనలు కూడా తగ్గుతాయి. నేటి బీజీ లైఫ్ అత్యధిక ఒత్తిడితో కూడిన యుగంలో నేలపై నిద్రపోవడం మనల్ని ప్రకృతికి దగ్గర చేస్తుంది. భూమితో అనుసంధానం చేయడం ద్వారా మనం మరింత సమతుల్యత, ప్రశాంతతను పొందవచ్చు. నేలపై పడుకోవడం వల్ల మంచి నిద్రపడుతుంది. అదే విధంగా నిద్రలో సహజ శరీర కదలిక ఉంటుంది. పరుపులు, దిండ్లు ఒత్తిడి ఉండదు. మంచి రక్త ప్రసరణ ఉంటుంది. వేసవిలో నేలపై పడుకోవడం వల్ల శరీరానికి కాస్త చల్లగా అనిపిస్తుంది. నేల చల్లదనానికి, శరీర ఉష్ణోగ్రత నెమ్మదిగా తగ్గిపోతుంది. దీనివల్ల మరింత గాఢంగా నిద్ర పోవచ్చు. అంతేకాదు, చాలా మంది ఆఫీసు, ఇంటి పనితో అలసిపోతుంటారు. బాడీ పెయిన్స్ తో బాధ పడుతుంటారు. ఆ పెయిన్స్ ఉన్న వారు బెడ్ కి గుడ్ బై చెప్పి నేల మీద పడుకోవడం అలవాటు చేసుకోండి. ఆ హాయిని మీరు ఆస్వాదిస్తారు.

Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

# ఇప్పటికీ నా మాటలకు కట్టుబడి ఉన్నా

## గావస్కర్



ఢిల్లీ : ది హండ్రెడ్ లీగ్‌లో పాకిస్థాన్ క్రికెటర్‌ను కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ లీడ్స్ యాజమాన్యం సన్ గ్రూప్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే, గత ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో పాక్ కామెంటేటర్లతో కలిసి గావస్కర్ ఓ షోలో పాల్గొన్నాడు. ఇక భారత్ – పాక్ మ్యాచ్‌లకూ కామెంటేటర్‌గా వ్యవహరిస్తుంటారు. అప్పుడు మీరు ఎందుకు హాజరయ్యారంటూ తాజాగా ఆయనపై విమర్శల వర్షం కురుస్తోంది. దానికి సన్నీ సమాధానం ఇస్తూనే.. గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.

“నేను ఐసీసీ, ఏసీసీ కామెంట్రీ ప్యానెల్స్‌లో సభ్యుడిని. ఆ రెండింటి నుంచి వచ్చే రెవెన్యూ అన్ని దేశాలకూ వెళ్తుంది. అలాంటప్పుడు నన్ను మీరు ఎలా ప్రశ్నించగలరు? ఇక ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో పాక్ క్రికెట్ షో ‘ది డ్రెస్సింగ్ రూమ్’లో వసీమ్ అక్రమ్, వకార్ యూనిస్‌తో కనిపించడంపైనా వ్యాఖ్యలు చేస్తున్నారు. నేనేమీ ఒక్క రూపాయి తీసుకోలేదు. వారికి చెల్లించలేదు. ఇలాంటప్పుడు పాక్‌కు నేను ప్రత్యక్షంగా ఏమీ ఇవ్వడం లేదు కదా. ఇకపోతే నేను సీపీఎల్, ఐఎల్‌టీ20, ఎస్‌ఏ20 లీగ్‌లను ఫాలో కావడం లేదు. ఎవరు ఆడుతున్నారో కూడా తెలియదు. ఒకవేళ అందులోనూ భారతీయ సంస్థకు చెందిన ఫ్రాంచైజీలో పాక్ క్రికెటర్లు ఆడుతుంటే.. ఇప్పటికైనా నిలిపేయాలి. పాకిస్థాన్ ఆటగాళ్లకు భారత ఫ్రాంచైజీలు డబ్బులు చెల్లించడం ఆపాలని కోరుతున్నాను” అని సునీల్ గావస్కర్ తెలిపాడు.

### అతడికేం సంబంధం..

“జైషా ఇప్పుడు ఐసీసీ అధ్యక్షుడు. అతడు రాకముందు నుంచే దశాబ్దాలుగా భారత్ – పాక్ మ్యాచులు జరుగుతున్నాయి. ఇప్పుడు ఒకే గ్రూప్‌లో ఇరు జట్లు ఉండటంతో ఇదంతా ఆయన వల్లేనన్న వ్యాఖ్యలు అర్థరహితం. కేవలం జై షా మాత్రమే కాదు.. ఐసీసీలోని సభ్యులంతా కలిసి షెడ్యూల్‌ను రూపొందిస్తారు. బీసీసీఐకి రెవెన్యూను ఐసీసీ, ఏసీసీ ఇస్తుంది” అని గావస్కర్ వెల్లడించారు.

## ఐపీఎల్ ఫాస్టెస్ట్ బౌలర్..

# ఘనమైన కమ్‌బ్యాక్‌పై గురి!



ఢిల్లీ : ఐపీఎల్ చరిత్రలో 156.7 కి.మీల స్పీడ్‌తో అత్యంత వేగంగా బంతిని విసిరిన బౌలర్ మయాంక్ యాదవ్. ఇప్పటి వరకూ అతడిదే రికార్డు. ఇలాంటి పేసర్ గుర్తున్నాడా..? గాయం కారణంగా గత సీజన్ మొత్తానికి దూరమైన ఈ పేస్ సెన్సేషన్ మళ్లీ ఐపీఎల్‌లో అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న 19వ సీజన్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. ఇప్పటికే లఖ్‌నవూ మైదానంలో ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు.

బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీలో ఉంటూ గాయం నుంచి కోలుకున్న 23 ఏళ్ల మయాంక్ తన బౌలింగ్‌కు మరింత పదునుపెట్టాడు. తరచూ గాయాలతో సావాసం చేసే అతడు.. ఇప్పుడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించడంతో లఖ్‌నవూ జట్టులో జోష్ తెప్పించినట్లైంది. మానసికంగా సిద్ధంగా ఉన్నానని మయాంక్ స్పష్టం చేశాడు. గత పది నెలల కాలంలో కేవలం రెండే మ్యాచులను మాత్రమే ఆడాడు. అదీనూ భారత్‌-ఏ తరఫున కావడం గమనార్హం. అయినా, బౌలింగ్‌లో లయను అందుకోనేందుకు కష్టపడినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి.

“ఇప్పుడు చాలా బాగున్నా. పూర్తిస్థాయిలో రెడీ. ఎలాంటి ఇబ్బందులు లేవు. వేగంగా వేయడంపై బయట నుంచి వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోను. ఎంత ఫాస్ట్‌గా బంతిని విసురుతానో మీరూ చూద్దురు. ఆట నుంచి సుదీర్ఘమైన లేఆఫ్ తీసుకున్నా. గత పది నెలల్లో కనీసం ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయా. అయితే, అప్పుడు ఎలాంటి ఉద్దేశంతో ఉన్నానో.. నా కమ్‌బ్యాక్‌లోనూ అదే దూకుడుతో బౌలింగ్ చేస్తా. గాయాలను మేనేజ్ చేయడం మన చేతుల్లో లేదు.. కానీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే చేయగలను” అని మయాంక్ యాదవ్ నమ్మకంగా చెబుతున్నాడు.

ఐపీఎల్ 2024 సీజన్‌లో నాలుగు మ్యాచుల తర్వాత గాయంతో ఇబ్బంది పడ్డాడు. అతడిపై నమ్మకం ఉంచిన లఖ్‌నవూ మేనేజ్‌మెంట్ రూ. 11 కోట్లకు రిటైన్ చేసుకుంది. కానీ, గత సీజన్‌లోనూ కేవలం రెండు మ్యాచులకే పరిమితం కావాల్సి వచ్చింది. వెన్నునొప్పి తీవ్రత కారణంగా జాతీయ జట్టులోనూ ఆడలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్‌లో శస్త్రచికిత్స చేయించుకుని మరీ వచ్చాడు.

# ఇప్పుడుంది అసలు సవాల్!




**హైదరాబాద్ : మెరుపు ఆటతో పాకెట్ డైనమోగా పేరు తెచ్చుకుని కెరీర్ ఆరంభంలోనే వన్డేల్లో డబుల్ సెంచరీతో మెరిశాడు ఇషాన్ కిషన్. ఆ తర్వాత క్రమశిక్షణ తప్పి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయి టీమ్ఇండియాకు దూరమయ్యాడు. కానీ అతడికి త్వరగానే రెండో అవకాశం దక్కింది. తప్పులు దిద్దుకుని మళ్లీ జట్టులోకి రావడమే కాదు.. తాజా టీ20 ప్రపంచకప్‌లో మెరుపులతో జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. 2026 ఐపీఎల్‌లో ప్యాట్ కమిన్స్ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరం కావడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును నడిపించే అవకాశాన్ని అందుకున్నాడు ఇషాన్. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఝార్ఖండ్‌ను విజేతగా నిలబెట్టిన ఇషాన్.. ఐపీఎల్ సవాలును ఎలా ఎదుర్కొంటాడన్నది ఆసక్తికరం.**

### అంత తేలిక కాదు

2024 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రదర్శన ఒక చరిత్ర. విధ్వంసక బ్యాటింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తూ.. ప్రత్యర్థి జట్లను బెంబేలెత్తించేసింది ఆ జట్టు. ఎస్‌ఆర్‌హెచ్ ధాటికి ఐపీఎల్ అత్యధిక స్కోరు రికార్డు నాలుగుసార్లు బద్దలైంది. ఆ సీజన్లో ఫైనల్‌కు దూసుకెళ్లిన సన్‌రైజర్స్ త్రుటిలో టైటిల్ కోల్పోయింది. కానీ గత ఏడాది భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన ఆ జట్టు.. తీవ్రంగా నిరాశపరిచింది. కానీ ఈసారి మళ్లీ ఆ జట్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, క్లాసెన్, ఇషాన్ కిషన్ లాంటి విధ్వంసకారులతో నిండిన టీమ్ బ్యాటింగే బలంగా బరిలోకి దిగుతోంది. మరి ఈ జట్టును ఇషాన్ ఎలా ముందుకు తీసుకెళ్తాడో చూడాలి. గతేడాది రూ.11.25 కోట్లతో ఇషాన్‌ను దక్కించుకుంది సన్‌రైజర్స్. అందుకు తగ్గట్టే ఆడిన తొలి మ్యాచ్‌లోనే మెరుపు సెంచరీ (47 బంతుల్లోనే 106 నాటౌట్)తో అదరగొట్టాడు. ఆ తర్వాత ఆ స్థాయిలో రాణించకపోయినా.. కీలక పరుగులు చేశాడు. అదే ఏడాది ఝార్ఖండ్ కెప్టెన్‌గానూ సత్తా చాటాడు ఇషాన్. ఏమాత్రం అంచనాలు లేకుండా ముస్తాక్ అలీ టోర్నీలో జట్టును సమర్థంగా నడిపించాడు. ఝార్ఖండ్‌కు తొలిసారి టైటిల్ అందించాడు. ఈ టోర్నీలో అటు బ్యాటర్‌గా ఇటు సారథిగా ఈ వికెట్‌కీపర్ బ్యాటర్ అదరగొట్టాడు. హరియాణాతో ఫైనల్లో 49 బంతుల్లోనే 101 పరుగులు చేశాడు. మొత్తం 11 మ్యాచ్‌ల్లో 517 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అదే ఫామ్‌ను దక్షిణాఫ్రికాతో సిరీస్‌లోనూ, ఆపై టీ20 ప్రపంచకప్‌లోనూ ప్రదర్శించాడు ఈ డాషింగ్ బ్యాటర్. టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆడిన ఇన్నింగ్స్ (40 బంతుల్లో 77) అద్భుతం. అయితే ఎంతో ఒత్తిడి ఉండే ఐపీఎల్‌లో ఇషాన్ తొలిసారి కెప్టెన్సీ చేయబోతున్నాడు. టోర్నీ రెండో అర్ధంలో అయినా కమిన్స్ వస్తాడని ఎస్‌ఆర్‌హెచ్ భావిస్తోంది. ఒకవేళ రాకపోతే ఇషాన్‌పై పూర్తి స్థాయి కెప్టెన్‌గా మరింత బాధ్యత పెరుగుతుంది. మరి ఎప్పట్లాగే ఇషాన్ తనదైన శైలిలో దూకుడుగా ఆడతాడా.. లేదా కెప్టెన్ కాబట్టి శైలి మారుస్తాడా అన్నది ఆసక్తికరం. నిరుడు సన్‌రైజర్స్ దూకుడు మిశ్రమ ఫలితాలను ఇచ్చింది.

# 120 శాతం ప్రదర్శన ఇద్దాం




బెంగళూరు: ఐపీఎల్ కొద్ది రోజుల్లో ఆరంభం కాబోతోంది. అన్ని జట్లూ ప్రాక్టీస్‌ను వేగవంతం చేశాయి. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా నెట్స్‌లో కష్టపడుతోంది. ఆ జట్టు స్టార్ విరాట్ కోహ్లి కఠోర సాధన చేస్తున్నాడు. శనివారం నెట్స్‌లో అతడు తన శైలి స్ట్రోక్స్‌ను సాధన చేశాడు. విరాట్ ప్రాక్టీస్, అతడు సహచరులతో మాట్లాడుతున్న వీడియోలను బెంగళూరు ఫ్రాంఛైజీ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది.

“ఈ రోజులను మనం వృథా చేయకూడదు. మనం ఎప్పుడూ ముందంజలో ఉండాలి. సీజన్ మొత్తంలో ఒక్క నిమిషం కూడా వృథా కాకూడదు. మనం ఈ రెండున్నర నెలలు 120 శాతం ప్రదర్శనను ఇవ్వాలి. ఛాలెంజర్స్ కావడానికి అందరిలోనూ ఉత్సాహం ఉందని మీ ముఖాలు చూస్తే అర్థమవుతోంది” అని సహచరులతో కోహ్లి పేర్కొన్నాడు. గత మూడేళ్లు ప్రతి సీజన్‌లోనూ 600 పైగా పరుగులు సాధించిన విరాట్.. ఈసారి కూడా అదే స్థాయిలో రాణించి టైటిల్ నిలబెట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. 18 ఏళ్ల ఎదురుచూపుల అనంతరం గతేడాది బెంగళూరు తొలిసారి ఐపీఎల్ ఛాంపియన్ అయింది. ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఆర్సీబీ ఓడించింది.

# దిల్లీ క్యాపిటల్స్ కల తీరేనా..?

## ఐపీఎల్ మరో 6 రోజుల్లో



**ఢిల్లీ : ఇప్పటిదాకా ఐపీఎల్‌లో 18 సీజన్లు జరిగితే... దిల్లీ ఒకే ఒక్కసారి (2020) ఫైనల్ చేరగలిగింది. ప్రదర్శన ఎప్పుడూ అస్థిరమే. 18 సీజన్లలో ఆరుసార్లు మాత్రమే లీగ్ దశను దాటగలిగింది. 2019 నుంచి 2021 వరకు మూడేళ్లు ప్లేఆఫ్స్‌కు చేరి బలమైన జట్టుగా ఎదిగినా.. ఆ తర్వాత మళ్లీ గాడితప్పింది.**

గత నాలుగేళ్లు ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టలేకపోయింది. అక్షర్ పటేల్ సారథ్యంలోని దిల్లీ, ఈసారి కూడా గట్టి పోటీదారుల జాబితాలో లేదు. 2025 ఐపీఎల్‌లో ఆరంభంలో వరుస విజయాలు సాధించి, ఫేవరెట్లలో ఒకటిగా మారింది. కానీ గ్రూప్ దశ ఆఖర్లో ఫామ్‌ను కోల్పోయింది. తొలి ఆరు మ్యాచ్‌ల్లో అయిదు నెగ్గిన దిల్లీ.. ఆ తర్వాత ఎనిమిది మ్యాచ్‌ల్లో రెండే గెలిచింది. పాయింట్ల పట్టికలో అయిదో స్థానంతో సరిపెట్టుకున్న ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. అయితే నిరుడు లయను కొనసాగించలేకపోయిన ఆ జట్టు ఈసారి మెరుగ్గా కనిపిస్తోంది. అనేకమంది అనుభవజ్ఞులు విఫలమైన నేపథ్యంలో జట్టులో కొన్ని మార్పులు చేసుకుంది. డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్ లాంటి బ్యాటర్లను వదిలేసి.. వేలంలో మిల్లర్, బెన్ డకెట్, నిశాంక, ఎంగిడిలను సొంతం చేసుకుంది. రాజస్థాన్ రాయల్స్ నుంచి నితీశ్ రాణాను తీసుకుంది. అయితే ఈసారి కూడా దిల్లీ క్యాపిటల్స్ ప్రధాన జట్టు రాహుల్, అక్షర్ పటేల్, స్టబ్స్, కుల్‌దీప్ యాదవ్, స్టార్క్‌లతో నిర్మితమై ఉంది. మరి బలమైన దేశీ, విదేశీ లైనప్‌లు కలిగి ఉన్న దిల్లీ ఈసారైనా కప్పు కల నెరవేర్చుకుంటుందా అన్నది చూడాలి. ఏప్రిల్ 1న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌తో దిల్లీ టైటిల్ వేట ఆరంభమవుతుంది. హేమంగ్ బదాని ఆ జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

బలాలు: టాప్ ఆర్డర్‌లో పదే పదే మార్పులు చేయడంతో నిరుడు దిల్లీ క్యాపిటల్స్ దెబ్బతింది. ఎనిమిది భిన్న ఓపెనింగ్ కాంబినేషన్లను ప్రయత్నించడం ఆ ఫ్రాంఛైజీ ప్రణాళిక లోపాన్ని సూచిస్తుంది. డకెట్, నిశాంకల రూపంలో ఈసారి మంచి ఓపెనింగ్ జోడీ దిల్లీకి ఉంది. పృథ్వీ షా కూడా అందుబాటులో ఉన్నాడు. పరిస్థితులను, ప్రత్యర్థిని బట్టి ఓపెనింగ్ జోడీని బరిలోకి దించవచ్చు. మూడో స్థానంలో కేఎల్ రాహుల్ రూపంలో మేటి బ్యాటర్ ఉన్నాడు. నిరుడు దిల్లీకి వచ్చిన అతను నిలకడగా రాణించాడు. మిల్లర్, స్టబ్స్, అశుతోష్ శర్మలతో దిల్లీ మిడిల్ ఆర్డర్ కూడా బలంగా ఉంది. వీళ్లు బంతిని బాగా బాదగలరు. కానీ దిల్లీ ప్రధాన బలం మాత్రం బౌలింగే. స్టార్క్, కుల్‌దీప్, ఎంగిడి, నటరాజన్‌ల రూపంలో వికెట్లు తీయగల బౌలర్లు దిల్లీకి ఉన్నారు. వాళ్లకు తోడు కశ్మీర్ స్టార్ ఆకిబ్ నబి కూడా సత్తా చాటడానికి సిద్ధమవుతున్నాడు. అతణ్ని వేలంలో రూ.8.4 కోట్లకు దిల్లీ సొంతం చేసుకుందంటే తన సామర్థ్యంపై గట్టి నమ్మకమున్నట్లే. బంతితో, బ్యాటుతో సత్తా చాటగల అక్షర్ పటేల్ జట్టుకు పెద్ద బలం.

VIVID PROMOTIONS Pvt. Limited. # 9-18-1, Vinayagar Enclave, C.B.M.Compound, Visakhapatnam - 530 003. Ph : 0891-2734422. E-mail : vizagpublic@gmail.com Editor : YADAVALLI VENKATA HARI KRISHNA SAI

# విశ్వజి



## జుట్టు రాలడం తగ్గాలంటే ఈ పోషకాలు అవసరం..

### వీటిని రోజూ తీసుకోవాలి..

అందమైన, ఆరోగ్యవంతమైన జుట్టు కావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అందుకోసం ఎంతో ఖర్చు చేస్తూ ఉంటారు. అనేక రకాల హెయిర్ ప్రొడక్ట్స్ ను వాడుతూ ఉంటారు. అయినప్పటికీ చాలా మందికి అందమైన జుట్టును సొంతం చేసుకోవడం ఒక కల లాగానే ఉంటుందని చెప్పవచ్చు. ఒత్తైన, ఆరోగ్యవంతమైన జుట్టు కావాలనుకునే వారు హెయిర్ ప్రొడక్ట్స్ ను వాడడంతో పాటు జుట్టు పెరుగుదలకు అవసరమయ్యే సప్లిమెంట్స్ ను కూడా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఈ సప్లిమెంట్స్ జుట్టు పెరుగుదలలో గణణీయమైన మార్పును తీసుకు వస్తాయని వారు సూచిస్తున్నారు. జుట్టు కుదుళ్లను బలోపేతం చేయడం, జుట్టును మందంగా, ఒత్తుగా చేయడం, జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడం వంటి పనులను సప్లిమెంట్స్ నిర్వహిస్తాయని చెప్పవచ్చు. కనుక జుట్టు పెరుగుదలకు అవసరమైన వివిధ రకాల సహజ సప్లిమెంట్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. బయోటిన్..జుట్టు పెరుగుదలకు మద్దతు ఇచ్చే వాటిల్లో బయోటిన్ ఒకటి. జుట్టు నిర్మాణానికి అవసరమయ్యే కెరాటిన్ అనే ప్రోటీన్ ను సంశ్లేషణ చేయడంలో ఈ బి విటమిన్ సహాయపడుతుంది. చాలా మంది బయోటిన్ లోపంతో బాధపడుతూ ఉంటారు. దీంతో జుట్టు రాలడం, పలుచగా తయారవ్వడం, జుట్టు విరిగిపోవడం వంటివి జరుగుతాయి. జుట్టు సంబంధిత సమస్యలతో బాధపడే వారు ఆహారంలో గుడ్లు, గింజలు, తృణ ధాన్యాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఈ విటమిన్ లోపంతో మరింత ఎక్కువగా బాధపడే వారు బయోటిన్ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల జుట్టు సమస్యల నుండి సులభంగా బయటపడవచ్చు. సా పాల్మెట్టో అనే సప్లిమెంట్ ను తీసుకోవడం ద్వారా జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా బట్టతలతో బాధపడే వారు ఈ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ సప్లిమెంట్ జుట్టు రాలడాన్ని తగ్గించడంతో పాటు జుట్టు తిరిగి పెరిగేలా ప్రోత్సహిస్తుంది. బట్టతలతో బాధపడే వారు ఎక్కువగా సింథటిక్ చికిత్సలను తీసుకుంటూ ఉంటారు. అలాంటి వారు సా పాల్మెట్టో సప్లిమెంట్ ను తీసుకోవడం ద్వారా చికిత్స అవసరం లేకుండా సహజంగా తిరిగి జుట్టును పొందవచ్చు. అశ్వగంధ..

జిన్సెంగ్ ( అశ్వగంధ) ను సాంప్రదాయ వైద్యంలో చాలా కాలంగా వాడుతున్నారు. ఈ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల తలకు రక్తప్రసరణ పెరుగుతుంది. జుట్టు కుదుళ్లు బలంగా తయారవుతాయి. జుట్టు తెల్లగా మారడాన్ని అకాల బూడిద రంగును నివారించడంలో జిన్సెంగ్ ఎంతో సహాయపడుతుంది. ఈ సప్లిమెంట్స్ ను తీసుకోవడం ద్వారా లేదా జుట్టుకు అప్లై చేయడం ద్వారా ఒత్తుగా, ఆరోగ్యవంతమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు. సాధారణంగా వయసు పెరిగే కొద్ది కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీని వల్ల జుట్టు కుదుళ్లు బలహీనపడతాయి. జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుంది.

# ఈ పండ్లను రోజూ తింటే మీ గుండె సేఫ్..



### హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు..

శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో గుండె ఒకటి. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా అవసరం. కానీ ప్రస్తుత కాలంలో చాలా మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. గుండెపోటు, స్ట్రోక్ ల కారణంగా ప్రాణాలను కోల్పోతున్నారు. కనుక గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యంగా ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లతో నిండిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి పోషకాలన్ని కలిగి ఉన్న ఆహారాల్లో పండ్లు కూడా ఒకటి. పండ్లను తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. గుండె ఆరోగ్యాన్ని సంరక్షించడంలో సహాయపడే పండ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### బెర్రీలు, యాపిల్ పండ్లు..

గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో బెర్రీ జాతికి చెందిన పండ్లు ఎంతో సహాయపడతాయి. బ్లూబెర్రీ, స్ట్రాబెర్రీ, రాస్ప్బెర్రీ వంటి పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఆంథోసైనిన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి గుండె ప్రమాదాలను తగ్గించడంలో దోహదపడతాయి. ఈ పండ్లను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. స్మూతీ, పెరుగు, ఓట్ మీల్ వంటి వాటితో ఈ పండ్లను కలిపి తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆపిల్ పండ్లు కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఈ ఫైబర్ సహాయపడుతుంది. ఆపిల్స్ పాలీఫినాల్స్ ను కూడా కలిగి ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించే ప్రభావాలను కలిగి ఉంటాయి. ఆపిల్ ను తొక్కతో సహా కలిపి తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు.

### అవకాడో, నారింజ పండ్లు..

అవకాడోలు మోనోశాచురేటెడ్ కొవ్వులను కలిగి ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో అవసరం. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది. అవకాడోలను తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. హోల్ గ్రెయిన్ టోస్ట్ లతో, సలాడ్స్, స్మూతీ వంటి వాటితో అవకాడోలను కలిపి తీసుకోవచ్చు. నారింజ పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయి. వీటిలో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని, రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ధమనుల ధృడత్వాన్ని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. తాజా నారింజ పండ్ల రసాన్ని తీసుకోవడం లేదా నారింజ పండ్లను నేరుగా నమిలి తినడం వంటివి చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

### దానిమ్మ పండ్లు..

ఇక దానిమ్మ పండ్లు కూడా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో దోహదపడతాయి. దానిమ్మ పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ప్యూనికాలాజిన్లు ఉంటాయి. ఇవి ధమనుల్లో అడ్డంకులు ఏర్పడకుండా కాపాడడంలో, రక్తప్రవాహాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. సలాడ్లు లేదా పెరుగు మీద దానిమ్మ గింజలను చల్లి తీసుకోవడం ద్వారా, స్వచ్ఛమైన దానిమ్మ పండ్ల రసాన్ని తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ఈ విధమైన పండ్లను రోజూ ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. తద్వారా గుండె ఆరోగ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## బీట్ రూట్‌ను ఇన్ని రకాలుగా ఉపయోగించవచ్చు..

### మీ ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది.

మచ్చలేని, మెరిసే, అందమైన చర్మం కావాలని అందరూ కోరుకుంటారు. దాని కోసం ఎంతో ఖర్చు చేస్తూ ఉంటారు. సీరమ్, క్రీమ్ అని రకరకాల రసాయనాలను చర్మానికి రాస్తూ ఉంటారు. సంక్లిష్టమైన చర్మ సంరక్షణ దినచర్యలో ఒక భాగమైపోయిందని చెప్పవచ్చు. అయితే కొన్నిసార్లు అత్యంత ప్రభావవంతంగా పని చేసే నివారణలు ప్రకృతి నుండి వస్తాయని మీకు తెలుసా. ముఖ సౌందర్యాన్ని పెంచడంలో బీట్‌రూట్ ఎంతో సహాయపడుతుంది. ప్రకృతి నుండి సహజంగా లభించే ఈ బీట్‌రూట్ గొప్ప పోషకాలను కలిగి ఉంటుంది. దీనిని ఉపయోగించడం వల్ల సహజంగానే ఆరోగ్యకరమైన మెరుపును సొంతం చేసుకోవచ్చు. బీట్‌రూట్ ను వాడడం వల్ల తక్షణ గులాబీ రంగును మనం పొందవచ్చు. ముఖంపై పింక్ గ్లో కోసం బీట్‌రూట్ ను ఉపయోగించే మార్గాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### బీట్ రూట్ ఫేస్ మాస్క్..

బీట్‌రూట్ ను ఉపయోగించే సులభమైన మార్గాల్లో ఫేస్ మాస్క్ ఒకటి. దీనిని తయారు చేసుకోవడానికి గాను ఒక టీ స్పూన్ బీట్‌రూట్ రసంలో ఒక టీ స్పూన్ తేనె లేదా పెరుగు వేసి బాగా కలపాలి. తరువాత దీనిని ముఖానికి రాసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ముఖం తాజాగా పింక్ గ్లోతో కనిపిస్తుంది. బీట్‌రూట్ ను స్క్రబ్ లాగా కూడా ఉపయోగించుకోవచ్చు. బీట్‌రూట్ రసంలో కాఫీ లేదా చక్కెర వేసుకోవాలి. తరువాత కొద్దిగా తేనె వేసి కలపాలి. దీనిని చర్మంపై వృత్తాకార దిశలో రాస్తూ మర్దనా చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉండే మురికి, మృతకణాలు తొలగిపోయి ముఖం తాజాగా, అందంగా కనిపిస్తుంది. ఉదయం నిద్ర లేచిన తరువాత కళ్లు, ముఖం కొద్దిగా ఉబ్బినట్టు కనిపిస్తాయి. ఈ వాపును తగ్గించడంలో బీట్‌రూట్ ఐస్ క్యూబ్స్ ఎంతగానో సహాయపడతాయి.

### బీట్ రూట్ ఐస్ క్యూబ్స్..

ఈ ఐస్ క్యూబ్స్ ను తయారు చేసుకోవడానికి నీటిలో బీట్‌రూట్ రసం వేసి కలిపి ఐస్ ట్రేలో పోయాలి. ఈ నీటిని రాత్రంతా ఫ్రిజ్ లో ఉంచి ఐస్ గా మారిన తరువాత ముఖంపై అప్లై చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల వాపు తగ్గడంతో పాటు చర్మం ప్రకాశవంతంగా, బిగుతుగా తయారవుతుంది. ఇక బీట్‌రూట్ ను టోనర్ గా ఉపయోగించుకోవచ్చు. బీట్‌రూట్ రసాన్ని రోజ్ వాటర్ తో కలిపి స్ప్రే బాటిల్ లోకి బదిలీ చేసుకోవాలి. రాత్రి నిద్రించే ముందు ముఖంపై స్ప్రే చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మ రంధ్రాలు బిగుతుగా మారడంతో పాటు చర్మం కూడా సహజంగా గులాబీ రంగును సంతరించుకుంటుంది. బీట్‌రూట్ శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించడంతో పాటు చర్మ సౌందర్యాన్ని మెరుగుపరచడంలో కూడా అనేక రకాలుగా మనకు సహాయపడుతుంది. దీనిని ఉపయోగించడం వల్ల సహజంగా, ఎటువంటి ఖర్చు లేకుండా చర్మ ఆరోగ్యాన్ని, సౌందర్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.





## పరీక్ష.. ఓ బెస్ట్ ఫ్రెండ్

నీకో ఫ్రెండ్ ఉన్నాడు. తను కలిసిన ప్రతిసారీ జీవితంలో ఓ మెట్టు పైకి ఎక్కుతున్నావ్. ఈ క్రమంలో నువ్వు అలసిపోయి ఆగిపోతే ఆ ఫ్రెండ్ నీ ప్రయాణం ఆగకుండా మరో చాన్స్ తీసుకువస్తున్నాడు. అలాంటి ఫ్రెండ్‌ని నువ్వు ఇష్టపడతావా? అతనికి భయపడతావా? అంటే, ఊరుకో బాస్ అలాంటి దోస్తుకి ఎవరైనా భయపడతారా? ఇష్టపడతారు గానీ అంటారు కదా! మరి పరీక్ష అంటే భయమెందుకు బ్రో.. మనం చెప్పుకొన్న ఫ్రెండ్ ప్లేస్‌లో పరీక్షను పెట్టి చూడు. తను అలాగే చేస్తుంది కదా! పరీక్ష రాసిన ప్రతిసారీ నువ్వు పై తరగతికి వెళ్తున్నావ్. ఎప్పుడైనా ఫెయిల్ అయితే సప్లీ ఉంటుంది కదా! రాసి నెక్ట్స్ లెవెల్‌కి వెళ్తున్నావ్ కదా.. ఫ్రెండ్ కంటే ఏం తక్కువ చేస్తుంది పరీక్ష. మరి దానికెందుకు భయపడుతున్నావ్. ఒక్కసారి ఆలోచించు.. పరీక్షని ఎనిమీలా కాకుండా ఓ బెస్ట్ ఫ్రెండ్‌లా చూస్తే విజయం నీదే. ఈ వారంలోనే ఇంటర్ పరీక్షలు మొదలవుతున్నాయి. పరీక్షలు దగ్గరికొచ్చాయని కంగారొద్దు బంగారు కొండలు. పరీక్ష రూపంలో ఎదురవుతున్న మీ ఫ్రెండ్‌ను మనస్ఫూర్తిగా కలవండి. తలబడి కాదు.. నిలబడి గెలవండి.

# మార్కెట్

## రూ.1.63 లక్షల పైకి బంగారం

### రూ.2 వేల వరకు పెరిగిన తులం ధర

### రూ.25 వేలు అధికమైన కిలో వెండి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: గత కొన్ని రోజులుగా తగ్గిన బంగారం ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో దేశీయంగా ధరలు మూడు శాతం వరకు అధికమయ్యాయి. కిలో వెండి ఏకంగా రూ.2.7 లక్షలకు చేరుకోగా, బంగారం రూ.1.6 లక్షలు పలికింది. ఫలితంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.3,300 లేదా 2 శాతం ఎగబాకి రూ.1,62,800కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.1,59,500గా ఉన్నది. అలాగే కిలో వెండి రూ.8 వేలు లేదా 3.03 శాతం ఎగబాకి రూ.2.72 లక్షలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,070 ఎగబాకి రూ.1,61,350 పలికింది. అలాగే 22 క్యారెట్ ధర రూ.1,900 అందుకొని రూ.1,47,900కి చేరుకున్నది. వెండి రూ.10 వేలు అందుకొని రూ.3 లక్షలకు చేరుకున్నది. ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతోపాటు అమెరికా-ఇరాన్‌ల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3 శాతం లేదా 154 డాలర్లు ఎగబాకి 5,235 డాలర్లు పలుకగా, వెండి 6 శాతం లేదా 4.87 డాలర్లు అందుకొని 87 డాలర్లకు చేరుకున్నది.

## స్వల్పంగా లాభపడ్డ స్టాక్ మార్కెట్‌లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ఆరంభంలో మంచి లాభాలు కనిపించినప్పటికీ.. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు రోజంతా ఒడిదొడుకులకు లోనయ్యాయి. చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 50.15 పాయింట్ల స్వల్ప లాభంతో 82,276.07 వద్ద, నిఫ్టీ 57.85 పాయింట్ల లాభంతో 25,482.50 వద్ద స్థిరపడ్డాయి.

మార్కెట్లలోని అస్థిరతకు అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర భారం మోపింది. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ లాంటి ఐటీ షేర్లతోపాటు టాటా స్టీల్ లాంటి మెటల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్‌లు నష్టాల్లోకి జారుకోకుండా నిలిచాయి.


సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ అత్యధికంగా 2.23 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్‌లు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్ 2.8 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్, టీసీఎస్, ఇండిగో, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు కూడా లాభాలను నమోదుచేశాయి.

ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్‌లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.58 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.96 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ అత్యధికంగా రాణించగా.. నిఫ్టీ ఐటీ, ఫార్మా సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. అయితే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ ఈ సెషన్‌లో అత్యధికంగా నష్టపోయింది.

## 162 లక్షల కోట్లకు..

### అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రిటైల్ రుణాల బకాయిలు

ముంబై : గత ఏడాది అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రిటైల్ రుణాల బకాయిలు 18.1 శాతం పెరిగి రూ.162 లక్షల కోట్లకు చేరుకున్నాయి. బంగారం ధరలు పెరిగిన నేపథ్యంలో గోల్డ్ లోన్లకు ఏర్పడిన గిరాకీ, పండుగల సీజన్, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) హేతుబద్ధీకరణ ఇందుకు కారణమని క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ (సీఐసీ) క్రిఫ్ హై మార్క్ మంగళవారం విడుదల చేసిన గణాంకాలు చెప్తున్నాయి. కాగా, ఈ రిటైల్ రుణాల బకాయిల్లో గత త్రైమాసికం గృహ రుణాల వాటా అత్యధికంగా 10.50 శాతం ఎగిసింది. రూ.43 లక్షల కోట్లను తాకినట్టు సీఐసీ తెలిపింది. అలాగే గోల్డ్ లోన్ల బకాయిలు 44.1 శాతం వృద్ధితో రూ.16.2 లక్షల కోట్లకు, వ్యక్తిగత రుణాల బకాయిలు 11.6 శాతం పెరుగుదలతో రూ.15.90 లక్షల కోట్లకు చేరాయి. తగ్గిన జీఎస్టీ రేట్లు.. కార్లు, ద్విచక్ర వాహనాలు, కన్జ్యూమర్ డ్యూరబుల్ లోన్లలో ఏడాది క్రితంతో పోల్చితే వరుసగా 14.60 శాతం, 12.30 శాతం, 14.30 శాతం చొప్పున వృద్ధికి దోహదం చేశాయి.



# సరస్వతి పవర్ వివాదం 'విజయమ్మకు వాటాల బదిలీ చట్టబద్ధమే'


**జగన్, విజయమ్మ మధ్య కుదిరిన అవగాహన మేరకే వాటాల బదిలీలు జరిగాయని వెల్లడి**

**అభ్యంతరం చెబుతూ జగన్, భారతి ఎలాంటి లిఖితపూర్వక సమాచారం ఇవ్వలేదన్న సంస్థ**



సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌కు చెందిన వాటాలను విజయమ్మ పేరుతో బదలాయించిన చాలా కాలం తర్వాత ఈడీ ఆస్తుల్ని జప్తు చేసిందని, ఆ సంస్థ ఎన్‌సీఎల్‌ఏటీకి నివేదించింది. విజయమ్మ పేరుతో వాటాల బదిలీకి ముందు ఎలాంటి దశలోనూ అందుకు అనుమతించొద్దని వైఎస్ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీలు కంపెనీకి లిఖితపూర్వక సమాచారమివ్వలేదని పేర్కొంది. వైఎస్ జగన్, విజయమ్మ మధ్య కుదిరిన అవగాహన మేరకే ఆమెకు వాటాల బదిలీ జరిగి హక్కులు సంక్రమించాయని తెలియజేసింది. విజయమ్మకు వాటాల బదిలీకి సంబంధించి చట్టబద్ధమైన పత్రాలున్నాయన్నది నిర్వివాద వాస్తవమని, వాటాల బదిలీకి ఎలాంటి అడ్డంకులూ లేవని స్పష్టం చేసింది.ఆ తీర్పు చట్టవిరుద్ధం: విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డిల పేరుతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు తీర్మానించడం, దాని ప్రకారం రిజిస్టర్‌లో సభ్యుల పేర్లను మార్చడాన్ని సవాల్ చేస్తూ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీలు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌ఏటీలో గతంలో పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన ఎన్‌సీఎల్‌ఏటీ, వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్, భారతి, క్లాసిక్‌రియాల్టీల పేర్లను పునరుద్ధరించాలంటూ గతేడాది జులై 29న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు చట్టవిరుద్ధమని, దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులివ్వాలంటూ చెన్నై ఎన్‌సీఎల్‌ఏటీలో సరస్వతి పవర్ లిమిటెడ్, విజయమ్మ వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. ఈ అప్పీళ్లలో వైఎస్ జగన్ తదితరులు కౌంటర్ వేస్తూ పలు ఆరోపణలు చేశారు. వాటిని తిప్పికొడుతూ ఇటీవల సరస్వతి పవర్ రిప్లై కౌంటర్ దాఖలు చేసింది. అప్పీల్ వేసే అర్హత కంపెనీకి లేదనడం సరికాదని తేల్చిచెప్పింది. రిజిస్టర్‌లో వాటాల బదిలీ మార్పునకు సంబంధించి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తీసుకున్న తీర్మానాలను, వాటాల బదిలీకి అనుసరించిన విధానాన్ని ఎన్‌సీఎల్‌టీ తప్పుపట్టిందని, అందువల్ల అప్పీల్ వేసే అర్హత కంపెనీకి ఉందని స్పష్టం చేసింది.ఉల్లంఘనలు జరగలేదు : తటస్థ వైఖరితో అప్పీలు వేసే అర్హత లేదని జగన్ తదితరులు తప్పుగా భావిస్తున్నారని, ఒకరి తరఫున వకాల్తా పుచ్చుకోలేదని సరస్వతి పవర్ కంపెనీ కౌంటర్‌లో పేర్కొంది. బోర్డు తీర్మానాలను సవరించాలంటూ ట్రైబ్యునల్ చెప్పడంతోనే అప్పీల్ దాఖలు చేశామని తెలిపింది. వాటాల బదిలీ ఒప్పందం, గిఫ్ట్‌డీడ్ అమలును ఎవరూ విభేదించడం లేదని, కొనుగోలు చేసిన వాటాలకు సొమ్ము చెల్లించలేదనీ చెప్పడం లేదని పేర్కొంది. విజయమ్మ పేరుతో వాటాల బదిలీ ప్రక్రియలో ఉల్లంఘనలేవీ జరగలేదని తెలిపింది. పరోక్షంగా గిఫ్ట్‌డీడ్ షేర్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయాలని కోరడమే జగన్, భారతిరెడ్డిల ఉద్దేశమని పేర్కొంది. వివాదాస్పద వాస్తవాల ఆధారంగా రికార్డులను సవరించాలని కోరరాదని స్పష్టం చేసింది. పార్టీల మధ్య విక్రయ ఒప్పందం, వాటా కొనుగోలు ఒప్పందాలున్నాయని తెలిపింది. ఆ ప్రకారమే సొమ్ము చెల్లించారని వివరించింది.నోటీసు అవసరం లేదు : గిఫ్ట్‌డీడ్‌కు సంబంధించి జగన్, విజయమ్మల మధ్య ఇప్పటికీ ప్రేమ, ఆప్యాయతలు కొనసాగుతున్నాయనడంలో సందేహం లేదని స్పష్టం చేసింది. గిఫ్ట్‌డీడ్, వాటాల కొనుగోలు ఒప్పందాలను ఎవరూ తిరస్కరించనప్పుడు వాటాల బదిలీ అనేది కంపెనీకి, వాటాలు పొందిన వ్యక్తికి మధ్య జరిగే ఒక ప్రక్రియ మాత్రమేనని తెలిపింది. జగన్ తదితరులు కంపెనీ చట్టంలోని సెక్షన్-59 పరిధిలోకి రారని, వారికి ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేసే అర్హత లేదని పేర్కొంది. విజయమ్మ పత్రాలు కనిపించలేదని చెప్పడంతో బోర్డు సమావేశమై నోటరీతో రాతపూర్వక లేఖ పొందాక 2024 జులై 6న వాటాల బదిలీ జరిగిందని స్పష్టం చేసింది. ఆ సమయంలో జగన్ తదితరులకు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదంది. చట్టప్రకారమే రిజిస్టర్‌లో పేర్ల మార్పిడి జరిగిందని, దీన్ని గుర్తించకుండా వివాదాస్పద వాస్తవాల ఆధారంగా హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని సరస్వతి పవర్ సంస్థ కోరింది.2021 జులై 24న క్లాసిక్ రియాల్టీ నుంచి వాటాల కొనుగోలు ఒప్పందం చేసుకున్నానని సరస్వతి పవర్ లిమిటెడ్ డైరెక్టర్ చాగరి జనార్దన్‌రెడ్డి ఎన్‌సీఎల్‌ఏటీకి సమర్పించిన రిప్లై కౌంటర్‌లో పేర్కొన్నారు. ఇందుకోసం రూ. 16 లక్షల 77వేలు చెల్లించినట్లు తెలిపారు. మొదట అదనపు డైరెక్టర్‌గా నియమితుడైన తాను 2021 సెప్టెంబరు 25న రెగ్యులర్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినట్లు వెల్లడించారు. భద్రత దృష్ట్యా కంపెనీ వాటాలన్నీ ఒకేచోట ఉంచాలన్న ఉద్దేశంతో తాను కొన్న వాటా ధ్రువీకరణ పత్రాలను, బదిలీ పత్రాలను విజయమ్మకు అప్పగించినట్లు వివరించారు.డైరెక్టర్‌గా తనను నియమించినప్పటికీ సభ్యుల రిజిస్టర్‌లో వాటాదారుగా పేరు నమోదు కాలేదని తెలియడంతో, అందుకోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. రిజిస్టర్ సవరణకు వాటా ధ్రువీకరణ పత్రాలు లేవని తేలడంతో నోటరైజ్డ్ లేఖను కంపెనీకి అందజేసినట్లు వివరించారు. ఎన్‌సీఎల్‌టీలో ఉత్తర్వు ఆధారంగా వాటా కొనుగోలు ఒప్పందం కింద చెల్లించిన ప్రతిఫలాన్ని వాపసు ఇస్తున్నట్లు క్లాసిక్ రియాల్టీ సమాచారం పంపిందనీ, ఇది సివిల్ కోర్టు ప్రక్రియను తప్పించుకోవడానికి చేస్తున్న ప్రయత్నమని చాగరి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇరుపక్షాల మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయడానికి సెక్షన్-59ని ప్రతివాదులు వాడుకుంటున్నట్లు స్పష్టమవుతోందని కౌంటర్‌లో పేర్కొన్నారు.

# అమెరికా మాపై దాడి చేస్తే, మేం భారత్ పై బాంబులు వేస్తాం



**పాక్ మాజీ రాయబారి**

పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ అమెరికా తమ దేశంపై దాడి చేస్తే, అందుకు ప్రతీకారంగా తాము భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. ఢిల్లీ, ముంబై నగరాలపై బాంబు దాడులకు దిగుతామని ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన... "అమెరికా మాపై దాడి చేస్తే, మేం వెంటనే భారత్‌పై దాడి చేయాలి. ముంబై, ఢిల్లీలను వదిలిపెట్టం. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం" అని పేర్కొన్నారు. తమ దేశ అణు సంపదను లక్ష్యంగా చేసుకున్నా ఇదే తరహా ప్రతిస్పందన ఉంటుందని అన్నారు. అయితే, ఇది దాదాపు అసాధ్యమైన సందర్భమని అంగీకరిస్తూనే, దీనిని 'వ్యూహాత్మక ఉన్మాదం'గా అభివర్ణించడం గమనార్హం.2014 నుంచి 2017 వరకు భారత్‌లో పాకిస్థాన్ హైకమిషనర్‌గా పనిచేసిన బాసిత్ నుంచి ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు రావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు ఎదుర్కొంటోంది. ఈ సమయంలో భారత్‌ను అనవసరంగా వివాదంలోకి లాగుతూ బాసిత్ మాట్లాడటంపై సోషల్ మీడియాలో భారతీయులు తీవ్రంగా మండిపడుతున్నారు.పాక్ అధికారులకు తమ సమస్యలను పక్కనపెట్టి భారత్‌ను బెదిరించడం అలవాటుగా మారిందని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి స్పందన రాలేదు.

# 25 ఏళ్లుగా అధికారంలో ప్రభుత్వాధినేతగా ప్రధాని మోదీ సరికొత్త రికార్డు



ప్రధాని నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో ఓ చారిత్రక మైలురాయిని అందుకున్నారు. ఎన్నికైన ప్రభుత్వానికి అత్యధిక కాలం అధినేతగా పనిచేసిన వ్యక్తిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ప్రజా జీవితంలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఆయన 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు.పవన్ కుమార్ చామ్లింగ్ సిక్కిం సీఎంగా 8,930 రోజులు పదవిలో కొనసాగగా, నరేంద్ర మోదీ ఆ రికార్డును దాటి 8,931 రోజులు పూర్తి చేసుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా ఆయన పనిచేసిన కాలాన్ని కలిపి ఈ ఘనత సాధించారు. ఈ అరుదైన మైలురాయి ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.సీఎంగా, పీఎంగా అత్యధిక కాలంనరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. 2014 మే 21 వరకు, దాదాపు 13 ఏళ్లకు పైగా ఆ పదవిలో కొనసాగి, గుజరాత్‌కు అత్యధిక కాలం పనిచేసిన సీఎంగా నిలిచారు. అనంతరం 2014 మే 26న 14వ భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించి ప్రధాని అయిన తొలి వ్యక్తిగా, వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నేతగా ఆయనకు పలు రికార్డులు ఉన్నాయి. పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తిచేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా ఆయన ఘనత సాధించారు.సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లురాజకీయ రికార్డులతో పాటు, డిజిటల్ ప్రపంచంలోనూ మోదీ తనదైన ముద్ర వేస్తున్నారు. ఈ ఏడాది ఆయన సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లను దాటారు. ఇటీవలే తన యూట్యూబ్ ఛానెల్‌లో 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుని, ప్రపంచ నేతల్లో అగ్రస్థానంలో నిలిచారు. గత ఫిబ్రవరిలో ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి ప్రపంచ నేతగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆయనకు ఇన్‌స్టాలో 10.1 కోట్ల మంది, ఎక్స్ (ట్విట్టర్) లో 10.64 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి బ్యాంకు ఏటీఎమ్, యూపీఐ వాడకంలో కీలక మార్పులు!






ఏప్రిల్ 1వ తేదీ నుంచి పలు బ్యాంకులు తమ నిబంధనల్లో కీలక మార్పులు తీసుకువస్తున్నాయి. ముఖ్యంగా ఏటీఎమ్ నగదు ఉపసంహరణ, యూపీఐ లావాదేవీలకు సంబంధించి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వంటివి తమ కస్టమర్ల కోసం కొత్త మార్గదర్శకాలను ప్రకటించాయి. ఈ మార్పుల గురించి వినియోగదారులు ముందే తెలుసుకోవడం ద్వారా అనవసర చార్జీలను నివారించుకోవచ్చు.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ఏటీఎమ్ లావాదేవీల లెక్కింపు విధానంలో మార్పు చేసింది. ఇప్పటివరకు డెబిట్ కార్డు ద్వారా ఏటీఎమ్‌లో తీసిన నగదును మాత్రమే ఉచిత లావాదేవీల పరిమితిలో లెక్కించేవారు. కానీ ఏప్రిల్ 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చేసే నగదు ఉపసంహరణలను కూడా ఈ కోటాలోనే పరిగణిస్తారు. హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎమ్‌లలో నెలకు 5 సార్లు, ఇతర బ్యాంకుల ఏటీఎమ్‌లలో (మెట్రోలలో 3, నాన్-మెట్రోలలో 5) ఉచితంగా నగదు తీసుకోవచ్చు. ఈ పరిమితి దాటితే ప్రతి లావాదేవీకి రూ.23తో పాటు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.మరోవైపు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కొన్ని డెబిట్ కార్డులపై రోజువారీ నగదు ఉపసంహరణ పరిమితిని తగ్గించింది. రిస్క్ మేనేజ్ మెంట్, కార్డుల వినియోగం తీరు తెన్నుల్లో ఏకీకృత విధానం కోసం ఈ మార్పులు చేసినట్లు సమాచారం. తాజా రూల్స్ ప్రకారం.. పీఎన్‌బీ కస్టమర్లు తమ డెబిట్ కార్డు రకాన్ని బట్టి రోజుకు గరిష్ఠంగా రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకూ నగదును తీసుకోవచ్చు. గతంలో 1 లక్షల వరకూ నగదు ఉపసంహరణకు అనుమతి ఉన్న కార్డుల పరిమితిలో కూడా కోత పడింది.ఇక జియో పేమెంట్స్ బ్యాంక్ తన కస్టమర్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వద్ద నగదు తీసుకునే కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అలాగే, ఏప్రిల్ 1 నుంచి రూపే ప్లాటినం డెబిట్ కార్డులపై ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ పొందాలంటే, వినియోగదారులు నిర్దేశిత మొత్తంలో ఖర్చు చేయాలనే కొత్త నిబంధనను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పీసీఐ) తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో, కస్టమర్లు తమ బ్యాంకుల తాజా నిబంధనలను తెలుసుకొని తదనుగుణంగా వ్యవహరించడం మంచిది.

## ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ ఏపీకే ఫైల్స్‌పై ఏపీ డీజీపీ తీవ్ర హెచ్చరిక



యాండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. ముఖ్యంగా 'ఏపీకే ఫైళ్ల' రూపంలో వస్తున్న కొత్త తరహా సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని కోరుతూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.సైబర్ నేరగాళ్లు ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని డీజీపీ తెలిపారు. 'గ్యాస్ కనెక్షన్ రీ-కేవైసీ చేయాలని, ప్రభుత్వ పథకాలకు అర్హులయ్యారని నమ్మించి ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయిస్తారు. ఆ తర్వాత మీ వ్యక్తిగత, బ్యాంకు వివరాలు సేకరించి ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకుంటారు. వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మొత్తం కాజేస్తారు' అని ఆయన వివరించారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లో వచ్చే ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. ఒకసారి ఈ ఫైల్స్ ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్‌లోని ఎస్ఎంఎస్‌లు, కాంటాక్టులు, పాస్‌వర్డ్‌లు నేరగాళ్ల చేతికి చిక్కుతాయన్నారు.పొరపాటున ఎవరైనా ఇలాంటి మాల్వేర్ ఇన్‌స్టాల్ చేస్తే వెంటనే ఫోన్‌ను రీబూట్ చేయాలని సూచించారు. అలాగే, ఫోన్ సెట్టింగ్స్‌లో 'ఇన్‌స్టాల్ ఫ్రమ్ అన్నోన్ సోర్సెస్' ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవడం సురక్షితమని తెలిపారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఎవరైనా వీడియో కాల్ చేసి బెదిరిస్తే భయపడవద్దని, మన దేశ చట్టాల్లో అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. ఎవరైనా మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఇరాన్‌పై జీ7 దేశాల కన్నెర్ర


**అణ్వాయుధాలు సమకూర్చుకోవద్దని వార్నింగ్**

మధ్యప్రాచ్యంలోని పలు దేశాల్లో పౌరులు, కీలక మౌలిక సదుపాయాలపై ఇరాన్ చేస్తున్న దాడులను జీ7 దేశాల కూటమి తీవ్రంగా ఖండించింది. ఇరాన్, దాని అనుబంధ వర్గాలు చేస్తున్న ఈ



అన్యాయమైన దాడులను ఎదుర్కొంటున్న ప్రాంతీయ భాగస్వామ్య దేశాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, అమెరికా దేశాల విదేశాంగ మంత్రులతో పాటు యూరోపియన్ యూనియన్ ఉన్నత ప్రతినిధి సంయుక్త ప్రకటన విడుదల చేశారు.బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, జోర్డాన్, ఇరాక్‌లలో పౌరులు, ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యపూరిత దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని జీ7 కూటమి స్పష్టం చేసింది. ఇరాన్ చర్యలు కేవలం లక్షిత దేశాలకే కాకుండా, ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు కూడా పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని హెచ్చరించింది. ఇలాంటి దాడులన్నింటినీ తక్షణమే, బేషరతుగా నిలిపివేయాలని డిమాండ్ చేసింది.హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల భద్రత, ప్రపంచ సరఫరా వ్యవస్థల పరిరక్షణ చాలా ముఖ్యమని జీ7 దేశాలు నొక్కి చెప్పాయి. ఇరాన్ లేదా దాని అనుబంధ వర్గాల దాడులను ఎదుర్కొంటున్న దేశాలకు తమ భూభాగాలను, పౌరులను రక్షించుకునే హక్కు ఉందని, వారి భద్రత, సార్వభౌమత్వానికి తమ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చాయి.ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని పొందకూడదని పునరుద్ఘాటించిన జీ7 కూటమి.. తన బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని, ప్రాంతంలో అస్థిరత సృష్టించే కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాలని పిలుపునిచ్చింది.

## ఇజ్రాయెల్ అణు కేంద్రంపై ఇరాన్ భీకర దాడి



పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు తీవ్రస్థాయికి చేరాయి. ఇజ్రాయెల్‌లోని కీలకమైన డిమోనా అణు పరిశోధన కేంద్రమే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడికి పాల్పడింది. తమపై గతంలో జరిగిన దాడులకు ప్రతీకారంగానే ఈ చర్య చేపట్టినట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దాడుల ధాటికి డిమోనా, ఆరాద్ పట్టణాల్లో 100 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది.ఇజ్రాయెల్ అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఛేదించుకుని ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు అణు కేంద్రం సమీపంలో పడటంతో ఆ ప్రాంతంలో భారీ పేలుళ్లు సంభవించాయి. అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది మరింత విధ్వంసానికి దారితీయవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.ఈ పరిణామంతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన భద్రతా కేబినెట్‌తో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని ప్రధాన చమురు, అణు కేంద్రాలపై ప్రతిదాడికి ఇజ్రాయెల్ వైమానిక దళం సిద్ధమవుతున్నట్లు అల్ జజీరా, రాయిటర్స్ వంటి అంతర్జాతీయ వార్తా సంస్థలు నివేదించాయి. ఈ దాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## డాక్టర్ వందన హత్య కేసు.. టీచర్‌కు జీవిత ఖైదు



కేరళలో సంచలనం సృష్టించిన యువ వైద్యురాలు వందన దాస్ హత్య కేసులో కొల్లం అడిషనల్ సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌ను అతి కిరాతకంగా హతమార్చిన స్కూల్ టీచర్ జి. సందీప్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. జీవితాంతం అతడు జైలులోనే గడపాలని స్పష్టం చేసింది. హత్య నేరానికి ఈ శిక్షతో పాటు, ఇతర నేరాలకు అదనంగా 30 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆదేశించారు.2023 మే 10న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ గొడవలో గాయపడిన సందీప్‌ను పోలీసులు వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకురాగా, అక్కడే సర్జికల్ కత్తెరతో డాక్టర్ వందనపై దాడి చేసి 27 సార్లు పొడిచి చంపాడు. నిందితుడు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు నాటకమాడినప్పటికీ, పక్కా ప్రణాళికతోనే ఈ హత్య జరిగిందని కోర్టు నిర్ధారించింది.అయితే, ఈ తీర్పుపై బాధితురాలి కుటుంబం, ప్రాసిక్యూషన్ అసంతృప్తి వ్యక్తం చేశాయి. నిందితుడికి మరణశిక్ష విధించాలని కోరుతూ కేరళ హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించాయి. ఇది "అత్యంత అరుదైన కేసు" కిందకు వస్తుందని, కాబట్టి ఉరిశిక్షే సరైనదని వారు వాదిస్తున్నారు.

క్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దిన పత్రిక



# వరుస సినిమాలతో స్పీడ్‌పెంచిన రితికాసింగ్




చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుత్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. విక్టరీ వెంకటేశ్ నటించిన గురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రితికా సింగ్. ఈ మూవీ తర్వాత అంతగా ఆఫర్స్ రాలేదు.. తెలుగులో పెద్దగా కనిపించక పోయినా తమిళ్ లో సినిమాలు చేస్తుంది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుత్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు తెలుగుతోపాటు తమిళం, మలయాళం చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ గుర్తింపు సంపాదించు కుంటుంది. గురు సినిమా తర్వాత తర్వాత విజయ్ సేతుపతితో కలిసి ఆండవన్ కట్టలై, అలాగే రాఘవ లారెన్స్ సరసన శివలింగ సినిమాల్లో నటించింది రితిక. ఈ రెండు చిత్రాలు కూడా హిట్ గా నిలిచాయి. గురు తర్వాత నేరుగా మరే తెలుగు సినిమా లోనూ నటించలేదు రితిక. కేవలం నీవెవ్వరో అనే సినిమాలో కనిపించింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా రజనీకాంత్ వెట్టయాన్ సినిమాలో నటించింది. వెట్టయాన్ చిత్రంలో కీలకపాత్ర పోషించింది. ఇందులో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ఆకట్టుకుందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే.. రితిక సోషల్ మీడియలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ చేసే వర్కౌట్లకు అభిమా నులు, నెటిజన్లు ఆశ్చర్యపోతుంటారు. అలాగే కొన్ని క్రేజీ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది ఈ వయ్యారి భామ. తాజాగా రితిక షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# మహేష్‌బాబు సినిమాలో ప్రియాంకచోప్రా క్యారెక్టర్ లీక్..?



దర్శకధీరుడు రాజమౌళి, మహేష్ బాబు కాంబోలో ప్రస్తుతం ఎస్-ఎస్ఎంబీ29 అనే చిత్రం స్లో అండ్ స్టడీగా చిత్రీకరణ జరుపుకుంటుంది. ఒడిశాలో ఈ మూవీ షూటింగ్ జరుపుకుంటున్నట్టు తెలుస్తుండగా, అక్కడ షూట్ ప్రారంభించిన మొదటి రోజే ఓ వీడియో లీక్ అయింది. జక్కన్న తీసిన సీన్స్ అన్ని లీక్ కావడంతో ఆయన షూటింగ్‌లో ఇప్పుడు చాలా స్ట్రిక్ట్ యాక్షన్ అమలు చేస్తున్నట్టు తెలుస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తుంది. ఇందులో ప్రియాంక చోప్రా ముఖ్య పాత్ర పోషిస్తుండగా, ఆమెని నెగెటివ్‌గా జక్కన్న చూపించబోతున్నట్టు సమాచారం. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా అధికారిక ప్రకటన రాని నేపథ్యంలో ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. రాజమౌళి సినిమా అంటే ట్విస్ట్‌లు మాములుగా ఉండవు. ఏది చేసిన కూడా అది సంచలనమే అవుతుంది. ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ వార్తలలో నిజమెంత ఉందనేది తెలియాల్సి ఉంది. ఇక రాజమౌళి తన సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు కేవలం నటన, టెక్నికల్ అంశాల్లోనే కాకుండా సెట్ లో క్రమశిక్షణ మరియు పర్యావరణంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనే విషయం మనకు తెలిసిందే.

ఇది మరో సారి వెల్లడైంది. మహేష్ తో షూటింగ్ చేస్తున్న ఆ లోకేషన్ లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించారు. కఠిన నిబంధనలతో షూటింగ్ ఈ మూవీ సెట్ లో రాజమౌళి అమలు చేస్తున్నట్లు తెలుస్తుంది. హీరో మహేష్ బాబుకు ఇద్దరూ ప్రియాంక చోప్రా కు ఇద్దరు అసిస్టెంట్లకు మాత్రమే లోకేషన్లో పర్మిషన్ ఇవ్వగ మిగతా ఆర్టిస్టులకు ఒక్కొక్కరికి ఒక అసిస్టెంట్ మాత్రమే అనుమతిచ్చారట జక్కన్న. నిజానికి ప్రియాంక చోప్రా కు మేకప్ మరియు వ్యక్తిగత సహాయకులగా దాదాపు 13 మంది ఉంటారు కానీ ఈ సెట్లో కేవలం ఇద్దరికీ మాత్రమే అనుమతి ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ ఒడిశా లోని కోరాపూట్ జిల్లాలో జరుగుతుంది.





# టికెట్ ధరలు తగ్గించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' టీమ్..

## ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకర్షించే స్ట్రాటజీ!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన మాస్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ మూవీ ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. విడుదలైన మొదటి రోజునుంచే ఈ సినిమా మంచి స్పందనను అందుకుంటూ, ముఖ్యంగా వీకెండ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లో సాలిడ్ కలెక్షన్లను రాబడుతోంది. సినిమాలో మాస్ ఎలిమెంట్స్, పవన్ కళ్యాణ్ స్టైల్ యాక్షన్, ఎంటర్టైనింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపు సాధారణ ప్రేక్షకులపై, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. టికెట్ రేట్లు ఎక్కువగా ఉండటంతో కొంతమంది ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి వెనుకంజ వేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ టికెట్ ధరలతోనే సినిమా ప్రదర్శించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా మరింత మంది ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకర్షించాలని మేకర్స్ భావిస్తున్నారు. టికెట్ ధరలు తగ్గించడం వల్ల సినిమాకు లాంగ్ రన్‌లో మరింత కలెక్షన్లు వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. సినిమాకి తొలి రోజే మిక్స్ డ్ టాక్ లభించింది. అయితే టికెట్ ధరలు తగ్గించే ఈ నిర్ణయం 'ఉస్తాద్ భగత్ సింగ్'కు ఎంతవరకు ప్లస్ అవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవనుంది.

# కోర్టు మూవీలో అందరినీ ఆకట్టుకున్న ముద్దుగుమ్మ శ్రీదేవి

కోర్టు మూవీలో జాబిలి పాత్రలో తన నటనతో అందరినీ మాయ చేస్తున్న ముద్దుగుమ్మ శ్రీదేవి. ఈ అమ్మడుగు గురించి ఎంత చెప్పినా తక్కువే. తళు క్కుమనే అందం ఈ బ్యూటీ సొంతం. కోర్టు మూవీ రిలీజైన తర్వాత ఈ బ్యూటీ గురించి నెటిజన్స్ తెగ వెతికేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ బ్యూటీ కొన్ని ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందాల ముద్దుగుమ్మ శ్రీదేవి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. నాని నిర్మాతగా ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కిన కోర్టు మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఇందులో పేదింటి అమ్మాయిగా శ్రీదేవి జాబిలి పాత్రలో నటించి తన పాత్రకు ప్రాణం పోసిందనే చెప్పాలి. దీంతో శ్రీదేవి నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయితుండటంతో చాలా మంది ఎవరు ఈ బ్యూటీ అంటూ నెట్టింట తెగ సెర్చ్ చేస్తున్నారు. అయితే కోర్టు మూవీలో జాబిల్లి పాత్రలో మెరిసిన చిన్నది ఏపీలోని కాకినాడకు చెందిన తెలుగు అమ్మాయినే ఈ ముద్దుగుమ్మనంట. దీంతో ఈ బ్యూటీ గురించి నెట్టింట్లో తెగ సెర్చ్ చేయగా జాబిలి పాత ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. దీంతో బ్యూటీ అందానికి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ అయిపోతున్నారు. ఈ మూవీతోనే ఈ చిన్నది కుర్రకారు క్రష్ అయ్యిపోయింది.





# షకీరా ఇండియా మ్యూజిక్ కాన్సర్ట్ రద్దు

## ఇరాన్ అమెరికా వార్ ఎఫెక్ట్..

ప్రపంచ ప్రఖ్యాత పాప్ సింగర్ షకీరా భారతదేశంలో నిర్వహించాల్సిన సంగీత కచేరీలు అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు తెలుస్తుంది. పశ్చిమాసియాలో, ముఖ్యంగా అమెరికా మరియు ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు మరియు యుద్ధ వాతావరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. జోమాటోకు చెందిన 'డిస్ట్రిక్ట్' ప్లాట్‌ఫారమ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 10, 11 తేదీల్లో ముంబైలో, అలాగే ఏప్రిల్ 15న ఢిల్లీలో ఈ వేడుకలు జరగాల్సి ఉంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత షకీరా భారత్‌లో ప్రదర్శన ఇవ్వబోతుండటంతో భారీ ఎత్తున టికెట్లు అమ్ముడయ్యాయి. అయితే ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా షకిరాతో పాటు, అభిమానుల భద్రతే తమకు ముఖ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. టికెట్లు కొనుగోలు చేసిన వారికి 5 నుంచి 7 పని దినాల్లో పూర్తి డబ్బు వెనక్కి ఇస్తామని హామీ ఇచ్చారు. కాగా, కేవలం కాన్సర్ట్ టికెట్లే కాకుండా విమాన ప్రయాణాలు, హోటల్ బుకింగ్స్ చేసుకున్న అభిమానులు ఈ హఠాత్తు నిర్ణయంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



# అత్యధికంగా పన్ను చెల్లించిన బిగ్‌బీ

బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. అత్యధిక పన్ను చెల్లిస్తున్న సెలబ్రిటీగా చరిత్రకెక్కాడు. 2024-2025 సంవత్సరానికి బిగ్ బీ అమితాబ్.. సుమారు 120 కోట్ల ఆదాయ పన్ను చెల్లించారు. పన్ను చెల్లింపుల్లో ఆయన షారూక్ ఖాన్, విజయ్‌లను దాటేశారు. గత ఏడాది షారూక్ ఖాన్ 92 కోట్ల ట్యాక్స్ చెల్లించారు. అయితే ఇప్పుడు ఆ రికార్డును బాలీవుడ్ నటుడు అమితాబ్ చెరిపేశారు. 82 ఏళ్ల ఆ స్టార్ నటుడు 2024-25 సంవత్సరానికి 120 కోట్ల పన్ను కట్టారు. కల్కి 2898 ఏడీ, వెట్టియాన్ చిత్రాల్లో అమితాబ్ నటనపై ప్రశంసలు కురిశాయి. బ్రాండ్ ఎండోర్స్‌మెంట్లతోనూ బిగ్ బీ ఆర్జన రెట్టింపు అయ్యింది. కౌన్ బనేగా కరోడ్‌పతి సీజన్ 16 ద్వారా కూడా ఆయన ఆదాయం పెరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వార కూడా అమితాబ్ తన ఆదాయాన్ని పెంచుకున్నది. చిత్రాలు, టాప్ బ్రాండ్లకు ప్రమోటర్‌గా అమితాబ్ అత్యధిక స్థాయిలో ఆర్జిస్తున్నారు. అయితే 2024-25 సంవత్సరానికి ఆయన సుమారు 350 కోట్లు ఆర్జించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తుల్లో అత్యధికంగా ఆర్జిస్తున్న ఆర్టిస్టుగా అమితాబ్ నిలిచారు. పన్ను చెల్లింపుల్లో దేశ ప్రజలకు అమితాబ్ రోల్‌మోడల్‌గా ఉంటాడని ఓ వ్యక్తి తెలిపారు. సెక్షన్ 84, కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లో కూడా అమితాబ్ నటిస్తున్నాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com